
సహజ మార్గ
దశనియమాల దివ్య సౌందర్యం
కస్తూరి బెహెన్

# సహజ మార్గ
# దశనియమాల దివ్య సౌందర్యం



## కస్తూరి బెహెన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# సహజమార్గ
# దశనియమాల దివ్యసౌందర్యం

# सहज मार्ग के
# सारगर्भित दस नियम

## DIVINE BEAUTY OF
# TEN COMMANDEMENTS IN
# SAHAJ MARG SYSTEM

కస్తూరి బెహెన్

# సహజమార్గ దశ నియమాల దివ్య సౌందర్యం

## విషయ సూచిక

పేజీ నెం.


| | | |
|---|---|---|
| 1. | రెండు శబ్దాలు | 3 |
| 2. | సమర్పణ | 4 |
| 3. | పరిచయం | 6 |
| 4. | మొదటి నియమం | 8 |
| 5. | రెండవ నియమం | 10 |
| 6. | మూడవ నియమం | 16 |
| 7. | నాల్గవ నియమం | 20 |
| 8. | ఐదవ నియమం | 25 |
| 9. | ఆరవ నియమం | 28 |
| 10. | ఏడవ నియమం | 31 |
| 11. | ఎనిమిదవ నియమం | 33 |
| 12 | తొమ్మిదవ నియమం | 36 |
| 13. | పదవ నియమం | 40 |
| 14. | ఉపసౌందర్యం | 45 |
| 15. | అవతరాల దివ్య రహస్యం | 47 |
| 16. | కృతజ్ఞత కాదు ప్రేమ | 48 |

# సహజమార్గ దశ నియమాల దివ్య సౌందర్యం
## రెండు శబ్దాలు

ఇప్పుడు నావద్ద 'వారి దరహాసం' అన్న రెండు సంతోషభరిత శబ్దాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటి ద్వారానే పూర్తి సాధనా రహస్యాన్ని పొంది, అందు మునిగిపోవటానికి తపస్విని గా తయారై ఆ సమయం ఎప్పుడు ఆసన్నమవుతుందా అని అనుక్షణమూ నిరీక్షిస్తూ ఉండిపోయాను. ఈ లేఖిని ఎవరి స్పర్శతోనైతే కొంత వ్రాసి ఉండి, ఇంకా ఏదో వ్రాయటానికని సిద్ధపడుతుందో అప్పుడు 'వారి' ద్యివ్య స్పర్శతోనే మళ్ళీ వ్రాస్తూ ఉంటుంది; మధ్యలో ఆగి మళ్ళీ వ్రాయటానికని శబ్ద సముదాయం కోసం సాలోచన చేస్తూ ఉంటుంది. హృదయ దృష్టి (లక్ష్యం) కూడా లయమైపోయి ధ్యేయమే తానైపోయినప్పటికీ, దివ్య విభూతి **(వారి)** స్పర్శ దానినిపట్టి నడిపిస్తోంది కనుక లేఖిని ఆగలేదు, ఆలోచనలో పడలేదు. ఆ విధంగా అండగా నిలవటానికి కూడా 'వారి'దే పూచీ. ఎందుకంటే, 'వారి' మొట్టమొదటి దర్శన సమయంలో, ప్రథమ వాక్యంలో– "నేను కూడా నీ కోసమే ఎంతోకాలంగా నిరీక్షిస్తున్నాను" అనీ, రెండవ వాక్యంగా "ప్రాపంచికమైన కస్తూరి గతించింది, ఇప్పుడు ఉన్నది నా కస్తూరి" అనీ, మూడవ మాటగా "నీవు సంపూర్ణంగా నేను వ్రాసినవాటిని, చెప్పిన వాటిని అలాగే నీపై చేసిన ఆధ్యాత్మిక పరిశోధనలను నీ అనుభవంతో మేళవించి రచనల ద్వారా దీపింపజేయి", అనీ చెప్పటమే అందుకు కారణం.

నేను నా అనుభవపు రంగులో రంగరించబడిన నా రచనలోని 'వారి దరహాసం' అను రెండు శబ్దాల పరమ ఆనందం, శ్రీ బాబూజీ మహరాజ్ ఆశించిన దానిని నెరవేర్చి సర్వత్రా **వారి** ప్రత్యక్షతను పొంది స్వయంగా 'వారి దరహాసం' లోనే వికసించి చిందులు వేసినట్లనిపించింది. ఆనందగీతికకు 'డివైన్' అనేది లయ, సమతుల్యం అనేది తాళం, నా ఈ పుస్తకం "సహజమార్గ సారగర్భిత దశనియమాలు" స్వరం – వీటితో 'వారి దరహాసం' పులకించి పల్లవించింది. ఇంకా చెప్పాలంటే, నా పరమ ఆనందం ఇప్పుడు 'వారి' దివ్య దరహాసానికి అర్పితమైపోయింది.

ఇంతకీ సారాంశం ఏమిటంటే, బాబూజీ తమ సర్వస్వాన్ని నాకు అర్పణ చేసి కూడా ఆఖరికి 'వారు' నా నుంచి ఆశించినది సమస్త మానవాళి ప్రయోజనం కోసం **తమ** పరిశోధలను పుస్తక రూపంలో రూపొందించటం మాత్రమే. ఈ మాత్రమైన ఆపేక్షయే ఇప్పుడు నాచే పరమ ఆనందంతో పూర్తిచేయబడి 'వారి' దివ్య దరహాసానికే సమర్పించబడింది. ఆ పరమ పురుషుడు ఇంక ఈ అనంత (అల్టిమేట్) యాత్ర సందర్భంగా తటస్తపడిన అహం యొక్క పదహారు వలయాలు, ఆవరణలు తొలగించి, ఏ ఇక్కట్లను నివారించారో– అవి అన్నీ కూడా సమస్త జనుల సముద్ధరణ కొరకు శాశ్వతంగా రూపుమాసిపోయాయి. ఇంతేకాకుండా సంపూర్ణమైన దివ్య పరిశోధనలో సహజమార్గపు పూర్తి ఆధ్యాత్మిక శిక్షణను 'వారు' **తమ** దివ్యశక్తితో నింపి సుసంపన్నం చేసి ఈశ్వరీయ జ్ఞాన భాస్కరుని ద్వారా ప్రకాశింపజేశారు.

నా ఈ రచన "సహజమార్గ దశనియమాల దివ్య సౌందర్యం"కి 'వారి దరహాసం' అను 'రెండు' శబ్దాలే ప్రాణ ప్రదమయ్యాయి.

# సమర్పణ

"చౌబేజీ, మీ కస్తూరి అంటే ప్రాపంచికమైన (ఈ ప్రపంచపు) కస్తూరి మరణించింది. ఇంక మిగిలింది నా కస్తూరియే" అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు. మొదట స్వీకారము, తర్వాత సమర్పణ జరిగినటువంటి తల్లక్రిందుల వ్యవహారాన్ని ఎవరైనా విని ఉంటారంటారా! 'నా' శబ్దాల దివ్య సౌభాగ్య సమక్షంలో ఏ లేఖినియైనా ఎంతగానైనా చెప్పటానికి నోరు విప్పి సాహసించగలదా? వాస్తవం ఏమంటే, నా పరమ జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ ఆది నుంచి అనంతం వరకు గల యాత్రల యొక్క దశల వర్ణనా వైశిష్ట్యాన్ని వ్రాయటానికి తమ దివ్యస్పర్శనే కలిగించి నా లేఖినిని ధన్యం చేశారు. ఇలా వాస్తవంగా జరిగిన దానిని కూడా నేను ఇప్పుడు వెలుగులోకి తెస్తున్నాను. అదేమంటే, 'వారి' దైవిక ఇచ్ఛతో నా స్మరణను చిలికి నాచే రచింపబడిన పుస్తకాల రూపంలో వాస్తవికత యొక్క నిజతత్వమును స్వచ్ఛమైన ముత్యాలుగా వేటినైతే నాకు ఇప్పటివరకు ప్రసాదించారో, వాటిని 'వారి' చరణాలవద్దనే సమర్పించి నేను నా రచనలు సార్థకమైనట్లుగా అనుభూతి చెందుతున్నాను. అయితే దివ్యమైనదీ, సాటిలేనిదీ అయిన 'వారి' దివ్యప్రేమతో నన్ను అనగా తమ ఈ కుమార్తెను 'నాది' అని చెప్పి స్వీకరించటంలోని ప్రేమ ఏమిటో మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారా! అయితే చూడండి. 'వారి' దివ్య ప్రేమలో దివ్య ఈశ్వరీయ గతుల ఫలితం మాత్రమే వ్యాపించి ఉంది. 'వారి' అద్భుతమైన దైవిక ప్రేమలో సమస్త మానవాళి సమున్నతి కోసం 'వారి' ప్రాణాహుతి ప్రవాహం ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 'వారి' ప్రేమ మన నుంచీ ఏమీ ఆశించదు. ఇంకా విశేషం ఏమంటే, అది మనకు ఎల్లప్పుడూ విచక్షణ లేకుండా దివ్య అనంతధారను ప్రసాదిస్తూనే ఉంటుంది. సాటిలేని 'వారి' ప్రేమ, అంతిమం నుంచి ప్రాణుల హితం కొరకు అనుగ్రహించబడిన వరమై, మనల్ని భూమా క్షేత్రంలో తన సరస దివ్య దరహాసాన్ని ఆసరాగా ఊతమిస్తూ మన అనంతయాత్రను పూర్తి చేయిస్తుంది. 'వారి' దివ్యప్రేమ, ప్రాణిమాత్రులకు ఈశ్వరప్రాప్తిని వరంగా ఇవ్వటానికి ఆరాటపడుతూ ఉంటుంది. నా అనుభవానికి వచ్చింది ఎలా ఉందంటే, నేను ఒక్కసారైనా 'వారి'ని జ్ఞాపకం చేసుకున్నట్లయితే, 'వారి' ప్రేమైక దృష్టితో తమ దివ్యప్రేమ మాధుర్యంలో బంధించివేసి, ఆ జ్ఞాపకం స్థిరంగా, నిలకడగా అక్కడే నిలిచిపోయేటట్లు చేసింది. ఆ జ్ఞాపకమనేది అక్కడే స్థిరపడిపోయేసరికి క్రమంగా నేను అనే భావం (అహం), నా ఉనికి యొక్క జ్ఞానం  కూడా ఎప్పుడు, ఎలా హరించుకుపోయిందో తెలియకపోయింది. అప్పుడింక నేను ఈ కస్తూరి అనబడే కదలాడే బొమ్మ ఎవరు, ఆమె నివాసం ఎక్కడ – ఇత్యాదులు ఎవరిని ప్రశ్నించాలి?

ఓ బాబూజీ! మీరు సంపూర్ణ ఆధ్యాత్మిక క్షేత్రంలో అంతిమ సత్యం యొక్క ప్రత్యక్షతను కలిగించగల సామర్థ్యం, నిరాడంబరతతో విరాజిల్లుతున్నారు. అది ప్రకృతి యొక్క ముసుగును తొలగించి తమ దివ్య నివాస స్థాన ప్రత్యక్షత (అనంతం) ను కూడా అందరికీ దర్శనమయ్యే భాగ్యం కలిగించారు. ఇప్పుడు మీరే తమ పుస్తకం (దస్ ఉసూలాంకీ శరహ్) "దశ నియమాల వివరణ" గురించి వ్రాయగల సామర్థ్యాన్ని ఇప్పుడు నా లేఖినిలో నింపుతున్నారు. అది ప్రకృతి యొక్క, ప్రకృతికి చెందిన ఛాయా ప్రతిబింబరూపమైన దివ్య ప్రకృతి (నేచర్) సౌందర్యంలో మునిగి మానవీయ ప్రకృతికి శ్రేష్టత్వాన్ని సమర్పించటానికి గాను నేడు

సమస్త ప్రకృతి యొక్క విజ్ఞాన నిగూఢ రహస్యాలను పూర్తిగా వెల్లడిస్తున్న నా ఈ పుస్తకం "సహజమార్గ దశనియమాల దివ్య సౌందర్యం" నా బాబూజీ మహరాజ్ పావన పాదద్వయానికి సమర్పితమయ్యింది. అది ప్రకృతి వైభవం గురించిన విజ్ఞానం భూమా ద్వారం తాకిన తర్వాతనే కనువిందు చేస్తుంది. అది పరమపురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ చరణాలు చుంబించిన తర్వాత, అంతిమం మరియు దాని ప్రకృతి యొక్క రహస్యాలతో సహా 'వారి'లోనే లయమైపోతుంది. ఇక నిజమైన అసలు సమర్పణం ఇదియే! ఇది వారికే సమర్పితం.

నేను శ్రీ బాబూజీ మహరాజ్ నుంచి పొందిన అనుపమ ప్రేమ, వాత్సల్యం ఎంతో సాటిలేనివి. అవి సమస్తానికి దివ్య ఆహ్వానంలాగా వాతావరణంలో వ్యాప్తమైపోయాయి. 'వారు' ఒకసారి "నాకు గురుదక్షిణ కావాలి' అని అన్నారు. నేను "మీకు ఏది కావాలో తీసుకోండి" అన్నాను. దానికి **వారు**, "నేను తీసేసుకున్నాను" అన్నారు. నేను అజ్ఞానురాలను, అదేమిటో గ్రహించలేక మౌనంగా ఉండిపోయాను. ఆ దక్షిణ ఏమిటో నాకు ఇప్పటివరకు తెలియకనే పోయింది. 'వారి' జ్ఞాపకంలోనే స్థిరంగా ఉండిపోయిన కనురెప్పలకు వెదకటానికి తీరిక లేకపోయింది. బహుశః నా ఈ పుస్తకం "సహజమార్గ సారగర్భిత దశ నియమాలు" **వారు** ఆశించినట్లుగా 'వారి' కోరిక మేరకు నా ఆఖరి అద్వితీయ దివ్యరత్నం. దీని ఆనందాన్నే, సంతోషాన్నే ఇప్పుడు వాస్తవిక దక్షిణ రూపంలో 'వారి' చరణారవిందాలవద్ద సమర్పిస్తున్నాను. మరుక్షణంలోనే ఆ ఆనందం కూడా స్వయంగా తన్ను తాను మరచిపోయినట్లు నాకు అనిపించింది. దానినిబట్టి నా ఈ అమాయకపు ఈ స్వచ్ఛమైన, చిన్ని దైవీయ సమర్పణ సంపూర్ణమైనట్లు ఆమోదముద్ర వేసి స్వీకరించారని తెలుసుకున్నాను.

నా లేఖిని ద్వారా 'వారి' దివ్య కాంక్షను నెరవేర్చిన నా ఈ పుస్తకాన్ని, నేను 'రెండు శబ్దాలు'లో వ్రాసిన "వారి చిరునవ్వు"కే సమర్పిస్తున్నాను.

# పరిచయం

"ఆధ్యాత్మికత యొక్క అత్యున్నత స్థాయిని ఎవరైనా పొంది ఉన్నప్పటికీ, వారిలో సత్ప్రవర్తన, సదాచరణ లోపించినట్లయితే వారు ఆధ్యాత్మిక క్షేత్రం యొక్క స్పర్శనైనా పొందలేరని నేను భావిస్తాను" అని లాలాజీ మహరాజ్ చెప్పారు. శ్రీ బాబూజీ మహరాజ్ తమ సహజమార్గ దశ నియమాలను సదాచరణ యొక్క సౌందర్యంతోనే పూర్తిగా తీర్చిదిద్దారు. దశ నియమాల వైభవాన్ని తమ జీవనంలో మేళవించుకున్నాకనే, ఏ మానవుడైనా సాక్షాత్కారం పొందటానికి యోగ్యుడవుతాడు. ఇందువల్లనే నేను ఈ పుస్తకంలో వీటిని ఆధ్యాత్మికోన్నతికి కొలబద్దగా స్పష్టం చేశాను.

శ్రీ బాబూజీ మహరాజ్ తమ పవిత్ర గ్రంథం – "మిషన్ కే దస్ ఉసూలోం కే శరహ్" (మిషన్ దశ నియమాల వర్ణన) లో ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆరంభం నుంచి అంతం వరకు గల పూర్తి పరిశోధననూ, ఆది నుంచి అంతిమ సత్యం వరకు గల ప్రతి దశనూ కళ్ళకు కట్టినట్లుగా అందరికీ విశదీకరించారు. 'వారు' ఆది–కేంద్రం (అనంత) యాత్రను ప్రాణిమాత్రులకు సులభతరం చేసి సహజమార్గ సాధన యొక్క అనంతయాత్రను కూడా భక్తిరసంతో తడిపి సరళంగానూ, సులభంగానూ ఉండేటట్లు చేశారు. 'వారు' ఇంకొక యదార్థమైన విషయాన్ని కూడా ధృవపరచారు. అది, ఆదిశక్తి (అల్టిమేట్) యొక్క క్షేత్రంతోపాటు ఆది ప్రకృతి యొక్క పరిశోధన కూడా జరగనట్లయితే, వీటి సహజమైన ఆది రహస్యం ఎవ్వరికీ అంతుబట్టేది కాదు. అప్పుడు దివ్యక్షేత్రపు అన్వేషణ అసంపూర్ణంగానే ఉండిపోయేది. ఇప్పుడు **వారి** దివ్యకృప మూలంగానే ఆది ప్రకృతిని గురించి సవిస్తరంగా వర్ణించే స్తోమతను నేను పొందగలిగాను. ఈ మహత్తర కృప వారిదే. వారి దైవిక ఇచ్ఛ ఇలా ఉంది: "నా పుస్తకాలలో, నా వ్రాతలో దొర్లిన ప్రతి మాటా, ప్రతి పాయింట్, ప్రతి రీజియన్ (మండలం) గురించి నీ స్వానుభవ పూర్వకంగా వ్రాయాల్సి ఉంది. తన్మూలంగా జనులు 'రామచంద్ర చాలా చెప్పి వెళ్ళారు, కాని చేసి చూపలేదు' అని వ్యాఖ్యానించకుండా ఉంటారు. అందువలన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆది నుంచి అంతిమ సత్యం కేంద్రం వరకు నీవు వ్రాసేది అనుభవ పూర్వకంగా ఉండాలి" అని చెప్పారు. 50 సంవత్సరాలకు పూర్వం పొందిన అనుభూతులు, వాటి దశల వర్ణన వ్రాసే సందర్భంలో నాకు అనుభవమైంది ఎలా ఉందంటే, ఆ దశ ఒక్కొక్కటి లీలామాత్రంగా నా ఎదుట కన్పిస్తున్నట్లు గాను, నా చేయి వ్రాసుకుంటూపోతున్నట్లుగాను అనిపించింది. అందుకు కూడా అలౌకికమూ, అద్భుతమూ అయిన **వారి** దివ్య కృపయే కారణం.

శ్రీ బాబూజీ మహరాజ్ పుస్తకం "దశ నియమాల వర్ణన" (దస్ ఉసూలాంకీ శరహ్) వాస్తవానికి వారిచే పరిశోధించబడిన ఆది ప్రకృతి లేదా దైవిక ప్రకృతిని బహిర్గతపరచే వర్ణనయని లేదా దాని స్వరూపమని నా అనుభవం చెబుతోందన్న విషయం వ్రాస్తూ ఉంటే నాకు ఇప్పుడు ఆంతరికంగా ఎంతో ఆనందం కలుగుతోంది. అది ఆది (అల్టిమేట్) నుంచి ప్రారంభమై ఈ భూప్రపంచం వరకు గల ప్రకృతి వర్ణన. ఇంకా చెప్పాలంటే, అలౌకిక దివ్య ప్రకృతి నుంచి లౌకిక లేదా భౌతిక ప్రకృతికి చెందిన అనుపమాన వ్యాఖ్యతో నిండి ఉన్న సత్యం అనీ, అది పుస్తకం అనే మాధ్యమం ద్వారా మనకు అందివచ్చిందనీ చెప్పవచ్చు. ఈ పుస్తకాన్ని మనం చదువుతున్నపుడు, ఈ నియమాల ద్వారా మొత్తం ప్రకృతి యొక్క ప్రకృతి (స్వభావం) మన

ఎదుట విరాజిల్లుతున్నట్లు అనిపిస్తుంది. అనగా అనంత దివ్య ప్రకృతి నుంచి ప్రారంభమై పృథ్వీపైని మానవ ప్రకృతి వరకు ఉన్న స్వరూపం, శక్తి వ్యాప్తి మొదలైన వాటి సంపూర్ణ రహస్యాలను శ్రీ బాబూజీ మహరాజ్ అందరికీ అవగాహన కలిగించారు. "నేను ఆధ్యాత్మిక విజ్ఞానం యొక్క ఏ రహస్యాన్ని రహస్యంగా దాగనివ్వను (దాచను)" అని 'వారు' చెప్పిన వాక్యం **వారి** రచనల ద్వారా నిరూపితమవుతోంది. దీనినిబట్టి ప్రకృతియే తన కణకణము యొక్క రహస్యాన్ని తన స్వామి ఎదుట విడమర్చి చెప్పిందనిపిస్తుంది. దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్ ఒక వైపున తమ ఇతర గ్రంథాలలో ఆధ్యాత్మిక విజ్ఞాన పరిశోధనల చివరివరకూ ఉన్న వర్ణనను అందరికీ విశదపరచినట్లుగానే మరో వైపున "దశ నియమాల వర్ణన" పేరుతో వ్రాసిన **తమ** పుస్తకంలో 'వారు' ఆది ప్రకృతి యొక్క రహస్యాల విజ్ఞానాన్ని కూడా అందరికీ గ్రహింపుకు వచ్చేటట్లు స్పష్టం చేశారు. ఇటువంటిది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఎందుకంటే, అవతారాలు దాల్చబడ్డాయి, తమ పని నిర్వర్తించుకొని చాలించబడ్డాయి. కాని "మావవమాత్రుల హృదయం ఈశ్వరప్రాప్తికైన కోరికతో మళ్ళీ నిండిపోవాలి" అను సంకల్పంతో దివ్య పురుషుడు ప్రస్తుతం ధరణిపైకి దిగిరావటంలో ఒక పరమ రహస్యం వెల్లడవుతోంది. అది ఏమంటే, మానవ ప్రకృతి (స్వభావం) మార్పు చెందకుండా ఈశ్వరప్రాప్తి అసంభవమనీ, అది ప్రకృతితో సానుకూలమైన జీవన వ్యవహారం లేకుండా భూమాకు (అల్టిమేట్) చేరటం సంభవం కాదనీ స్పష్టమవుతోంది.

ఇప్పుడు నా శ్రీ బాబూజీ మహరాజ్ ధ్యానంలో మునిగి ఉన్న నా లేఖిని, 'వారి' దివ్య గ్రంథం "'టెన్ కమాండ్‌మెంట్స్ ఆఫ్ శ్రీరామచంద్ర మిషన్ (దశ నియమాల వర్ణన)" యొక్క నియమాల ఆంతరిక దశ యొక్క దివ్యస్పర్శను పొందుతూ ఉండటంవల్లనే ఈ విషయం గురించి వ్రాయటానికి సాహసిస్తోంది. యదార్థం చెప్పాలంటే, కృప వారిది, స్పర్శ వారిది, లేఖిని మాత్రం నా చేతిలో ఉంది. అది 'వారి' దివ్య ముఖారవిందాన్నే వీక్షిస్తూ ఏదో చెప్పాలనుకుంటోంది!

# సహజమార్గ దశ నియమాల దివ్య సౌందర్యం
## మొదటి నియమం

**సూర్యోదయానికి పూర్వమే ప్రతి ఒక్కరూ మేల్కొని సూర్యుడు ఉదయించే లోపుగానే నియమిత సమయంలో పూజ చేయాలి. పూజ కొరకు ప్రత్యేక స్థలం, ఆసనం ఏర్పాటు చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు రోజూ ఒకే ఆసనాన్ని ఉపయోగించటానికి ప్రయత్నించాలి. శారీరక, మానసిక శుచికి ప్రాధాన్యత నివ్వాలి.**

ఎవ్వరమైనా సరే, సాధారణంగా ఏదైనా సాధన (పూజ) చేయబోయే ముందు శారీరకంగానూ, బాహ్యంగాను శుభ్రంగా ఉండాలని గట్టిగా భావిస్తాం. ఇటువంటి ఉద్దేశ్యం కలగ్గానే వేకువజామునే లేచి స్నానమాచరించటానికీ, పూజా పునస్కారాలు నిర్వహించటానికీ వెనకాడటంగాని, బద్ధకించటంగాని జరగదు. ఎందుకంటే, ఈ ఆలోచన మనలో 'ప్రేరణ' కలిగించి, బద్ధకాన్ని దరికి రానివ్వదు కనుక. సంకల్పంలో నిమగ్నమై ఉండటంవలన వేకువ జామున లేవటానికి గడియారం యొక్క అవసరం కూడా ఉండదు. ఆలోచన యొక్క తీవ్రతతో అంతరంగంలో ఒక తపన కలిగి, ఆ తపన యొక్క శక్తియే పూజ నిర్వహించటానికి ప్రేరణ కలిగిస్తుంది. రామాయణ గ్రంథ పఠనం కావచ్చు లేదా జపం కావచ్చు, ఇంకా వ్రతాలు పండుగ సందర్భాలు కావచ్చు – వీటిని నిర్వర్తించటానికి మనలో ఒక ప్రత్యేక ఉత్తేజం కలుగుతుంది. దాని మూలంగా మనకు అలుపూ సొలుపూ అనిపించవు. అయితే ఇది ఏదో ఒక ప్రత్యేక సందర్భానికి లేదా ఒక రోజుకు మాత్రమే పరిమితమై ఉంటుంది. ఒకే ఆసనం మీద కూర్చుండటంవలన మనం చేసే పూజలో చిత్త చాంచల్యం క్రమంగా క్షీణిస్తూ ఉంటుంది. ఆలోచనలనేవి మెదడుకు సంబంధించి ఉంటాయి కనుక ఈ చాంచల్యం దాని వరకే పరిమితమై ఉంటుంది. సహజమార్గ సాధనలో అభ్యాసీ అంతరంగంలో ఈశ్వరునిపైనే దృష్టి నిలిపి ఉంచాలన్న లక్ష్యాన్ని బాబూజీ మహరాజ్ ఇచ్చారు కనుక దానిలో పరివర్తనం జరుగుతూ ఉంటుంది. శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన సహజమార్గ విధానంలో ధ్యానప్రక్రియ ద్వారా అభ్యాసీ హృదయంలో ఎప్పుడైతే ఈశ్వరీయ జాడ లేదా ప్రతిబింబం యొక్క అనుభవం కలుగుతుందో, అప్పుడింక సంకల్పం అనేది శక్తిగాను, ప్రకృతి అనేది ఈశ్వరీయ ప్రకృతిగాను రూపాంతరం చెందసాగుతాయి.

సహజమార్గ సాధనలో బాబూజీ అభ్యాసికి, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని, మదిలో నిలిపి ఉంచుకొనే నిరంతర శిక్షణ ఇచ్చిన కారణంగా ఇందులో బాహ్యశక్తుల ఉనికి (ప్రభావం) తొలగిపోతుంది. సాధనలో ఇటువంటి ధ్యానప్రక్రియ మూలంగా అభ్యాసీ హృదయంలో, దివ్యత్వంతో సంబంధం నెలకొంటున్న కారణంగా బాహ్యమైన ఆ ఆరాటం ఆంతరికంగా ఉన్న ఆ దైవంతో సంబంధం నెలకొల్పుకోవటానికి ప్రారంభిస్తుంది. ఇలా స్థిరపరచుకోవటం ద్వారా క్రమంగా ఉత్పన్నమైన దివ్యతపస్సు, ఈశ్వరీయ సామీప్యత పొందాలనే వాంఛను వృద్ధి చేస్తూ ఉంటుంది. దాని ఫలితంగా మనం మన యొక్క స్పృహను కోల్పోయే దశను (విస్మృత స్థితి) పొందునట్లు చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే, బాహ్యంలో ఉన్న శక్తి తత్పరత (నిమగ్నత) మనల్ని బాహ్యంలో వ్యాపింపజేయటానికి పనిచేస్తూ ఉంటుంది. జపతపాలలో అధిక నిమగ్నత

కారణంగాను, అదే ధ్యాసలో ఉండటం మూలంగానూ మనస్సును అవే ఆలోచనలు అలుముకుని ఉంటాయి. మానవ స్వభావాన్ని ఇతర ఆలోచనల జోలికి పోనీయకుండా నిరోధించటం జరుగుతుంది. బహుశా నేను మొదట్లో పూజా పఠనాల్లో లీనమై ఉండటంవలన నా (బుద్ధి) స్వభావంలో చాంచల్యానికి బదులుగా నిశ్చలతత్వం ఏర్పడుతూ వచ్చిందని గ్రహించాను. కానీ ఆ నియంత్రణ అనేది స్వప్రయత్నమైనది కావటంవలన అది పరిమితంగా ఉండేది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో సహజమార్గ సాధన ద్వారా దివ్య సాక్షాత్కారం పొందాలనే లక్ష్యం ఎప్పుడైతే ఆంతరికంగా దృఢపడుతుందో అప్పుడు అది ప్రయత్నంతో పైన ఉన్న ఈశ్వరీయ ధ్యానంలో లీనమైపోతూ ఉంటుంది. మానవ ప్రకృతి (నైజం) తన సంయమ నియమ నిబంధనలు అను సంకెళ్ళను సడలించుకోవటానికి సన్నద్ధమైనప్పుడు ఊర్ధ్వంతో సంబంధం కలిగి ఉంటూ ఉంటుంది. ఈశ్వరప్రాప్తి అను లక్ష్యంలో తనను కోల్పోయి దివ్య ప్రాణాహుతితో జలకమాడిన మన మనస్సు ఆంతరికాన్ని పరమ పవిత్రం చేస్తుంది. ఆంతరికం యొక్క ఈ నిర్మల దశ ఒకానొక రోజున బాబూజీ యొక్క దివ్య ప్రాణాహుతి ప్రవాహంతో అభ్యాసీ యొక్క పూర్ణ వ్యవస్థను విశుద్ధావస్థలో ముంచివేస్తుంది. ఇప్పుడింక శ్రీరామచంద్ర మిషన్ యొక్క సహజమార్గ సాధనా పద్ధతికి చెందిన ప్రథమ నియమం మనల్ని ద్వితీయ నియమంలోకి తరలించుకుపోతుంది.

# రెండవ నియమం

**పూజను ప్రార్థనతో ప్రారంభించాలి. హృదయాన్ని ప్రేమతో నింపిన ఆ ప్రార్థన ఆత్మోన్నతి కొరకైనదిగా ఉండాలి.**

"మన లక్ష్యం ఎంత శ్రేష్టమైనదిగా ఉంటుందో అంతే శ్రేష్టత్వం మన ధ్యానంలో ప్రవేశిస్తూ ఉంటుంది" అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు. ఈశ్వరప్రాప్తి అను దివ్య లక్ష్యాన్ని మన ముందు ఉంచి 'వారు' తమ సన్నిధిలో మనకు శరణు కల్పించారు. సంస్థ యొక్క దశ నియమాల ద్వారా దైవిక సౌందర్యం అనే దానిని ధరించడానికి 'వారు' మనల్ని ఆహ్వానించి ఉన్నారు. దశ నియమాలతో కూడిన దైవిక దశ ఈశ్వరప్రాప్తి కొరకు చేసే ధ్యానంలో ముందు ఉంచుతూ, మన అంతరంగాన్ని తన సౌందర్యంతో శోభింపజేస్తూ మనల్ని లక్ష్యం పొందటానికి యోగ్యులుగా తయారుచేస్తుంది. మనం మన బాబూజీ యొక్క ఆసరాతో సాగిపోతూ ఉండటంవలన మనకు ఈశ్వరీయ ధార యొక్క లోతుల్లో నిరంతరం మునిగి ఉండే వరప్రసాదం లభిస్తుంది. ఈశ్వరీయ శక్తి ఆది కేంద్రమైన అనంతం (అల్టిమేట్) నుంచి ప్రపంచాన్ని శోభాయమానం చేయటానికి ధరణి మీదకు దిగివచ్చిన దివ్యపురుషుని సాంగత్యంవల్లనే మనం దివ్యశోభతో విరాజిల్లుతున్నాం. అనుభూతి అనేది దివ్య ఆకర్షణ యొక్క సంధానంగా (లింక్‌గా) తయారై దాని ద్వారా అభ్యాసి యొక్క అంతరిక దృష్టి మరియు అనుభూతికి ఈశ్వరీయ గతుల రసానుభూతితోపాటు, ఈశ్వరీయ సామీప్యత యొక్క వాత్సల్యపూరిత వెచ్చదనం కూడా ఎల్లప్పుడూ లభిస్తూ ఉంటుంది. ఇంకొక వాస్తవమైన విషయం ఏమిటంటే, మన అహం ఏ విధంగా కరిగిపోతుందంటే, దివ్య సౌందర్యం యొక్క దశ నియమాలు అనే సోపానాల దివ్య దశల అనుభూతుల దివ్య రసాస్వాదనలో 'మన' అనే భావం లయమైపోతుంది. ఇదే విధంగా ఉన్నతి చెందుతూ మన బాబూజీ యొక్క ప్రేమ దృష్టిలో పయనిస్తూ ఉంటే ఒకానొక రోజున, 'వారి' ఈశ్వరీయ ధారా ప్రవాహం మనల్ని ఈశ్వరీయ ముఖ్య కేంద్ర బిందువులో ముంచేస్తుంది. మన ప్రార్థన లేదా ఆత్మ నివేదన స్వీకరించబడి మన ప్రళయం జరిగిపోతుంది. అనగా 'నేను' అను ఆత్మపరమైన ద్వైత భావం సమసిపోయి సృష్టికర్తలో అనగా ఈశ్వరీయ కేంద్రంలో విలీనమైపోతుంది. ఈ విధంగా అభ్యాసి యొక్క మనస్సు ప్రార్థన యొక్క ప్రాణంలో మునిగిపోయి, తాను విముక్తి చెందుతున్న స్పృహ కూడా లేకుండానే విముక్తమైపోతుంది.

**2.** మన మిషన్‌కు చెందిన రెండవ నియమం యొక్క వాస్తవిక దశలో ప్రవేశించిన అంతరాత్మ వివశత్వం చెందుతుంది. నేను గ్రహించిన మరొక అద్భుత విషయం ఏమిటంటే, ఎప్పటి నుంచైతే అంతరంగంలో ఈశ్వరుని ఉనికి అనుభవమవుతూ ఉంటుందో, ఇంక అప్పట్నుంచే ఆంతరికం ఆత్మ నివేదన దశలో అడుగుపెట్ట సాగుతుంది. అనగా ప్రార్థన తన ప్రాణాన్ని ప్రియతమునికి అర్పించేసినట్లవుతుంది. ఇప్పుడింక ప్రార్థించేది ఎవరు? ప్రార్థించేది ఎవరిని? ఇప్పుడు హృదయంలో నిరంతరంగా ఉంటున్న ఈశ్వరానుభూతి, మన ఆత్మ నివేదనను స్వీకరించి మనమే ప్రార్థన రూపం దాల్చినట్లుగా చేసేస్తుంది. శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా ఎవ్వరైతే ఈశ్వరాన్వేషణకై దప్పికగొని ఉంటారో వారికి ఆ ధ్యానం మినహా ఇంకేమీ రుచించవు.

క్రమంగా అభ్యాసి దృష్టి నుంచి భౌతిక ప్రపంచం తొలగిపోయి, దృష్టి అంతా ఈశ్వరీయ లోకంలోనే విహరిస్తూ ఉంటుంది. అప్పటి నుంచీ అభ్యాసి హృదయం దైవం యొక్క ఉనికిని విస్మరించకుండా ఉండాలని ప్రార్థనలో స్వయంగా అర్థించేదిగా అయిపోయి, ధ్యానంలో బందీగా అయిపోయి అహం నుంచి విముక్తమైపోతుంది. ఇంకా చెప్పాలంటే, హృదయ నైర్మల్యం ఫలితంగా బాహ్య పరిస్థితులలో ఉంటూ కూడా ధ్యానం ద్వారా హృదయంలో నెలకొని ఉన్న ఈశ్వరసాంగత్యం పొంది మనం శక్తిమంతులం అవుతున్నట్లుగా తలపిస్తుంది. ఇప్పుడు ఒక వింతైన ఆంతరిక దశ ఏర్పడుతుంది. అదేమిటంటే, ఒకవైపు ప్రతి సమస్య విషయంలోను శక్తివంతమైన మనస్సు దృఢంగా ఉన్నట్లుగాను, మరొకవైపు ఆధ్యాత్మిక దశల పరమానందంలో మునిగి ఉన్న మనస్సు తన ఉనికినే కోల్పోయినట్లుగాను అవుతుంది. “మనం ఎలా వచ్చామో అలా అయిపోవాలి” అని బాబూజీ చెప్పినది మనపట్ల నిజమౌతుంది. ఇలా ఎందుకంటే, సహజమార్గ సాధనలో సంక్రమించిన ఈశ్వరీయ గతులే మన మనస్సుగా అనిపిస్తుంది. ఇప్పుడు చూడండి, బాహ్య శుచిగా ఉండటం ద్వారా మన సాధన ఆరంభమై క్రమంగా ఆంతరిక మనస్సు ధ్యానంలో నిమగ్నమై ఉండే అలవాటును అభ్యసిస్తూ, ఈశ్వరీయ ధారా ప్రవాహంలో స్నానమాడుతూ, సహజమార్గ సాధనయొక్క మూడు అంగాలు – ధ్యానం, నైర్మల్యం మరియు ప్రార్థనతో జతకూడిన మానవ జీవన విధానాన్ని ఆధ్యాత్మిక జీవన విధానంగా తయారుచేస్తుంది. మానవ జీవిత మింక ధన్యమైనట్లనిపిస్తుంది. దీనివలన నా అనుభవానికి ఏమి అనిపించిందంటే, మిషన్‌యొక్క దశ నియమాలను పాటించటం ద్వారా సహజమార్గ సాధనలో మన ఆలోచన మరియు ధ్యానం ఎప్పుడైతే అమితంగా లీనమై ఉంటాయో అప్పట్నుంచి మన బాబూజీ ద్వారా హృదయంలో పొందే పవిత్ర ప్రాణాహుతి ధారా ప్రవాహంలో నిరంతరం మునిగి ఉండి, ఆంతరిక నియమ పాలన ఫలితంగా దైవిక సౌందర్యంతో అలరించబడినట్లుగాను, ఆ విధంగా మనం పొందిన సౌందర్యంతో మిషన్ యొక్క రెండవ నియమంపై విజయం సాధించినట్లుగాను అనిపించింది.

3. “ధ్యానంలో మునిగి ఉన్న అభ్యాసి యొక్క పరిచయమే అతడు చెప్పకనే శ్రీరామచంద్ర మిషన్ యొక్క అభ్యాసి అని అనిపించాలి” అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన వాక్యం నాకు చాలా అర్థవంతమైనదిగాను, ప్రియముగాను అనిపించింది. సహజమార్గం యొక్క దశ నియమాల దివ్య సౌందర్యానికి అభ్యాసి ప్రతిరూపంగా లేదా చిహ్నంగా నిలుస్తాడు అని నా అనుభవం– అందరినీ పిలిచి చెప్పాలని వాంఛిస్తోంది. అంతేగాకుండా అతడు మన సంస్థ యొక్క ఘనతకు కూడా సజీవ ప్రతిరూపంగా నిలుస్తాడు. మన మిషన్ యొక్క సాధనాంగాలైన ధ్యానం, ప్రక్షాళన మరియు ప్రార్థనలకు స్వరూపంగా మనం అయిపోయినందువలన మన సంపూర్ణ జీవన శైలి, వాక్కు మరియు ప్రవర్తనలోను స్వాభావికమైన ఆత్మికాకర్షణ ఏర్పడుతూ ఉంటుంది. అనగా మన జీవనసరళిలోని దివ్య ప్రేమాకర్షణ ద్వారా మన మిషన్‌యొక్క మూడు సాధనాంగాలు మరియు దశ నియమాల యొక్క సౌందర్యం గుర్తించబడటంవలన మన మిషన్ సజీవంగా విలసిల్లుతుంది. ధ్యానమనేది మన ఆంతరికానికి చైతన్యవంతమైన ప్రహరీ లేదా రక్షణగా నిలిచి, గీతలో వర్ణించబడిన ‘స్థిత ప్రజ్ఞ’ అనబడు

శ్రేష్ట దశకు సరియైన వ్యాఖ్యానంగా తయారవుతుంది. దానివలన ఈశ్వరప్రాప్తియే లక్ష్యంగా కలిగిన మన అంతరాత్మ నిర్విరామంగా ఉన్నతి పథంవైపు పయనిస్తూ ఉంటుంది.

**4.** ప్రియమైన పాఠకులారా! నేను ఈ పుస్తకం వ్రాయటానికి పూనుకున్నానే కాని, దీనిని వ్రాయటంలో నిమగ్నమైన నా జ్ఞానానికి ఎప్పుడు, ఎక్కడ ఏఏ నియమాలు తమ సౌందర్యాన్ని నా వ్రాతలో పొందుపరుస్తున్నాయో నాకు తెలియటం లేదు. వాస్తవం ఏమంటే, ఎప్పుడైతే నిరంతర స్మరణ ద్వారా ఆలోచనల యొక్క స్థావరం మన మెదడులో కాకుండా ఆత్మతో సంబంధం కలిగి ఉంటుందో అప్పటి నుంచి ఆలోచనలకింక ఆత్మ నుంచి శక్తి లభిస్తూ ఉంటుంది. అదే వాటికి మూలం కూడాను. అప్పట్నుంచే వాటికి ఆత్మిక – దశల రసానుభూతి మినహా మరేవీ రుచించనట్లవుతుంది. ఇప్పుడిక అభ్యాస ఫలితంగా నిరంతర స్మరణ అనే సూత్రం (బంధం) దైవంతో సంధానించబడింది కనుక అభ్యాసి యొక్క అభ్యాసం సఫలమైందని అనుకోవాల్సి ఉంటుంది. అనగా శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా ఆధ్యాత్మిక క్షేత్రంలో అభ్యాసీ కొరకు యాత్రా ద్వారం తెరవబడుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ వివరించిన ప్రేమ మరియు అభ్యాసపు మూడు అంశాలు అభ్యాసిని ఈ ద్వారంలో ప్రవేశపెట్టి అవి అక్కడే విలీనమైపోతాయి. వీటినే శ్రీ బాబూజీ మహరాజ్ ఉర్దూ భాషలో – "ఇబ్ద్, మోబిద్ (ప్రపన్న), మోబిద్–ఉల్–ఇబాద్ (ప్రభుప్రపన్న) గా వర్ణించారు. అవి తమ సౌందర్యంతో మనల్ని అలంకరించి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రవేశపెట్టడం వలన, ఇపుడు అనంతయాత్రా మార్గం ప్రశస్తమైనదిగా మనకు అనుభవమవుతుంది. ఆ ఆనందానుభూతి మన ముందున్న విరామ స్థావరాలన్నిటినీ వదిలిపెట్టి, మనం నిరంతరం తపనలో మునిగి ఉండే విధంగా చేస్తుంది. అది బహుశః ఈ అశాంతియే మనకు శాంతి అని చెప్పినట్లవుతుంది. ప్రియతముడైన ఈశ్వరుని సామీప్యత యొక్క దివ్య వెచ్చదనం మనలో ఇప్పుడింక నిరంతరం పుంజుకుంటూ ఉంటుంది. ఈ దివ్య వెచ్చదనం కలిగాక, 'నేను' అనే భావం కరిగిపోయి దైవం ఉనికి యొక్క భావమే మనలో ఉధృతమవుతున్నట్లుగా నేను అనుభూతి చెందాను. దైవ సామీప్యతానుభూతి ఇక్కడ సమకూడి ఉన్నందున 'మనము' అను స్పృహకు ఇక్కడ స్థానమే లేనందున దీనిని ఆధ్యాత్మిక క్షేత్రం అనదగునో లేక దైవక్షేత్రం అనదగునో! బహుశః ఇందుకే ప్రేమ మార్గం అతి ఇరుకైనది, దానిలో ద్వైతానికి (ఇద్దరికి) తావులేదు అని ఋషులు వివరించారు కాబోలు. అయితే ఇక్కడి స్పృహ లేకపోయిన స్థితిని గురించి చెప్పాలంటే, ఒకవైపు దివ్యక్షేత్రపు అనంతవ్యాప్తి నెలకొని ఉంటుంది; మరోవైపు తన ఉనికి యొక్క (ఎగో) భావానికి చెందిన స్పృహ లేకుండాపోతుంది. అది ఎంతగానంటే ఇప్పటివరకు ఉన్న 'నేను'ను నేను అంటే ఆ 'నేను' శబ్దం ఏకాకిగా నిలిచిపోతుంది. మరిక్కడ ఎలా ఉంటుందో మీరే చెప్పండి! మన బాబూజీ యొక్క దివ్య దరహాసం సమక్షంలో ఎవ్వరి ఛాయ దరిచేరకపోతుందో అప్పుడే అతడు (అభ్యాసీ) ఒంటరిగా నిలబడి, 'నేను' అను దాని యొక్క ఛాయ కూడా లేనివాడై శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దరహాసమయమైపోతాడు. బహుశ ఇందుకే ఈ అనుపమ దివ్య అనంత యాత్రా క్షేత్రం 'మనం' లేకపోయినా కూడా మనకు పరమానందమయమైన క్షేత్రంగా అయిపోతుంది. 'వారి' సామీప్యత యొక్క ఈ దివ్యక్షేత్రం మనదై వారి మందహాసంతో నింపబడిపోగా మరి మనం ఇంకెక్కడికి పోవాలంటారు?

ఈ దైవిక దరహాసం ఎంతవరకైతే విస్తరించి ఉండి మన అనంతయాత్ర కొరకు ఆహ్వానిస్తూ ఉంటుందో అంతవరకూ వెళ్దాం మరి! తల్లి యశోద శ్రీకృష్ణభగవానుని నోటిలో వారి విరాట్ దర్శనం దర్శించినట్లుగా చెపుతుంటారు. నేనయితే అంతిమ సత్యం నుంచి దిగివచ్చిన దివ్య పురుషుని మందహాసంలో అనంతయాత్ర యొక్క దర్శనం పొందాను అని వ్రాస్తాను.

**5.** ఇపుడు అభ్యాసి, హృదయంలో ఈశ్వర సంగమంలో మునిగి ఉండే అభ్యాసం ద్వారా 'వారి' సామీప్యతా క్షేత్రాన్ని పొందాడని గాని లేదా తన అభ్యాసం అనే ప్రయత్నం 'వారి'ని అతని సమక్షానికి తీసుకొచ్చిందని గాని చెప్పవచ్చు. బాబూజీ ఏమన్నారంటే – "మనం జీవితాంతం 'వారి' పొందుకోసం ప్రయత్నించటానికే లేము" అన్నారు. వారిది అనగా ఈశ్వరుని దేశం చేరుకున్నాము అంటే మన పాట్లు ముగిసినట్లే. ఇప్పుడు 'వారి' బాధ్యతగా మిగిలి ఉన్నదేమంటే – వారి శరణు పొందిన మనకు వారి దేశంలో ప్రవేశం కల్పించటమూ, మనల్ని అక్కడి అలంకారాలతో అలంకరించి అక్కడి దివ్య జీవనానికి యోగ్యులుగా చేయటం. అపుడు, వారి స్మరణయే మనదిగా ఎంచుకున్న మనకు దాని సుందరఫలం దక్కినట్లవుతుంది. ఎలా అంటే, ప్రతి సుందరమైన దశ యొక్క ప్రతిరూపాన్ని 'వారు' నా అనుభూతికి తెచ్చిన ఫలితంగానే నా 'అనంతయాత్ర' అను పుస్తకం వెలుగులోకి వచ్చింది. నిజంగా దివ్య విభూతి తరపున మన ఈ ప్రేమ స్వరూపుడే – మానవమాత్రులు స్వయంగా సత్యపథ్ చేరటానికి ప్రయత్నించాల్సిన అవసరం లేకుండా, ప్రాణిమాత్రుల కోసం ఈశ్వరప్రాప్తి తర్వాత 'సత్యపథ్' యొక్క ద్వారం కూడా శాశ్వతంగా తెరచి ఉంచారు.

ప్రతి క్షేత్ర ద్వారంతోపాటుగానే ప్రతి పాయింట్ యొక్క దివ్యదశను తమ పరిశోధనా ఫలితంగా ఇపుడు సమస్త జనులు, ఆది నుంచి అనంతం వరకు పొందటానికి ఒక సూటియైన, సహజమైన ద్వారాన్ని 'వారు' ఆవిష్కరించారు. ఈ ఆధ్యాత్మిక ఈశ్వరీయ క్షేత్రంలో ప్రవేశించగానే ఆది నుంచి అనంతం వరకు గల యాత్రామార్గం, అందరి కోసం సరళమైనదిగాను, సులభమైనదిగాను మరియు సహజమైనదిగాను చేశారు. ఎందుకంటే ఈ క్షేత్రంలో ప్రవేశించిన తర్వాత భక్తి యొక్క ఆకర్షణ దశ తారుమారయిపోతుంది (తీరు మారిపోతుంది). ఎందుకంటే నా అనుభవం దృష్ట్యా ఇక్కడ దైవిక ఆకర్షణ అభ్యాసిని తనవైపు ఆకర్షిస్తూ ఉంటుంది. నిజం చెప్పాలంటే, భక్తునికి భగవంతునికి ఆంతరికంగా బాంధవ్యముంది. ఎప్పుడైతే భక్తుడు తన ధ్యానమనే అడ్డును తొలగించుకొని భగవంతుని క్షేత్రంలో అడుగుపెడ్తాడో అప్పుడింక అతనికి అదుపేమి ఉంటుంది! ఎందుకంటే అతడు ప్రవేశించినది 'హద్దు'లేని దివ్యక్షేత్రం కనుక. ఏమైనప్పటికీ మన సంబంధం ఆది (మూలం) తోనే ఉంటూ వచ్చింది. కాని ఇప్పుడు దాని జ్ఞాపకం మనకు 'వారి' సామీప్యతను ప్రసాదించింది. ఇపుడు ఈ సంబంధం యొక్క హద్దే తొలగిపోయింది. జ్ఞాపకం అనే రసవాహినిలో మునిగిన హృదయాకర్షణ ఎప్పుడైతే తన హద్దున ఉన్న క్షేత్రాన్ని చేరుకుంటుందో, అప్పుడు భక్తుని జ్ఞాపకం గురించిన సందేశం అక్కడకు చేరిపోయిందని అనుకోవాలి. ఇంక అప్పుడే 'వారి' ఈశ్వరీయ ద్వారాలు ఒక్కటొక్కటిగా మన కొరకు తెరుచుకుంటాయి.

అపుడు 'వారి' సామీప్యత యొక్క వెచ్చదనం పొంది మనం పూర్తిగా ద్రవించిపోతాం. హృదయం ఉప్పొంగిపోతుంది. ఎందుకో తెలుసా? ఎందుకంటే మన ప్రేమాకర్షణ యొక్క వెచ్చదనం 'వారి' ప్రవేశద్వారపు హద్దును పడదోస్తుంది. ఇంకేముంది! ఇక్కడ నాకు అనుభవమైన ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మనం పూర్తిగా ద్రవించిపోయిన దాని తాలూకు ప్రతి బిందువూ బాబూజీ! బాబూజీ! అంటూ పిలవసాగుతుంది. అదెలా ఉంటుందంటే తప్పిపోయిన పిల్లవాడు తల్లి దర్శనం కోసం తల్లడిల్లిపోతూ ఉంటే అతని ప్రతి శోక బిందువు ఆమెలోనే ఇమిడిపోయినట్లుగా ఉంటుంది. "నా కణకణమూ నా ఎదట చెల్లాచెదురుగా విరజిమ్మబడి, బాబూజీ! బాబూజీ! అని ఆలాపించినట్లుగా ఉంది" అని నేను నా స్థితిని గురించి బాబూజీకి వ్రాసిన విషయం నాకిప్పుడు జ్ఞాపకమొస్తోంది. ఇప్పుడు యాభై సంవత్సరాల తర్వాత ఈ పుస్తకం వ్రాస్తున్న సందర్భంలో ఈ దశకు చెందిన క్షేత్రాన్ని మరియు దాని వాస్తవికతను తెలుసుకున్నాను. అదేమిటంటే, ఈ దశ మన అంతరంగంలో ఈశ్వరీయ ద్వారం తెరవబడిన తర్వాత ఈశ్వరీయ క్షేత్రంలో ప్రవేశిస్తున్న శుభసందేశంలాగ ఉంటుంది.

**6.** ఇప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ వచించిన దివ్యవాక్కు మన ఎదుట ఉన్న దైవికదశను ఏమని స్పష్టం చేస్తుందంటే, "మన హృదయం తెరవబడదు, దానికదే తెరుచుకుంటుంది" అని. మన మిషన్ యొక్క రెండవ నియమం, మన మిషన్ ప్రార్థనకు సంబంధించి ఉంటుందని నా అనుభవం దృఢపరుస్తోంది. మన మిషన్ యొక్క ప్రార్థన మొట్టమొదట మన హృదయంలో, మనసనే మందిరంలో విరాజిల్లుతున్న ఈశ్వరునితో "ఓ స్వామీ! నీవే మానవ జీవిత లక్ష్యము" అని పరిచయం కల్పిస్తుంది. క్రమంగా ఈ దివ్య చైతన్యం – ఆ ప్రియతముడు నీలోనే విరాజిల్లుతున్నాడు అను సత్యాన్ని మన హృదయమంతటా ప్రకాశింపజేస్తుంది. ఇంక అప్పట్నుంచీ అంతరంగం వారిని చేరటమే తన ధ్యేయంగా ఎంచుకుంటుంది. వారిని దర్శించాలనే తీవ్రకాంక్ష, మన ప్రార్థన యొక్క రెండవ పంక్తిని –"ఓ స్వామీ! మా కోరికలే మిమ్మల్ని చేరే మార్గానికి అడ్డుపడుతున్నాయి" అని చాటినప్పుడు మనకు ఈ విషయం తెలుస్తుంది. అప్పట్నుంచీ వ్యాకులమైన ఈ మూగవాణి తపన, కోర్కెలనే బంధనాలను క్రమంగా హరింపజేస్తుంది. దాని ఫలితంగా అప్పటి నుండి కోరికలకు కళ్ళెం వేసినట్లయి వాటి జోరు తగ్గుతుంది. సాక్షాత్కారం పొందాలనే ధ్యాస, మన కోరికలకు ఆధారం (మూలం) ఈశ్వర ధ్యానమే ననుకుంటూ మన అంతరంగంలో అడుగుపెడ్తుంది. ఈ ఆధారం మారుతూనే ధ్యానపటిష్టతలోను, లక్ష్యంపట్ల దీక్షలోను ఈ సత్యాన్ని నింపుతుంది. అదేమంటే అంతరంగంలోని వేదన యొక్క తపన ఈశ్వరీయ ద్వారాన్ని తట్టుతూ మన మిషన్ ప్రార్థనలోని మూడవ పంక్తి –"నీవే మా ఏకైక దైవానివి, ప్రియతముడవు" అని వారివద్దకు సందేశం పంపుతుంది. అప్పటి నుండి హృదయంలో నెలవై ఉన్న ఈశ్వరుని ద్వారం యొక్క తలుపులు పలచనైపోయి అక్కడి నుండి మనలోకి వ్యాపించే దివ్యవైభవం మూలంగా అక్కడ 'మనం' ఉన్నట్లుగా గాని, ద్వారం ఉన్నట్లుగా గాని అనిపించదు. మన స్పృహ ఆ దివ్య చైతన్యంలో లీనమైపోగా, భక్తి సంపన్నమైన ఈ దశ మనవైపు నుంచి స్వయంగా – "భక్తితో కొలవకపోయినా నన్ను తరింపజేస్తే ఆ ఘనత నీదగును" అని అంటుంది. అనగా మన మిషన్ ప్రార్థనలోని నాల్గవది, ఆఖరి

పంక్తి అయిన 'నీ సహాయం లేక నిన్ను పొందుట దుర్లభం' అని, ఆత్మనివేదన సహితమైన వ్యధ చెందుతూ వారికి సమర్పితమైపోతుంది. అటువంటి సందర్భంలోనే నా గీతంలోనీ ఈ పంక్తి – 'సౌందర్య వైభవం నేను తిలకించినపుడు తపించిన నా కన్నులు నిన్ను దర్శించగలిగాయి అని దశకు తగినట్లుగా గానంచేసి ఉంటుంది. అనగా తపనలో తడిసిపోయిన ధ్యానమగ్నమైన నేత్రాలు వారిని గుర్తించగలిగాయి. నా పరిచయానికి స్పందించి 'వారు' తమ ప్రేమ సాగరంలో ముంచి కరిగించివేశారు. దాని స్థానంలో 'వారు' తమ దివ్యత్వాన్నే నింపివేశారు. నాకిప్పుడు అర్థమైన దానినిబట్టి దానికి కారణమేమిటంటే – అప్పటి నుండి సామీప్యతాదశ వారిలో లయమైపోయి మనకు సారూప్యతాదశ ప్రసాదించబడుతుంది. ఇప్పుడు రెండవ నియమపు అంతిమ దశ, దైవిక సామీప్యతలో మమైక్యంచేసి మిషన్ యొక్క మూడవ నియమం మీద నిలబెట్టడం జరుగుతుంది. అది "హృదయం ప్రేమతో పొంగిపోయేటట్లుగా ప్రార్థన చేయి" అని చెప్తుంది. హృదయం ఇప్పుడు హృదయంగానే గాక దైవిక సారూప్యతను సంతరించుకొని దైవిక ప్రేమకు ప్రతిరూపంగా (చిహ్నంగా) తయారైపోతుంది. దైవిక సామీప్యత యొక్క అనుపమ సౌందర్యాన్ని బాబూజీ ప్రసాదించినపుడు, ప్రార్థన తన స్పృహను కోల్పోయి ప్రార్థించు వానిలోనే విలీనమైపోతుంది. ప్రార్థితుడు దైవ సారూప్యతలో విలీనమై పోతాడు. ఇంక ప్రార్థన ప్రార్థించువాడిని (అనగా మనల్ని) విడిచిపెట్టి అందరినీ పిలుచుకు రావటానికా అన్నట్లు ఎదురుతెన్నులు చూస్తూ నిలిచిపోతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యేచ్ఛ ఏ దైవ రహస్యాన్ని కూడా రహస్యంగా దాగి ఉండనీయదని నాకు అనిపిస్తోంది.

## మూడవ నియమం

**ప్రతి అభ్యాసీ తాను ఈశ్వరుని చేరుకొని లయావస్థను పొందటమే లక్ష్యంగా పెట్టుకోవాలి. దానిని పొందనంతవరకు విశ్రమించబోనని కృత నిశ్చయం కలిగి ఉండాలి.**

శ్రీరామచంద్ర మిషన్‌లో సహజమార్గ సాధనలో మానవ మాత్రులకు ఈశ్వరప్రాప్తి అనేది పరమ లక్ష్యంగా చెప్పబడింది. దానితోపాటుగా సాధనకు మూడు ప్రత్యేక అంశాలు కూడా చెప్పబడ్డాయి. వాటిలో ధ్యానం మొదటిదికాగా నిర్మలీకరణ (ప్రక్షాళన) రెండవది. మూడవది రాత్రి నిదురించబోయే ముందు ప్రార్థన. ధ్యానం విషయానికి వస్తే, మనసనే మందిరంలో ఈశ్వరుడు నెలవై ఉన్నట్లుగాను, వాని వెలుగుతోనే హృదయం ప్రకాశిస్తున్నట్లుగాను అభ్యాసీ భావించుకోవాలని 'వారు' చెప్పారు. కళ్ళు మూసుకొని హృదయం మీద దృష్టిని నిలిపి అంతర్యామిగా ఈశ్వరుడున్నాడని దృఢమైన భావం కల్పించుకొని, ఈశ్వరీయ కాంతిలో మునిగి ఉన్నట్లుగా తలపోస్తూ ఉండమని చెప్పటం జరిగింది. అభ్యాసీ హృదయంలోనికి ఈశ్వరీయ ధారను ప్రవహింపజేసి అంతర్గతంగా ఉన్న దివ్య ప్రకాశాన్ని దేదీప్యమానం చేశారు. ఈ కారణంగానే మనలో దైవ సామీప్యతానుభవం శీఘ్రంగా కలుగుతూ ఉంటుంది. అతడు మనలోనే నెలకొని ఉండగా అలాకాక మరెలా అవుతుంది! సహజమార్గ సాధనలో దైవస్మరణలో మునిగిన ధ్యానం, మన సాధకులకు సాధించవలసి ఉన్న దానితో విడదీయరాని ప్రేమ బంధమైపోతుంది. ఈ ప్రేమబంధం మనల్ని దైవంతో సంధానించి నిరంతరం వానికి దగ్గరగా చేస్తూ ఉంటుంది. ధ్యానం ఎప్పుడైతే దివ్యదేశం యొక్క ద్వారాన్ని తాకించి, ఈశ్వరీయ సౌందర్యంతో అలంకరించి ప్రియతముడైన ఈశ్వరుని పొందాలన్న విరహ వేదనతో సాధకుడిని ముంచివేస్తుందో అప్పుడు బాబూజీ సాధకునిలో అతని స్వంత స్పృహను తొలగించి కేవలం అతని (ఐడెంటిటి) చిహ్నం (గుర్తు) మాత్రమే ఉండునట్లుగా అనుగ్రహించటం నేను గ్రహించాను. "మన మిషన్ యొక్క ప్రార్థన వాస్తవంగా సమర్పణ" అను వాస్తవాన్ని నేనప్పుడు గ్రహించాను. మనం అను భావం అనగా స్వపరమైన భావం అంటే అహం మరియు కలయిక కొరకైన తపన బాబూజీ యొక్క దివ్యరంగులో రంగరించుకుపోయి తన స్వంత ఉనికిని కూడా కోల్పోవటం జరుగుతుంది. ప్రేమతో హృదయం పరవశించిపోతూ ఉంటుంది.

నిజం చెప్పాలంటే, ఈ మూడవ నియమంలో ధ్యేయప్రాప్తి అనగా ఈశ్వరప్రాప్తి కొరకైన దీక్షయే 'వారి'ని పొందటానికి ఒక సూటియైన నివేదన అవుతుంది. వారి స్మరణలో పెంపొందిన తపనయే మన అహం కరిగిపోవటానికి తగినదిగా ఉంటుంది. రెండవ నియమంలో దైవంతో నేరుగా మన సంబంధం నెలకొల్పు ప్రముఖ బంధం 'ప్రార్థన'యే. "నా కణకణమూ, అణువణువూ దైవానికి సమర్పితమైపోయినట్లుగాను, నా రోమ రోమమూ తనువెల్లా స్మరణగా అయిపోయి చివరకు నా జ్ఞాపకమే నన్ను వదిలిపోయినట్లుగాను నాకు అనిపిస్తోంది" అని బాబూజీకి నేను వ్రాసిన సందర్భంలో 'వారు' దానికి జవాబుగా "నీవు పూర్తిగా అంతరించిపోయావని తెలుసుకొని సంతోషిస్తున్నాను" అని వ్రాశారు. ఇటువంటి స్థితిని అపాదమస్తకం ప్రార్థనామయమైపోయి 'లక్ష్యం'లో లయ–అవస్థను పొందటంగా చెప్పుకుంటాం.

ఎప్పుడైతే మన అంతరంగం ప్రార్థనలో మునిగిపోతుందో అప్పట్నించీ మన అంతర్ దృష్టి తన ప్రియుని గాంచి కన్నార్పకుండా ఉంటూనే – దివ్య లక్ష్యమైన ఈశ్వరప్రాప్తి ఇప్పుడు నా ఎదుట సాక్షాత్కరించింది–

అని చెప్తుంది. పరమలక్ష్యపు కలయిక కొరకైన కృతనిశ్చయం మరియు ఆకాంక్ష కూడా శాంతిని కోల్పోయి తపన రూపం దాల్చుతాయి. "తపన తన దారి తానే వెదుక్కుంటూపోతుంది" అని బాబూజీ చెప్పిన మాట ఇప్పుడు నిజమై ఈ దశారూపంలో, మనలో సజీవంగా నిలుస్తుంది. దివ్యాకర్షణ మనకు తనలో లయ–అవస్థను కలగజేస్తుంది. "లయ–అవస్థ ఎప్పుడైతే ప్రారంభమయ్యిందో అప్పుడింక కలయిక (సంగమం) కూడా జరిగి తీరుతుంది. అంతేకాదు, అభ్యాసీ లయ–అవస్థ పొందిన తర్వాతనే నా పని ప్రారంభమవుతుంది" అని బాబూజీ వచించారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో సాధన యొక్క మూడు దశలు అనగా మొదట సందర్శనం, తర్వాత ఈశ్వరీయ దేశంలో ప్రవేశం, దాని తర్వాత లయం కావటమూ, ఆ సౌందర్యం పొందిన తర్వాత వారి దివ్యవాక్కు యదార్థమైనదిగా నాకు తోచింది. ఏవిధంగానైతే నది సాగరంలో సంగమించి తన అస్థిత్వాన్ని అనగా తన ఉనికినే కోల్పోతుందో అదే విధంగా ఈశ్వరీయ కేంద్రంలో ఈశ్వరునిలో లయమైపోయిన వారెవ్వరైనా వారిలో విలీనమైపోవటమే కాని తిరిగి రావటమంటూ ఉండదు. అలా ఎందుకో తెలుసా? ఎందుకంటే, సృష్టికి కారణభూతమైన క్రియాన్విత శక్తి యొక్క ముఖ్యకేంద్రం ఇదే కనుక. ఈ స్వస్థానాన్ని (వతన్) చేరిన తర్వాత ఎవరు మాత్రం తిరిగి వస్తారు? అందుచేతనే నా జీవిత సర్వస్వమైన బాబూజీ నా ఈ స్థితిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. అలా ఎందుకంటే సహజమార్గ సాధనలో ప్రాణిమాత్రులకు ఈశ్వరప్రాప్తి అను లక్ష్యం కూడా మన ముందుంచారు కనుక. ఇప్పుడు మనం వారి దైవిక కార్య కౌశల్యంతోపాటుగా వారి దివ్యప్రేమ కూడా, ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే, ఈశ్వరీయ కేంద్రం యొక్క ప్రాధాన బిందువులో అనగా ఈశ్వరునిలో 'వారు' మనల్ని పరిభ్రమింపజేసి ఇంకా ముందుకు ఎలా తీసుకువెళ్తారో – ఆ దృశ్యాన్ని తిలకిస్తే తెలుస్తుంది. అవతారాలు ప్రకృతి కార్యార్థమే ఈశ్వరీయ కేంద్రంలో వేర్వేరు కేంద్రాలు అనగా 12వ శక్తి వలయం, 16వ శక్తి వలయం నుంచి అక్కడి శక్తిపైన ఆధిపత్యంతో భూమి మీద అవతరించిన యదార్థం అందరికీ స్పష్టమే. శ్రీ లాలాజీ మహరాజ్ ద్వారా అవనిపై అవతరింపబడిన దివ్య విభూతి శ్రీ బాబూజీ మహరాజ్, అనంతశక్తి అనగా ఆదిశక్తికి ప్రతిరూపం. దైవకార్య కౌశల్యానికి మరియ శక్తికి సజీవ శిల్పం. ఈశ్వరప్రాప్తి అను దివ్య దశను పొందకుండా సాక్షాత్కార స్థితిని మించి ఎవ్వరూ ముందుకు పోలేరని నా సాధనలో నాకు అనుభవమైంది. సాక్షాత్కారం అనేది భక్తికి పరాకాష్ట స్థితి. కబీరు తన అసాధారణ మరియు అచంచల భక్తితో దానిని పొందాడు. ఆ సాక్షాత్కారాన్ని దాటిపోశక్యంకాని స్థితిలో కలిగిన వ్యథతోనే – "హద్దు హద్దులేమి మధ్య కబీరు సొమ్మసిల్లిపోయాడు" అని చాటుకున్నాడు. ఎందుకంటే, దివ్య సాక్షాత్కారం తర్వాత ఏదో ఉందని ఆయనకు స్ఫురిస్తూ ఉంది, కాని దానిని స్వయంగా దాటిపోవటం అసంభవమైంది.

శ్రీ బాబూజీ మహరాజ్ నా మీద నిర్వహించిన పరిశోధనా ఫలతంగానే దీనిలోని యదార్థం నా అనుభవానికి వచ్చింది. నేను మాటా పలుకూ లేకుండా నా విస్మృతావస్థను కూడా ఆదమరచిపోయి ఉండగా అకస్మాత్తుగా 'వారు' నన్ను ఈశ్వరీయ ముఖ్యకేంద్ర బిందువులో కూడా ముంచి లేపారు. ఇటువంటి దైవిక కార్య కౌశల్యం మరియు దివ్య అనంతశక్తి కేవలం శ్రీ బాబూజీ మహరాజ్‌కే చెందాయి. ఇది వారికే సాధ్యం. 'వారు' నన్ను పూర్ణ దివ్యశక్తి కేంద్రంలో స్నానమాడించి, దాని శక్తితో అలంకరించి, ఆ దైవికమైన సత్యపద్ మీద నిలబెట్టిన ఆ దివ్య దృశ్యాన్ని, ఈ పుస్తకం వ్రాసే సందర్భంలో నాకు సాక్షాత్కరింపజేస్తున్న

దానిని నా లేఖిని చూసి దిగ్భ్రాంతి చెంది ఏమని వ్రాయను, ఎలా వ్రాయను అన్నట్లుగా అచేతనమైపోయింది. మరి నేనైతే ఆ ఈశ్వరీయ శక్తికి ఒక ప్రతిమలాగా ఉండి అహం యొక్క పదహారు వలయాలకు ఆవల, ఈ దృశ్యాన్ని అంతర్ దృష్టితో కాకుండా దివ్య దృష్టితో మాత్రమే దర్శించాను. ఆ విధంగా ఈశ్వరీయ ముఖ్యకేంద్ర బిందువులో స్నానమాడించి తీసుకువచ్చిన దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రత్యక్ష సాక్షాత్కారం పొందిన నాకు ఆ ఈశ్వరవ్యాప్తి కూడా ప్రేమతో తడిసి ముద్ధయిపోయినట్లు అనిపించింది. ఈ దివ్య దశతోపాటుగానే ఈ దివ్య దృశ్యాన్ని నేను బాబూజీ యొక్క ఉజ్వలమైన దివ్యత్వంలో మునిగి ఉండి అందరి ప్రయోజనం కోసం సులభతరం చేయాలని ఈ గీతాన్ని రచించాను.

**మరచాను నేను నా నిజ నివాసం**
**మరలి చూసిన 'వారి' తలపు మెదిలింది నాలో**
**వీడ్కోలు ఇస్తూ ఈశ్వరవ్యాప్తి కన్నీట మునగ**
**మమతాసాగరం కలిసిపోయింది 'వారి'లో**

ఈశ్వరీయ శక్తి రూపంగా నన్ను తయారుచేసి మానవుని వాస్తవిక స్థానమైన సత్యపద్ మీద నన్ను ప్రతిష్టించారు. ఒక విధంగా చెప్పాలంటే మనం ఎలా వచ్చామో అలాగే అయిపోతూ అలా అయిపోయిన తరువాత మాత్రమే అంతిమం లేదా భూమా యొక్క వైభవంతో కూడి ఉన్న ప్రాంతమైన సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం)లో ప్రవేశం పొందటం జరుగుతుంది. మన జీవనం ఇటువంటి శ్రేష్ట దశా సౌందర్యంతో అలంకరించబడాలని సహజమార్గంలో ప్రతి ఒక్క నియమమూ చాటటానికి కారణం ఇదే. ఈ విధంగా దశా సౌందర్యం పొందటానికి అర్హతకొరకే అన్నట్లుగా ప్రతి ఒక్క నియమం పాటించమని చెప్పటానికి కారణమైంది. సహజమార్గ విధానం అనేది ఒక రకమైన జీవన విధానం (జీవన శైలి) అని బాబూజీ బహుశా ఇందుకే చెప్పి ఉంటారు. దీని సాధన లేదా ఆచరణ ద్వారానే దశ నియమాల సౌందర్యంతో మనం అలంకరించబడి అంతిమ సత్యం యొక్క సత్యత్వంలో ప్రవేశించటానికి బాబూజీకి సమర్పితమవుతాం. అప్పుడింక మనం సాధన నుంచి విముక్తులమవుతాం. దైవంతో పూర్తిగా మమేకమైపోయే దశలో స్థిరపరచి, ఈశ్వరీయ గతిలో లయంచేసి, ఆ తర్వాత దివ్యతేజో అంశ రూపంలో కేంద్రమండలం ద్వారా సత్యపథ్ మీద మనల్ని 'వారు' తమ మహత్వంతో ఎలా ఆశీనులుగావిస్తారో ఎలా నిలుపుతారో గ్రహించండి. ఈ విధంగా చేయటం ద్వారా మనలో మూడన నియమపు దశను పూర్తిగావింపజేస్తారు. ఇంతటితో పని ముగిసిందని వారు విశ్రాంతి తీసుకోవడం జరగదు. ఎందుకుంటే, 'వారు' నన్ను ఇప్పుడు సత్యపద్ నుంచి కదిలించి పార్షద్ యొక్క అద్భుత స్థితిలో నిలిపి, ద్వారం లోపల నిరీక్షిస్తున్న వారెవరికో నా ప్రవేశ వార్తను వారే స్వయంగా చేరవేసినట్లు అనిపించింది. అప్పుడు నా ఎదుట వారి మందహాసమే ప్రవేశానికి ఆజ్ఞాపించినట్లుగా అనిపించింది. ఈ దృశ్యం ఒకటి లేక రెండు క్షణాలు మాత్రమే ఉంటుంది. ఇప్పుడు మిషన్ దశ నియమాల గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని మనతో పరిచయం చేసుకొని వాటిని మనం పాటించాలి అని చాటటమే గాకుండా వాటి వివరణతోపాటు ఫలప్రాప్తిని కూడా సమకూర్చుతాయి.

నా బాబూజీ ఘనత గురించి ఏమని వ్రాయాలో నాకు తోచకపోయింది. కాని, సమర్థ సద్గురు శ్రీ లాలాజీ 7 నెలల కఠోర సాధనతో భూమా యొక్క అంశంగా ఏ దివ్య పురుషుని అవతరింపజేశారో వారే

బాబూజీ అని, 'వారు' సమస్తంలోను వ్యాపించి ఉన్నారు అని, నా కలం ద్వారా నా రచనలో ఎవరో స్వయంగా వ్రాయటం జరిగిపోయిందా అనిపించింది. సహజమార్గ్ సాధనకు పూనుకొని ఈశ్వరీయ దశలో మమేకమై ఈశ్వర సాక్షాత్కారం అను మహర్దశను పొంది తద్వారా వారి అనంత దివ్య పటిమను చాటటంలో నేను సాక్షీభూతంగా నివేదించబడ్డాను. విశిష్ట అవస్థలో సత్యపద్‌వద్ద వారి చరణాల చెంతనే ప్రతిష్టించబడి అహం కోల్పోయిన స్పృహ కూడా లేక వారి శరణాగతి పొందిన దశలో నేను గ్రహించిన దాని ప్రకారం, 'వారు' మొట్టమొదట అభ్యాసిని అహం యొక్క పదహారు వలయాల బంధనం నుంచి తప్పించి దివ్యదేశంలో ప్రవేశపెట్టారు. మళ్ళీ రెప్పపాటు కాలంలోనే దివ్యశక్తి యొక్క ముఖ్య ఈశ్వరీయ కేంద్రంలో మునక వేయించి దాని మూలమార్గమైన సత్యపద్ మీద అభ్యాసిని ప్రతిష్టించారు. అక్కడ వారే స్వయంగా అంతిమ సత్యం యొక్క వైభవ క్షేత్రమైన కేంద్ర మండలానికి (సెంట్రల్ రీజియన్) సంరక్షకునిలాగా (రక్షకభటునిలాగా) మన ఎదుట ప్రత్యక్షంగా నిలుస్తారు. ఇంకొక యదార్థమైన విషయం ఏమంటే, ఎప్పుడైతే వారి మందహాసభరితమైన మోము సెంట్రల్ రీజియన్ నుంచి తొంగి చూస్తుందో అప్పుడే మనకు ఆ మహత్తరమైన కేంద్ర మండలంలోనికి (సెంట్రల్ రీజియన్) ప్రవేశించటానికి అనుమతి లభించినట్లవుతుంది.

అసలు ఏమిటంటే, మన మిషన్ యొక్క మూడవ నియమం అభ్యాసికి దైవ సాన్నిధ్యం కొరకు ఒక సోపానం వంటిది. రెండవ నియమం యొక్క అంతర్దశ మనకు మన అంతరంగంలో దైవ ప్రార్థనలో మునిగి ఉండే స్థితిని ప్రసాదిస్తుంది. అప్పుడు అంతరిక దృష్టి, లోపలే విరాజిల్లుతున్న దైవాన్ని గుర్తించి అభ్యాసీకి ఇవ్వబడిన ఈశ్వర ప్రాప్తి అను లక్ష్యం మీద స్థిరపడిపోతుంది. లక్ష్యంపట్ల దృఢ వైఖరి అనే బంధం ద్వారానే దివ్యతరంగం లేదా ఈశ్వరీయ ధారా ప్రవాహం మనలోనికి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. బహుశా ఇటువంటి అధ్యాత్మిక స్థితిలో మునిగి ఉన్నప్పుడే కబీరు వాక్కు స్మృతి లేదా స్మరణ ద్వారా దైవాన్ని పొందటాన్ని, నీరుతోడే పుణ్యవతియైన భార్య, భర్త జ్ఞాపకాలతో త్రాడు లేకుండానే చేదను నీటితో నింపుతున్నట్లు– భగవంతుని నిరంతర స్మరణ అను త్రాళ్ళతో ఊయల ఊగుతూ ఆనందిస్తున్నదని వ్రాశాడు.

అప్పట్నుంచే కార్య పరంపర కొనసాగుతుంది. అదేమిటంటే, అభ్యాసిని త్వరగా లక్ష్యం చేర్చాలనే సంకల్పం బాబూజీ మహరాజ్‌ను ఎంతగా మథనపెడ్తుందో, అంతగాను అభ్యాసి యొక్క అంతరంగంలో త్వరగా ఉన్నతి చెందాలనే తలంపు తపింపజేస్తూ ఉంటుంది. అప్పుడే బాబూజీ చెప్పినట్లు – "తపన, తన దారి తానే తడుముకుంటూ పోతుంది" అని చాటే దశ ప్రయోగ పూర్వకంగా సాక్షాత్కరిస్తుంది. ఇప్పుడింక మూడవ నియమపు దశ మనలో ప్రవేశించి "లక్ష్యం సాధించబడే వరకు విశ్రమించరాదు" అని ప్రోత్సహిస్తుంది. ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఏమిటంటే, ఆదిశక్తి సృష్టిరచన చేయదలచి ఏ విధంగానైతే తలమునకలైందో (వ్యాకులమైందో) అదే చింతలో ప్రాణిమాత్రుల ప్రయోజనం కోసం అంతిమ సత్యం (భూమా) చేరటానికి కూడా మార్గం ఏర్పడిందన్న మాట. దీనిని మన సహజమార్గ ప్రదాత శ్రీ బాబూజీ మహరాజ్ అన్వేషించి మన అభ్యాసులకు సమర్పించారు. అయితే ఆ మార్గంలోకి ఆహ్వానిస్తూనే దానిని దాటడానికి ఉండవలసిన జీవన విధానాన్నీ ఆచరించాల్సి ఉంటుందని అన్నారు. అప్పుడే నాల్గవ నియమం తన ద్వారం తెరచి తనలోకి ప్రవేశం కల్పిస్తుంది. ఇప్పుడు లేఖిని దీనిలో ప్రవేశించి దానిలోని వాస్తవాలను వెల్లడించటానికి సిద్ధంగా ఉంది.

# నాల్గవ నియమం

**"మన జీవితం సాధారణమైంది (నిరాడంబరమైంది)గాను మరియు ప్రకృతితో అనుశీలమైనది (అనుగుణమైనది)గాను ఉండాలి"**

ఇప్పుడు నియమం అంటే నియమమే అని వ్రాయవలసి వస్తోంది. దైవంతో అనుసంధానించబడి ఉన్న సహజమార్గ సాధన మన అభ్యాసులకు దైవంతో ఒక దివ్య వరం వంటిది. ఎందువల్లన అంటే, మన మిషన్‌లోని ఏ నియమం కూడా మనకు ఒక బంధం వంటిది కాకపోగా, మనల్ని మన అహం అనే ఖైదు నుంచి క్రమంగా విడుదల చేస్తూ, సహజమార్గ సాధనలో శ్రీ బాబూజీ మహరాజ్‌చేత నిర్దేశించబడిన ఈశ్వర ప్రాప్తి అను పరమ లక్ష్యంవైపు నడిపిస్తూ ఉంటుంది. మరొక వైపున బాబూజీ నుంచి లభించిన దివ్య ప్రాణాహుతి తన శక్తితో మనల్ని అందుకు యోగ్యంగా తయారుచేస్తూ ఉంటుంది. "ఒక జీవిత కాలమంతా కాకుండా ఇంకా అల్పకాలంలోనే అభ్యాసి తన లక్ష్యాన్ని చేరుకోగలడు" అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన దివ్యవాక్కు మన అభ్యాసులకు ఇప్పుడు యదార్థమని అనిపిస్తుంది. 'వారు' సహజమార్గ సాధనలో మనకు ఈశ్వరప్రాప్తి అను లక్ష్యాన్నిచ్చి అందరినీ ఒకే త్రాటిమీద నిలిపారు. దాని మూలంగా మన జీవితంలో సర్వమానవ సోదర భావం వెల్లివిరుస్తుంది, అని 'వారు' చెప్పినది స్వతహాగా మనకు సిద్ధించినట్లు అవుతుంది. "నేను సహజమార్గ సాధనలో సహెూదరత్వాన్ని ప్రాణప్రదంగా చేశాను" అని 'వారు' చెప్పిన మాట కూడా మన జీవన విధానంలో చోటుచేసుకుంటుంది. ఈ సాధనలో లక్ష్యం ఈశ్వరప్రాప్తి కావటంచేత అందుకు ప్రేమ మరియు భక్తి పునాది అవుతుంది. అందుచేత అభ్యాసీ జీవితం కూడా ప్రేమ మరియు సత్యత్వంతో నింపబడి ఉంటుంది. భక్తి అనేది సంయమనం మరియు నియమాల కట్టుబాటుకు అతీతంగా ఉండి దానికోసం, తపించిపోతూ ఉంటాము.

మిషన్ మూడవ నియమం "ఈశ్వరునిలో లయావస్థ పొందటం" అను లక్ష్యానికి స్వరూపంగాను, దైవ సామీప్యతకు చిహ్నంగాను అయిపోతుంది. అప్పుడింక నాల్గవ నియమంలో ప్రవేశిస్తూనే మన జీవితం మరెవ్వరిచేతనో నడపబడుతున్నట్లు అనిపిస్తుంది. నేను ఇటువంటి స్థితికి చేరాక ఇక్కడ నేను నా స్వాధీనంలో లేనని అనిపించింది. అనగా అలవాటు అనే శబ్దానికి దాసోహమని అనకుండా విముక్తమైపోయినట్లు అనిపించింది. భౌతికతకు అతీతంగా, నిరంతరం దైవస్పర్శను పొందే జీవన గమనాన్ని 'వారి' ఆదేశమే నడపగలుగుతుంది కనుక, దివ్య జీవనశైలి తనకు తానుగా మనలో ప్రవేశిస్తుంది. అలా ఎందుకో తెలుసా? ఎందుకంటే, ఆ ప్రదేశం యొక్క ప్రకృతి (వాతావరణ స్థితి) అక్కడి దివ్య వాతావరణంలో స్థిరపడి ఉండటం మూలంగా మనకు దానితో పరిచయం ఏర్పరుస్తూనే మనల్ని కూడా ఆ విధంగా మలచి మార్చటంలో సఫలమవుతుంది. నిజానికి దైవీయ సామాన్యతయే (నిరాడంబరతయే) ప్రకృతి జీవనం అని నాకు బోధపడుతోంది. సామాన్యతకు దాని ఛాయ (పోలిక) అంటూ ఉండదు కనుక జీవనం దానికదే సాటిగాను, దివ్యమైనదిగాను ఉంటుంది. బహుశా అందుకేనేమో ఇప్పటివరకు మాయ యొక్క ఛాయ 'నేను' అన్న అహంకార ఛాయ దశలోను, జీవనంలోను ఉండి ఉన్నట్లుగా మన మిషన్ యొక్క ఈ నియమంలో నా

అవగాహనకు వచ్చింది. కాని జీవనం ఇప్పుడు ప్రకృతిరీత్యా నడపబడుతన్నట్లుగాను, అభ్యాసీ యొక్క ప్రగతి కోసం ప్రతి పనిలోను ఆ ప్రకృతి సహాయ రూపంలో అడుగడుగునా తోడుగా నడుస్తున్నట్లుగాను ఉంది. మిషన్ యొక్క ప్రార్థనను నియమ రూపంలో కూడా, దాని భావాన్ని పరిపుష్టి చేయటానికి దానిని భక్తి మరియు శక్తితో సంపన్నం, చార్జ్ చేశారని నాకు ఇక్కడ స్పష్టమైనంది. అదే విధంగా మిషన్ యొక్క దశ నియమాలను ప్రతి ఒక్కదాని దశలోను దాని వాస్తవికతతోను మరియు శక్తితోను సంపన్నం చేసిన కారణంగా, మన అభ్యాసులలో ఈ దశ నియమాల సౌందర్యం ఎప్పుడు సమకూరుతుందో, అప్పుడు ఒక్కసారిగా సాక్షాత్కారం కలిగే శుభ సమయం ఆసన్నమైందని తెలిసిపోతుంది. దశ నియమాల దశల సౌందర్యం మన జీవనంలో స్వతస్సిద్ధంగానే ఉత్పన్నమై (ఆవిర్భవించి) పోతుందనిపించింది. "ఒక్కటి (సాక్షాత్కారం) సాధించబడితే అన్నీ సాధ్యమవుతాయి" అని కబీరు ఉద్ఘాటించిన మాట, సహజమార్గ సాధన ద్వారా నేను బాబూజీలో లయావస్థను పొందిన తర్వాత స్వతస్సిద్ధంగా నాలో ఫలించినట్లు నాకు అనుభవమైంది. అభ్యాసీ జీవితాన్ని అలంకరిచటానికి ఈ సౌందర్యం ఆధ్యాత్మికోన్నతి రూపంలో ప్రతి దశలోనూ, ప్రతి సందర్భంలోనూ స్వయంగా వికసిస్తూ ఉంటుంది. సహజమార్గంలో అందరికీ ఈ దశ నియమాలు వారి దివ్యత్వానికి మరియు శక్తికి సంకేతంగా ఉంటాయి. నాల్గవ నియమపు దశకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం. ఈశ్వరునితో సరాసరి యోగం పొంది ఉండి, 'వారి'ని ప్రాప్తింపజేసుకునేందుకు ఇది సర్వదా స్వాభావిక సాధన కావటమే దానికి కారణమవుతుంది. "సహజమార్గం దివి నుంచి దిగి వచ్చిన దివ్యమార్గం" అని 'వారు' చెప్పింది అందరికీ ప్రత్యక్షంగా తెలియవచ్చింది. "మానవ మాత్రులలో ఈశ్వరప్రాప్తి కొరకు కాంక్ష జనించాలి' అని ఆది ప్రకృతిచేత ఉద్దేశించబడిన దివ్య కార్యాన్ని సాధించటానికి, సృష్టి శక్తికి ప్రతిరూపమైన ఆది లేదా మూలం యొక్క పరమ శక్తిమీద సర్వాధికారం కలిగిన మన శ్రీ బాబూజీ మహరాజ్, పరమ పురుషుని రూపంలో ఈ భువిపై అవతరించి కార్యనిమగ్నులై ఉన్నారు. 'వారి' ఈ దివ్యాగమనం ఈ యుగాన్ని సత్యయుగంగా పరివర్తనం చేసిన తర్వాత ఒక యుగ ప్రవర్తకునిలాగా 'వారి' దర్శనం ఇప్పుడూ మరి ఎల్లప్పుడూ కలుగుతూనే ఉంటుంది. అలా పొందటమే మానవుని లక్ష్యంగా ఉంటుంది" అని సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ ప్రకటించింది అందరికీ విశదమైంది.

నేను గ్రహించిన దివ్య రహస్యం ఇది – బాబూజీ నియమాలు అన్నీ కూడా వాటి సౌందర్యావరణలో ఎలా దాగి ఉన్నాయి అంటే, ఆంతరికంగా ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యం దృఢపడిన తర్వాత ఏ విధంగా నయితే అహం యొక్క ఆవరణ పలుచనైపోతూ ఉంటుందో, అదే విధంగా దశ నియమాల యొక్క స్వాభావిక సౌందర్యంతో కప్పబడిన ఆవరణ కూడా పలుచనైపోతూ, వాటి నిజ సౌందర్యంతో మన ప్రకృతిని (స్వభావాన్ని) అలంకరిస్తూ ఉంటాయి. ఇలా ఉండగా ఏదో ఒకనాడు గీతలో చెప్పినట్లుగా "గుణములు గుణములందే ఇమిడి వ్యవహరిస్తాయి" అను దానికి సారూప్యమైన దైవిక దశ మనలో కలుగుతుంది. ఈశ్వరుడు గుణాతీతుడు కనుక అలా కాకుండా మరి ఏమవుతుంది? ఈ విధంగా సహజమార్గ సాధన యొక్క ప్రతి విషయమూ అనగా ధ్యానం, నిర్మలీకరణ మరియు ప్రార్థన ఏదైనా కానివ్వండి, నాకు పూర్తిగా సహజసిద్ధమని అనిపించింది. అప్పుడింక ఆత్మోన్నతి మార్గంలో సాగిపోతూ ఉండగా, ఒకానొక రోజున శ్రీ బాబూజీ మహరాజ్ కృప

మరియు శక్తి అనుగ్రహంతో మనం ఈ ప్రకృతిని అధిగమించి, ఆది ప్రకృతితో కలిసిమెలిసి ఉంటుంది. ఎందుకో తెలుసా? ఎందుకంటే, అప్పుడింక మనం ఉండము కదా! అనగా మన యొక్క 'నేను' అను భావం వారి ప్రేమలో విలీనమైపోయి మనల్ని సర్వవ్యాపిగా చేసేస్తుంది. అనగా అహం యొక్క భ్రమలో ఉండిపోయి ఇప్పటివరకు మాయ యొక్క పరిధిలోను, అలాగే భౌతికమైన హంగు ఆర్భాటాల్లోను అడంబరంగా జీవించిన మనం, ఇప్పుడు 'నేను' అను భావం జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమలో విలీనమైపోగానే మనం సర్వవ్యాపిగా అయిపోతాం. ఇప్పుడు, ఈశ్వరీయ కేంద్రం నుంచి అవతరించిన శక్తి యొక్క భక్తిలో తల్లీనమైపోయి అహం యొక్క హద్దును దాటిపోతామని మన గ్రహింపుకు వస్తుంది. అప్పట్నుంచే మన జీవనం ప్రకృతితో నడపబడుతూ మనకు (ఈ నేనుకు) సంబంధం లేనట్లుగా ఉంటుంది. ఇంకేముంది, ఆది (Source) అనగా మూలం నుంచి అవతరించిన మహాత్ముడు శ్రీ బాబూజీ మహరాజ్ ప్రేమలో విలీనమైపోయిన మన యొక్క 'నేను' (అనగా అహం) సర్వవ్యాపకమైపోయి ఈశ్వరీయ కేంద్ర ప్రాంతాన్ని కూడా దాటిపోయి తన సత్యపద్ మీద ప్రతిష్ఠితమైపోతుంది. దీనికంటె కూడా మహత్తరమైన దివ్య సంకల్పం సాయంతో అంతిమం (అల్టిమేట్) అనగా ఆదిశక్తి యొక్క అనంత వైభవ కేంద్రం అయిన కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్)లో ఈదసాగుతుంది (స్విమ్మింగ్ చేస్తుంది).

నిజం ఏమిటంటే, కళ్ళు విప్పి చూసిన అంతా మాయ వ్యాపించి ఉన్నట్లుగాను, కళ్ళు మూసి చూస్తే ఆంతరికంగా ఆధ్యాత్మికత ప్రభవించి ఉన్నట్లుగాను ఉంటుంది. బాహ్యంలో సృష్టి వ్యాపించి ఉంది; మన మనస్సు అనే మందిరంలో సృష్టికర్త నెలవై ఉన్నాడు. బాహ్యంలో నడుస్తున్న కారణంగా మనల్ని మాయావరణ మభ్యపెట్టుతుంది. కనుక "మాయ మహా మోసకత్తె అని తెలుసుకోవే మనస్సా!" అని వాపోతాము. కాని నిజానికి ఫలితం అనేది మన చేతుల్లోనే ఉంది. ఎలాగంటే, మనం బాహ్యంతో సంబంధం కలిగి ఉంటే మాయ మనల్ని వంచిస్తుంది. అలా కాకుండా మన జీవనం ఆంతరికమైందిగా ఉంటే మాయాధిపతి అనగా ఈశ్వరుడు మనల్ని మాయను దాటించి తన దివ్య వాతావరణంలో జీవింపజేస్తాడు. మరయితే ఈ రెండు రకాల జీవనానికి మధ్య వ్యత్యాసం చాలా ఉంది. ఒక వంక బాహ్య జీవనం –స్వార్థం, సంకుచితత్వం మరియు సమస్యల వలయంలో చిక్కుకుని అశాంతి అస్థిరతల్లో కూరుకుపోయి, సాధారణమైన దానికి భిన్నంగా ఉండగా, ఇంకొకవైపున ఆంతరిక జీవనం బాబూజీ ఇచ్చిన లక్ష్యానికి సమర్పితమై, మాయాధిపతియైన ఈశ్వరునితో యోగం చెంది నిరంతర శాంతి మరియు దివ్యానందంలో మునిగిన వ్యాపకంతో అలంకరించ బడిన స్థిత–ప్రజ్ఞ దశలో విలీనమైపోయి ఉంటుంది. ఇవి రెండూ పరస్పర విరుద్ధ ప్రకృతులు, భిన్న వ్యవహారాలుగా ఉన్నాయి. బాహ్య ప్రపంచంలో మన స్వభావం (నేచర్) మన అహంతోనే నడపబడుతున్నందు వలన క్రమంగా మాయామోహంలో చిక్కుకుని నిరాడంబరతకు పూర్తి భిన్నంగా సంకుచితమైపోయి ఉంటుంది. ఆలోచనల వలన వికారం, సంకుచిత్వం ఈ స్వభావం మూలంగా అచేతనంగా ఉండిపోవటం వంటీవన్నీ శ్రీ బాబూజీ మహరాజ్ కృపవలన అంతరంగంలో ఈశ్వరప్రాప్తి అనే దివ్య లక్ష్యం, ఈశ్వరీయ ధారా ప్రవాహం పొందటం ద్వారా తొలగిపోతాయి. ఇంక అలాగే చికాకు నుంచి ముక్తి పొందటం ద్వారా అంతరంగంలో ఈశ్వరీయ వ్యాప్తి అనుభమవుతుంది. ఇంకా చెప్పాలంటే, అహం యొక్క సంకెళ్ళు

కరిగిపోవటంతో దివ్యసీమ తాలూకు సహజమైన శాంతి మరియు ఆనందానుభూతి మనల్ని నిరంతర సామ్యగతి యొక్క వాతావరణంలో స్నానమాడిస్తూ ఉంటుంది. దీని విశేషం ఏమంటే, ఈ స్నానమాడటం వలన మాలిన్యం తొలగిపోవటమే కాకుండా 'నేను' అను అహంభావం స్వచ్ఛతనందుతూ ఉంటుంది. ఇలా ఉండగా, ఒక రోజున అంతిమం యొక్క శక్తికి చెందిన నిరాడంబర వాతావరణమే మనల్ని ఆవహించి దైవీయమైన దుస్తులు ధరింపజేసినట్లుగా అనిపిస్తుంది. అంతిమ సత్యం యొక్క వాతావరణం నిరాడంబరతకు ప్రాణం అని, శరీరాన్ని దుస్తులు అంటి ఉండునట్లుగా ఆది శక్తిని అంటిపెట్టుకుని ఉంటుంది అని, నేను ఇప్పుడు గ్రహిస్తున్నాను. అవి ఒక దానితో ఒకటి పెనవేసుకొని ఎంత నేర్పుగా కలిసి ఉన్నాయో వాటినే బాబూజీ గ్రంథులుగా వ్రాశారని నేను అర్థం చేసుకుంటున్నాను. నేడు ఈ పుస్తక రచనా కాలమందే సమస్త మానవాళికి బాబూజీ ఈ దివ్య రహస్యాన్ని కూడా వెల్లడించారు. ఇంకా చెప్పాలంటే, ఇక్కడి ప్రతి అణువులో సంపూర్ణ అనంతశక్తి నిండి ఉంది. ప్రతి అణువుకూ బ్రహ్మాండాన్ని సృష్టించగల శక్తి సామర్థ్యం ఉంది. బాబూజీ దివ్య పరిశోధనా ఫలితాలను, నేడు 'వారి' సంకల్పంతో సంధించబడిన ఈ కలం ఆ దివ్య రహస్యాలను వెల్లడి చేయటానికి సాహసించింది. **ఇంకొక యదార్థం ఏమంటే, 'వారు' కలంలో సిరాకు బదులు దివ్య రహస్యాలను నింపుతూ ఉంటే, కలం వాటిని కాగితం మీద లిఖిస్తూ ఉంది. అందరికీ ఈ రహస్యం వెల్లడి కావటానికి ఈ దృశ్యమే సాక్ష్య ప్రమాణంగా ఉంది.** దీనికి మించి నేను చెప్పవలసింది ఏమీ లేదు. బాబూజీ మహరాజ్ ద్వారా ప్రతిపాదించబడిన సహజమార్గ సాధన కాకుండా మరి ఏ ఇతర సాధన కూడా తన సాధకుల్లో ఆది నుంచి అంతం వరకు గల ఆధ్యాత్మిక దశలను ప్రత్యక్షపరచలేకపోయాయి అన్న యదార్థం ధృవపడింది. బాబూజీతో యోగించి ఉన్న లేదా సంబంధం కలిగి ఉన్న ఆది – మూలం (సోర్స్) వరకు గల అనంత యాత్రను వర్ణించటం శ్రీ బాబూజీ మహరాజ్‌లో సంపూర్ణ లయావస్థను పొందకుండా ఎప్పుడూ సాధ్యపడలేదు; ఇంకెప్పుడూ సాధ్యపడదు కూడా. సహజమార్గ సాధన ద్వారా ఎప్పుడైతే ఈశ్వరీయ కాంతితో అభ్యాసీ హృదయం ప్రకాశవంతమవుతుందో, అప్పుడు ఆ కాంతి అభ్యాసీ వ్యవస్థ (సిస్టమ్) అంతటినీ ప్రకాశవంతం చేస్తుంది. అది దైవీయమైనది కావటం మూలంగా దాని దైవ సామీప్యత ద్వారా పరమపురుషుని దివ్య సౌందర్యం మనకు అనుభవమవుతూ ఉంటుంది. అప్పుడు వ్యవస్థ అంతా ఈశ్వరమయమైపోతుంది. అప్పటి నుంచి హృదయం మరియు మనస్సు త్రిగుణాతీత అవస్థలో విలీనం కాసాగుతాయి. ఆ తర్వాత మన మిషన్ వాల్లవ నియమం జీవనానుసారంగా మన జీవనం దివ్య ప్రకృతి అజమాయిషీలోనే నడపబడుతున్న కారణంగా మన నిమిత్తం లేకుండా దానికదే జరిగిపోతూ ఉంటుంది. గీతలో చెప్పినట్లుగా గుణములు గుణములందే కలిసి వర్తిల్లునట్టి స్థితి మన జీవనసరళిలో వ్యక్తమవుతూ ఉంటుంది. మన అభ్యాసుల జీవన క్రమాన్ని ఇలాంటి స్థితిలో ఉండునట్లుగా నియంత్రించాల్సిన అవసరం ఉండదు. మన అభ్యాసులకు దైవంతో మమేకం కావటానికి గాను ప్రేమ మరియు భక్తిలో మునిగి ఉండు అభ్యాసం మాత్రమే అవసరమవుతుంది. ఈశ్వరప్రాప్తి కలగాలంటే, 'వారి' ధ్యానంలోనే మునిగి ఉండి, 'వారి' స్మరణలోనే నిరంతరం లయమై ఉండవలసి ఉంటుంది. ఈశ్వరుడు ఇచ్ఛ అనగా కోరికకు అతీతుడు కనుక అతడిని పొందాలనే తపనలో సమస్త కోరికలు విలీనమైపోతాయి. శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పిన ఈ

మాట ఇక్కడ యథోచితంగా ఉంటుంది. "వసంతమూ, వన విహారమూ అందరికీ ఆహ్లాదాన్ని ఇస్తాయి, కాని ప్రేయసికి తన ప్రియుని ఉనికిని తెలిపే సందేశమే సంతోషం కలిగిస్తుంది." నేను ఈ నా స్థితిని పొందిన తర్వాత బాబూజీ చెప్పిన ఈ వాక్యం స్పృహ కోల్పోతూ కోల్పోతూ ఉండగా ఏ చైతన్యం (స్పృహ) అయితే మనలో కలుగుతుందో, అటువంటి జీవనమే నిజమైన జీవనం అన్న యదార్థం గ్రహించాను. అనగా 'వారు' చెప్పినట్లుగా "లైఫ్ ఇన్ లైఫ్" జీవనంలోని (దివ్య) జీవనమే నిజమైన జీవితం అవుతుంది. మరి బాహ్య జీవన సరళిని ఎవరు నిర్వర్తిస్తారు! అప్పట్నుంచీ అది సక్రమంగా స్వయంకృతంగానే నిర్వహించబడుతుంది. ప్రకృతియే దానిని స్వయంగా నిర్వహిస్తున్నట్లుగాను, ఆ జీవనాన్ని తన సహజత్వంతోనే నింపివేసినట్లుగాను అర్థమయ్యింది. నాలో కలిగిన ఆశ్చర్యకర పరిణామాన్ని బాబూజీకి ఇలా వ్రాశాను – "ఆ దశ ఏమిటో గాని కోపం కలిగినా కూడా అది తన పని చేసుకుని వెళ్ళిపోతోంది. నాలో నిలిచిపోవటానికి మరి దేనికీ స్థానం లేదన్నట్లుగా సిగ్గూ, బిడియం, మానమర్యాదలు అన్నీ వాటి పని పూర్తి చేసుకుని పోతున్నాయి" అని. దానికి జవాబుగా 'వారు' ఎంత క్లుప్తంగాను, అర్థవంతంగాను వ్రాశారో చూడండి! "బిటియా! నీ ఉత్తరం చేరగానే చదివించుకొని విన్నాక చాలా ఆనందం కలిగింది. ఇప్పుడు నీ ఆంతరికం ఈశ్వరుని నివాస స్థానం అయిపోయింది. అందుకు శ్రీ లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. నీకు శుభమగుగాక! దైవం నిన్ను ఇంకా ముందుకు నడిపించుగాక! తథాస్తు." ఈ ఉత్తరం చదివాక నేను ఎలా అయిపోయానో తెలియదు. మళ్ళీ యథాస్థితికి రాలేకపోయాను. అందరికీ ఇటువంటి శుభాశీర్వచనం ప్రసాదించమనీ, అందరినీ కూడా సహజమార్గ సాధన ద్వారా ఈశ్వర ప్రాప్తికి అర్హులుగా చేయమనీ నేను వారిని ప్రార్థిస్తున్నాను. సహజమార్గ సాధనయే శక్తివంతమైన సాధన. శ్రీ బాబూజీ మహరాజ్ కృప మరియు 'వారి' దృష్టి అందరికీ అండగా ఉండటమే కాకుండా, అది ప్రకృతి యొక్క అంతుబట్టని రహస్యాలను కూడా బట్టబయలు చేసి, "ఓ ప్రాణులారా! మీకు కోరికంటూ ఉంటే ఆ భూమానే కోరుకోండి. అది (భూమా) పరమ పురుషుని దివ్య ప్రాణాహుతి ద్వారా సమస్త జనావాళికి సరళం, సహజ సులభం", అంటూ ఇప్పుడు దివ్య యుగం మిమ్మల్ని ఆహ్వానిస్తోంది. మన శ్రీరామచంద్ర మిషన్ యొక్క నాల్గవ నియమపు జీవనం ప్రకృతితో తాదాత్మ్యం చెందినదిగా ఉండాలి అని ప్రబోధిస్తూ మనల్ని ఐదవ నియమంలో ప్రవేశపెట్టడానికి దారి తీస్తోంది.

# ఐదవ నియమం

**"సదా సత్యమునే వచించు. నిజాయితీగా ప్రవర్తించు. ప్రతి కష్టమూ దైవం నుంచియే అని, అది నీ శ్రేయస్సుకే అని భావించి, అందుకు 'అతని'కి కృతజ్ఞత – ధన్యవాదాలను అర్పించు."**

మానవునిగా తనను రూపొందించుకోవటానికి శ్రీరామచంద్ర మిషన్ ఐదవ నియమం అద్భుతమైన ఔషధం. సహజమార్గ సాధన అభ్యాసిని ఎల్లప్పుడూ సత్యాన్నే పలికేటట్లు ప్రోద్బలం చేస్తుంది. ఎందుకంటే, ధ్యానంలో నిమగ్నమైన ఆంతరిక స్వచ్ఛత– ఆలోచనల్లోనూ, భావాల్లోను ఇంకా చేసే పనుల్లోనూ కూడా శ్రేష్టత్వాన్ని చేకూర్చుతూ ఉంటుంది. అందుచేత మనం తప్పనిసరిగా సదా సత్యమే పలకవలసి ఉంటుంది. 'మాలిక్' (దైవం) వైపు దృష్టి సారించటంవలన ప్రతి కష్టమూ, సుఖమూ మాలిక్ నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. సాంసారిక సుఖ దుఃఖాలను అనుభవిస్తున్నా కూడా, ధ్యానపు ఏకాగ్రత అభ్యాసులను 'వారి'కే సమర్పితమై ఉండునట్లు చేస్తుంది.

శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు మరియు సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్ యొక్క దివ్యతనయుడు, **మహాత్మ శ్రీ బాబూజీ మహరాజ్ – "గురువు అంటే శరీరం కాదు. శరీరాన్ని గురువుగా భావించేవారు గురుపశువులు అవుతారేమో కాని గురు భక్తులు కాజాలరు" అని వ్రాశారు.** సహజమార్గ సాధనలో ఇది విశదమైంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో సహజమార్గ సాధనా సౌందర్యంలో బాబూజీ అభ్యాసులకు ఈశ్వరప్రాప్తి అను లక్ష్యాన్ని ఇచ్చి, ఎవరినైతే పొందవలసి ఉందో 'వారి' ధ్యానంలో ఉండటానికే నిరంతరం శ్రమిస్తూ ఉండాలని, ఎక్కడైతే 'అతడు' కొలువై ఉన్నాడో ఆ మనస్సు అనే మందిరంలోనే అంటే హృదయంలోనే ధ్యానాన్ని నిలపమని చెప్పారు. దీనికి మించిన గొప్ప సహాయం ఒకటి ఉంది. అది ఏమిటంటే, 'వారి' దైవిక సంకల్పశక్తి ద్వారా అభ్యాసీ హృదయంలో ఈశ్వరీయ ధారా ప్రవాహాన్ని నిరంతరం పొందుతూ ఉండేటట్లు చేయటమే 'వారి' సహజమార్గ సాధన యొక్క దివ్యమైన నేర్పరితనం (నిపుణత)గా ఉంది. ఇదే అన్నింటికీ మించిన సర్వోన్నత సహాయం. ఈశ్వరీయ ధ్యానంలో మునిగిన ధ్యానం ద్వారా ఒకానొక రోజున హృదయంలో భక్తి పొంగిపొర్లుతుంది. ఆ విధంగా భక్తిలో తన్మయమైన ఆంతరికం ఈశ్వరుని జాడ తెలుసుకొని భరింపశక్యంగాని విరహ తాపంతో 'వారి'ని పొందలేకపోయినందుకు వ్యథ చెందుతుంది –ఇది నా అనుభవానికి వచ్చిన విషయం. బాబూజీవద్దకు వచ్చిన వారు "మాకు మీ సిస్టమ్ (విధానం) చాలా సహజంగాను, దివ్యమైందిగాను అనిపిస్తోంది. కాని మేము ఇప్పటికే మరెవరినో గురువుగా స్వీకరించాం" అని చాలామంది చెప్పటం చూశాను. అప్పుడు బాబూజీ, "గురుపశువు స్థితి అంటే ఇలాంటిదే" అని అన్నారు. ముక్తి కొరకు లగ్నం చేయాల్సిన దృష్టి గురువుగా భౌతికమైన దేహం మీద లగ్నం చేయటంవలన అది ఒక స్వయం బంధనమైపోతుంది. అది భౌతికత్వంతో కలిసి ముడిపడి ఉండటమే దానికి కారణం. 'వారు' చెప్పిన ఈశ్వరప్రాప్తి పొందుటానికి అసలు సిసలైన ప్రాణం ఉండనే ఉంది. కనుక 'వారు' చెప్పిన ఈశ్వరప్రాప్తి సాధనపైన కోర్కె కలగగానే మన అభ్యాసుల హృదయంలో దివ్యప్రకాశం వ్యాపించసాగుతుంది. **జీవితాంతం విగ్రహారాధనలోనే మునిగి, ఆ సేవకే లగ్నమైపోయి విగ్రహం పంచనే గడుపుతున్న పూజారిని, పూజారి అంటామే కాని భక్తుడు**

**అనలేము.** శ్రీరామచంద్ర మిషన్‌లోని సహజమార్గ సాధనలో ధ్యానంలో నిమగ్నమై ఉండటం వల్లనూ, మన బాబూజీ నుంచి నిరంతరం ప్రాణాహుతి ప్రవాహం పొందుతూ ఉండటంవల్లనూ, మనం భక్తి రసవాహినిలో తడిసి ముద్దయిపోయి పరమానందం పొందిన ఫలితంగా, వియోగ వ్యధ తాపంగా మారి మనలో భౌతికత్వాన్ని కరగించి విసిరి వేస్తుంది. అప్పుడు మన ఉజ్వల స్వరూపమైతే మనకు కనిపిస్తుంది కాని, దానిలో మనం ఉన్నామన్న స్పృహ ఉండదు. అక్కడి నుంచి మన మిషన్ యొక్క ఐదవ నియమానికి చెందిన వాస్తవ తత్వం దశ రూపంలో మనలో వికసిస్తుంది.

అద్భుతమైన ఆది సౌందర్య శోభతో ఓలలాడిన సహజమార్గ సాధన ఇప్పుడు మానవునికి అతని సత్య స్వరూపాన్ని ప్రసాదించి నిర్మలమైన ప్రవర్తనతో కూడిన జీవనాన్ని ప్రసాదిస్తుంది. జీవనంలో ఎటువంటి ఆడంబరం లేకుండా, వాక్కులో సత్యత్వం నింపి, దానినే ప్రతిఫలింపజేస్తూ ఆంతరికానికి స్వచ్ఛమైన సహజ స్థితిని కలిగిస్తుంది. అది ఎంతగానంటే, దాని వలన మన బాహ్యరూపంలో ఆత్మిక ఆకర్షణ ఏర్పడుతూ ఉంటుంది. ఇప్పుడు ఐదవ నియమపు దైవిక దశ– సదా సత్యాన్నే పలకాలని మన వాణిని ప్రతిఫలింపజేస్తూ ఉంటుంది. మన జీవన విధానాన్ని ఎప్పుడైతే నిష్కళంకమైన ప్రకృతి స్వీకరించిందో, అప్పుడు మన మాట ఉండాల్సిన విధంగా కాకుండా మరెలా ఉంటుంది! అని అనవలసి వస్తుంది. మన మిషన్ యొక్క ఐదవ నియమం గురించి వ్రాసినమీదట, సత్యం అనేది స్వయంగా ఒక 'దశ' వంటిది అని నేను తెలుసుకున్నాను. ప్రకృతి యొక్క స్వభావం తన మాలిక్ అయిన శ్రీ బాబూజీ మహరాజ్‌వైపుకే మ్రొగ్గి ఉంటున్నందువలన ఇబ్బందులు అనుభూతికి అతీతంగా ఉంటాయి. నేను అనే స్పృహ కోల్పోయిన (జ్ఞానం) స్పృహ తన ఉనికి యొక్క భావమే లేనందున, అది దివ్యత్వంతోనే సదా యోగం చెంది ఉంటూ ఉంటుంది. అప్పుడు మనకు కలిగే అనుభవం ఎలాంటిదంట, సత్యమే మన స్వరూపంగా అయిపోయిందా! అని అనిపిస్తుంది. ఇది దైవీయ విశుద్ధావస్థకు చిహ్నం. ఈ స్థితి కలిగిన తర్వాత 'మంచి' అను శబ్దం యొక్క సామ్రాజ్యమే అవిచ్ఛిన్నంగా రాజ్యమేలుతుంటే, 'చెడు' అనే శబ్దం పలాయనం చిత్తగిస్తుంది. ఈ దశను నేను, "దైవిక పవిత్రతయే నా స్వరూపంగా అయిపోయి నేను ఎటు వెళ్ళినా పవిత్రత యొక్క ప్రవాహమే ప్రవహిస్తున్నట్లుగా ఉంది" అని బాబూజీకి తెలియజేశాను. సత్యవంతమైన జీవనంలోనే విలీనమైపోయిన జీవితం దైవానికి తానే స్వయంగా ధన్యవాద స్వరూపం దాల్చి ఉంటుంది.

"బాహ్యాంతర దశలలో ఒక విధమైన సమన్వయం ఏర్పడి వ్యవహారంలో కూడా సత్యమే ఉట్టిపడుతోంది" అని శ్రీ బాబూజీ మహరాజ్‌కి నేను వ్రాయగా – "లోపల, బయట ఒకటిగానే ఉండేటటువంటి విశుద్ధావస్థ నీలో కలిగినందుకు సంతోషంగా ఉంది. నీవు ఎలా కావాలో అలా అయిపోయావు. అందుకు నా ఆనందానికి హద్దు లేకుండాపోయింది. మున్ముందు ఇంకా నీవు వ్రాయబోయే దానికి నిరీక్షిస్తూ ఉంటాను" అని సమాధానం ఇచ్చారు. ఆ దశను గురించి మళ్ళీ నిజంగా నేను ఏమి వ్రాశానంటే, "నేను ఒక రోజున కూర్చుని ఉండగా, అకస్మాత్తుగా నా నాలుక నుండి ఒక పొర వంటిది ఊడిపోయినట్లుగా అనిపించింది" అని వ్రాశాను. ఇంక ఆ క్షణం నుంచి నా వాణి ఏది పలికినా అది సత్యంగానే అనిపించింది. కాని ఆ మాట్లాడేది ఏమిటో దానికిగాని, నాకుగాని ఏమీ తెలియదు. దానినిబట్టి నా దశ "దివ్య సత్యం" (డివైన్ ట్రూత్)కు స్వచ్ఛమైన

రూపమైపోయినట్లు అనిపించింది. నలుదిక్కులా దృష్టి ప్రసరించిన మేరలో సత్యమే వ్యాపించి ఉన్నట్లుగా ఉంది. అలా దృష్టిలోనే కాకుండా, వ్యవహారంలోనూ సత్యమే ప్రకటితమవుతోంది. బహుశా అది 'నేను' లేనటువంటి జీవనం. దానిని గురించి ఏమని వ్రాయను? బాబూజీ మహరాజ్ నాకు చూపించినది ఇదే. దానిని చూడటమే కాదు, దృష్టి కన్నార్పకుండా దేనిమీదో నిలిచిపోయి స్వయంగా తననే మరచిపోయింది. నిజం (ట్రూత్) యొక్క నిజం ఏమిటంటే, ఆ దృష్టి మళ్ళీ వెనక్కి మళ్ళనేలేదు. నా సహజమార్గ సాధన ప్రారంభం నుంచే నా దృష్టి చెదరకుండా (కన్నార్పకుండా) నా బాబూజీ యొక్క దివ్య సౌందర్యలోనే లీనమైపోయింది, అది ఇంకెలా తిరిగి వస్తుంది? ఇంక ధ్యానం సంగతి అంటారా, అది తన విశిష్టతను మరచిపోయి శాశ్వతంగా వారిలోనే లయమైపోయింది. శ్రీ బాబూజీ మహరాజ్ ఈ కుమార్తెలో ఇటువంటి దివ్య దశను కలిగించాక "వాస్తవానికి నీవు భౌతికతను అధిగమించి ఈశ్వరుడు నిన్ను ఎలా పంపించాడో అలాగే అయిపోయావు. అహం యొక్క సత్యం ఏమిటో ఇప్పుడు వెల్లడైపోయింది. అనగా నీవు ఆత్మ సాక్షాత్కారం పొందేశావు. ఇంక భగవత్ సాక్షాత్కార దశను నీవు పొందునట్లు భగవంతుడు తప్పక అతి త్వరలో అనుగ్రహించే రోజు కూడా వస్తుంది. 'అతడు' నీ స్వస్థానంలో (ఐ = అహం) ప్రవేశించేశారు కనుక అలా చెప్పవలసి వస్తోంది" అని వ్రాశారు. ఇదే విధంగా ప్రతి దశను గురించిన వివరణతో వారి జాబు అందినప్పుడల్లా సహజమార్గం యొక్క మూడు అంశాలు – ధ్యానం, నిర్మలీకరణ మరియు ప్రార్థనలను ఆచరించినప్పుడు మన మిషన్ దశ నియమాల యొక్క ప్రతి దివ్య అవస్థ మనల్ని పరీక్షించుకోవటానికి కొలమానంలాగా మన ఎదుట నిలుస్తుందని నేను అర్థం చేసుకున్నాను. మన చేతలకు మనం ఎప్పుడు కర్తలం కామో, అప్పుడింక జీవితం సత్యత్వానికి నిదర్శనంగా తయారవుతుంది. అనగా సమస్తమూ తానే అన్నట్లుగా అయిపోతుంది. మన అభ్యాసీ జీవితాన్ని శ్రీ బాబూజీ మహరాజ్ మిషన్ యొక్క ఐదవ నియమ సౌందర్యంతో అలంకరించాక ఆరవ నియమం యొక్క దైవిక సౌందర్యంలో ముంచెత్తటానికి దానిలో ప్రవేశపెట్టారు.

# ఆరవ నియమం

**"జగతి జనులందరినీ నీ సోదరీ సోదరులుగా భావించి అందరిపట్ల అదే భావంతో వ్యవహరించాలి."**

"లోలోతుకు మునగకుండా సిసలైన ముత్యాలు దొరకవు" అని మన బాబూజీ చెప్పారు. మన మిషన్ యొక్క నియమాలకు చెందిన దశల సౌందర్యంలో మునగకుండా ఆత్మిక దశల లోతును గురించి ఏమి వ్రాయాలన్నా సంభవం కాదని నా అనుభవానికి కూడా తెలుసు. బాబూజీ నాకు ఒక లేఖలో "బి ప్రాక్టికల్" అనగా ఆచరణ యోగ్యంగా ఉండు అని వ్రాసినప్పుడు ఈ చిన్న వాక్యం యొక్క అర్థాన్ని నేను అప్పుడు గ్రహించలేకపోయాను. కాని నాకు ఇప్పుడు తెలిసింది ఏమిటంటే, ఎవ్వరైతే ప్రతి దశను, పరమానందాన్ని అనుభవించి ఉండి ఆ దశలో లయమైపోతారో, అటువంటి వారు ఏమి వ్రాసినా సరే, ఆ దశయే వారి ఎదుట నిలిచి తన్ను గురించి వివరిస్తున్నట్లుగా నాకు అనిపించింది.

శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దైవిక ప్రాణాహుతి శక్తి మన అంతరంగంలోకి నిరంతరం ప్రవహిస్తున్న కారణంగా మనం ఎంతో సహజంగా అహం యొక్క బంధనం నుంచి ముక్తి పొందుతాం. అలాగే మిషన్ యొక్క దశ నియమాల దశలను దైవిక సదాచరణ ద్వారా ప్రేమమయమైన ఆ అనుపమ దశల శోభను పొందుతూ ఉంటాం. మొట్టమొదటి రెండు నియమాల ఆధారంగా ఇటువంటి దైవ సాన్నిధ్యం పొందుతాం. అనగా ఈశ్వరుడు హృదయంలోనే, మనస్సు అనే మందిరంలోనే ఉండటాన్ని అనుభూతి పొందుతాం. ఆ తర్వాత మిగిలిన వాటిలోని రెండు నియమాలు అనగా మూడవ, నాల్గవ నియమాల ఆధారంగా మనం దైవ సామీప్యత యొక్క పవిత్రత మరియు దివ్యప్రేమలో అడుగుపెట్టి దైవిక సత్యంలో లయమైపోతాం. అప్పుడు సృష్టి యొక్క బీజరూపమైన దైవిక బాంధవ్యం అనగా సోదరభావ ప్రవాహస్పర్శను పొంది సఫలీకృతులమైపోతాం. ఆ అనుభవాన్ని కేవలం బాబూజీ కృపతోనే సంపూర్ణంగా వ్రాయటం సంభవమైంది.

"జగతి జనులందరినీ నీ సోదరీ సోదరులుగా భావించి, అందరిపట్ల అదే రీతిగా వ్యవహరించు" అని ఆదేశించినట్టిది ఎంతో పవిత్రమైనదీ మరియు ప్రియమైనదీ కూడ. కాని అది ఎప్పుడు సంభవమవుతుంది అంటే, ఎప్పుడైతే ప్రకృతి యొక్క అన్ని పనులు సక్రమంగా నిర్వర్తింపబడతాయో, అప్పుడు అది సంభవమవుతుంది. ఎందుకంటే, అది సదా ఈశ్వరీయ శక్తితో అనుసంధానమై ఉంటుంది. అదే విధంగా ధ్యానంలో పూర్తిగా లయమై ఉండటంవలన స్వతస్సిద్ధంగానే నిరంతర స్మరణ ద్వారా ఈశ్వరునితో మన సంబంధం ఏర్పడిపోయి, ఇంక అప్పటి నుంచీ భౌతికపరమైన అన్ని పనులు కూడా వాటంతటవే జరిగిపోతూ ఉంటాయి. అందుచేత ఆ పనులకు మనం కర్తలం కానందున వాటి సంస్కారాలకు అతీతులమై పవిత్ర జీవనం చేస్తూ భక్తిలో లయమై సర్వమానవ సహోదరత్వంలో మునిగి ఉండి జీవిస్తాము. మానవ మాత్రులు ఇటువంటి మహత్తర, అసాధారణ దివ్య జీవనపు పరమానంద రసానుభూతిని పొందాలనీ, అటువంటి సదవకాశాన్ని తప్పక బాబూజీ అనుగ్రహించాలనీ, నేను 'వారి'ని ప్రార్థిస్తున్నాను. దైనందిన జీవన కార్యాచరణ స్వచ్ఛంగాను, పవిత్రంగాను ఉండి స్వయంగానే కొనసాగిపోతూ ఉంటుంది. ఆ నడత అతిస్వాభావికమైందిగా ఉంటుంది. "దైనందిన జీవిత విధానం కూడా పూజయే అవుతుంది" అని బాబూజీ చెప్పిన మాట మనలో

దైవిక దశ రూపంలో అవతరిస్తుంది. ప్రతి మానవుడు ఈశ్వరీయ శక్తితో యోగం పొంది ఉన్న కారణంగా తన ప్రియసోదరునిలాగే అనిపిస్తాడు. ఈ అనుభవమే మన ఆచరణలో కూడా కార్యరూపం దాల్చుతుంది. అందుకు మనం ప్రయత్నించనవసరం లేదు, దానంతట అదే జరిగిపోతుంది. మహాత్ముడు శ్రీ బాబూజీ మహరాజ్‌కే మనం స్వయంగా అర్పితమైపోయి ఉంటే, ఇటువంటి దశను పొందటం ఇంకా సులభ సాధ్యమవుతుంది. ఇందులో మనకు లభించే మరో ప్రయోజనం ఏమిటంటే, ఎంతగా మన అహం కరిగిపోతూ ఉంటుందో, అంతగా 'వారి' దివ్య ప్రేమతో కూడిన కృపాదృష్టి మనపై సూటిగా పడుతూ ఉంటుంది. 'వారి' ఆ దైవిక దృష్టి ఫలితంగా ఈశ్వరప్రాప్తికైన దీక్షలో మునిగి ఉండి అహంలేని వారమై మనం ఇంక అనుక్షణం ఈశ్వరునిలోనే లయమైపోతూ ఉంటాము. ఈ దివ్య జీవనం యొక్క దివ్య రహస్యం ఏమిటంటే, ఆధ్యాత్మికోన్నతి క్షేత్రంలో శ్రీ బాబూజీ మహరాజ్ మానవ మాత్రులకు దీనిని దివ్య దశారూపంలో సులభం చేసివేయటమే. నా అభ్యాస కాలంలో అనేకానేక దశలు ప్రాప్తించిన తర్వాత నేను నా బాబూజీకి వ్రాసిన ఈ విషయం నాకు బాగా జ్ఞాపకం ఉంది. "ఆత్మ పరమాత్మలో విలీనమైపోయినట్లుగా అనిపిస్తోంది. ఎవరైనా అత్మ గురించి ప్రస్తావిస్తూ ఉంటే, నేను వింటూనే ఉంటాను. కాని దేనిని గురించి మాట్లాడుతున్నారో, అది నాకు చెందినట్లుగా కాని, దానిని గురించి నాకు ఏమైనా తెలిసినట్లుగా గాని అనిపించటం లేదు. అంతేకాదు, "ఎందు చూసినా అందు శ్యామసుందరుడే" అనిపించేటటువంటి దివ్య దశలో నేను ప్రవేశం పొందాను. మేమంతా ఒకే పరమాత్మకు చెందిన బిడ్డలమని అనిపిస్తోంది. ఈర్ష్య, ద్వేషం, చిన్న, పెద్ద, ఉచ్ఛ నీచాల భావం ఏమీ ఉండటం లేదు. భేదభావం యొక్క బీజమే నశించిపోయినట్లుగా అనిపిస్తోంది. సహజమార్గ సాధనలో ఈశ్వర ప్రాప్తి అనే లక్ష్యాన్ని బీజరూపంలో బాబూజీ మనలో నాటారు కనుక, దానిని తడపడం కోసం భక్తిరసం స్వయంగానే జాలువారుతూ ఉంటుంది. విత్తుకొద్దీ ఫలం ఉంటుందన్నది సత్యమే. అభ్యాసీ నియమబద్ధంగా ఉండటానికి ప్రయత్నించాల్సిన అవసరం లేకపోవటానికి బహుశా ఇదే కారణం కావచ్చు. "సహజమార్గంలో సహోదరత్వాన్ని ప్రాణంగా పూరించాను" అన్నారు బాబూజీ. అభ్యాసులకు ఇది కొలబద్దవంటిది. ఎలా అంటే, మనలో ఈ దశ కలగనట్లయితే, "సహజమార్గ సాధనను ఇంకా మనదిగా అవలంబించనట్లుగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది" అన్నారు బాబూజీ. ఇంతే గాకుండా నా ఈ దశను గురించి –"నా స్థితి ఎలా ఉందంటే, అచేతనం, చైతన్యం, పశుపక్ష్యాదులు అన్నింటినీ స్వంతంగా భావించి వాటిని హత్తుకోవాలని నా మనస్సు కోరుతోంది" అని బాబూజీకి వ్రాయగా దానికి ప్రత్యుత్తరంగా వారు – "నీకు ఈ స్థితి కలిగినందుకు శుభాకాంక్షలు. ఆత్మోన్నతికి చెందిన అత్యున్నత స్థాయి అందరిపట్ల సమభావాన్ని అంతరంగంలో జ్వలింపజేస్తుంది. కాని వ్యావహారిక జీవనంలో అటువంటి అనుభవం నీలో కలగకపోవటానికి కారణం, లోకులు నిన్ను పిచ్చిదానిగా భావించే అవకాశం ఉండటమే. ప్రకృతియే స్వయంగా నీ జీవన గమన పగ్గాల్ని పట్టి ఉంచుతుంది" అని వ్రాశారు. అయితే మన బాహ్య ఆచరణలో ఆంతరిక ఆత్మీయత స్వచ్ఛంగా నిండి ఉంటుంది.

చిట్టచివరకు ఈశ్వర ప్రదత్తమైన ఈ దశ ఎందుకు ఆటంకపరచబడుతోంది? మనిషి మరొకర్ని మనిషిగా ఎందుకు గుర్తించలేకపోతున్నాడు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి జవాబును నా అనుభవాన్నిబట్టి

తర్వాత అర్థం చేసుకున్నదాని ప్రకారం, మన దృష్టి ఎప్పుడైతే ముఖ్య దైవిక బిందువు నుంచి తొలగిపోతుందో, అప్పుడింక దృష్టి అహం మీదనే నిలిచిపోయి, ఆ అహమే వృద్ధి చెందుతూ ఉంటుంది. క్రమంగా మనం ఈ పంథాలోనే ఇమిడిపోయి ఉండటం వలన ఆ 'అసలు'నే మరచిపోతాము. తత్ఫలితంగా మన ఆలోచనా క్రమం, ధ్యానంపట్ల సావధానం అహం యొక్క ఆవరణలోనే చిక్కుకుపోయి సంకుచితమైపోతాయి. మన నడవడిక అహం కలయికతో ప్రభావితమైనందువలన ఆంతరికమైన ఆత్మీయతానుబంధం తెగిపోయి ఖండఖండాలుగా చెల్లాచెదురైపోతుంది.

మనం ఇంక ఆరవ నియమం యొక్క పరిపూర్ణతలో స్నానమాడాము. అందరిపట్ల ఆత్మీయత అనురాగాలు, నమ్రత కలిగిన జీవనశైలి, ఇతరులెవ్వరి ద్వారానైనా కల్పించబడిన కష్టాలను కూడా లెక్కచేయకుండా ఉంటూ, ప్రియుని సమీపించే ఉత్తమ దశలో మునిగి, ఇతరులకు కూడా ఆ స్థితిని పంచుతూ సంస్థ యొక్క ఏడవ నియమంలో ప్రవేశిస్తోంది. ఇక్కడ మనం ఎక్కడి నుండి వచ్చామో, ఎక్కడ వేచి ఉన్నామో కూడా తెలియని మరచిన స్థితిలో ఉంటాము.

## ఏడవ నియమం

**"ఎవరివల్లనైనా కష్టాలు కలిగితే దానికి ప్రతీకారేచ్ఛ ఉండకూడదు. అవి దైవం నుంచే వచ్చినవిగా భావించి అందుకు వారికి ధన్యవాదాలు అలర్పించు."**

మనం అనుభవించే కష్టాలు, సుఖదుఃఖాలు – మన పూర్వకర్మలు, మరియు సంస్కారాల ఫలితం అని అనాదిగా చెప్పుకుంటూ వస్తున్నాము. "నీ సుఖదుఃఖాలు ఎవరివల్లనో కలిగినవి కావు; అవన్నీ స్వయంకృత కర్మల ఫలమే అని భావించు." ఈ మాట మనం అంగీకరిస్తున్నాం కూడా! అలాగైతే మన కష్టాలకు కారకులు ఎవ్వరో అనుకొని వారికి హాని తలపెట్టటానికి, ద్వేషించటానికి కారణం ఏమిటి? మళ్ళీ నోటితో పైకి మాత్రం "అంతా మా ఖర్మ" అంటూ ఉంటాం. ఇలా అనుకోవటం మాటవరసకు మాత్రమే! ఇలాంటి ఈ పవిత్ర స్థితి ఆంతరికమైనది కానందున, మన జీవన వ్యవహారం, నడవడి, ఆలోచనలకు, నోటిమాటకు మాత్రమే కట్టుబడి ఉంటుంది. అది వాటిలో విముఖత, ఈర్ష్యాద్వేషాలు అయినా కలిగించవచ్చు లేదా ఎప్పుడైనా సదాచరణకైనా తోడ్పడవచ్చు. ఇటువంటి మన జీవనపు నడతలో సమతుల్యం లేకపోగా చంచలత్వమే ప్రకటితమవుతూ ఉంటుంది. ఇది తెలిసి కూడా సంయమనంతోను, నియమాలతోనూ దానిని నియంత్రించి ఒకే విధంగా ఉండునట్లు చేయాలని తలపెట్టాము. అయితే సత్యదశకు దూరంగా ఉండటంచేత పవిత్రత చేకూరదు.

మానవుని ఈ మానసిక బలహీనత కారణంగా, మనోవృత్తుల చాంచల్యం అతని వశంలో లేకుండాపోతుంది. బహుశా ఇదే మన అపజయానికి కారణం కావచ్చు. మానవుని ఈ కరుడుగట్టిన మానసిక దుర్బలతను తొలగించటానికే మన బాబూజీ మహరాజ్ సహజమార్గంలో సహజ సాధనా మార్గం (ధ్యానమార్గం) ప్రవేశపెట్టారు. **"సహజమార్గం పైనుంచి దిగివచ్చింది" అని 'వారు' చెప్పారు. మానవుని యొక్క ఈ దౌర్బల్యాన్ని సహించలేకపోయినందువల్లనే సృష్టికర్తయే స్వయంగా ఈ విధానాన్ని పై నుంచి, బాబూజీ ద్వారా తరలించారు అని చెప్పటానికి ఇదే నిదర్శనం.** శ్రీ బాబూజీ మహరాజ్, శక్తికి మరియు వైభవపటిమకు తార్కాణమైన సహజమార్గ పద్ధతి అందరి ప్రయోజనం కోసం ఆధ్యాత్మిక సూర్యునిలాగా దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యదృష్టి, కాలానుగుణంగా సాధనకు తగినట్లుగా మలచబడిన దైవిక సాధనలో ధ్యాన నిష్ఠతో స్వయంగా దివ్యత్వాన్నే నింపివేసినట్లయ్యింది. శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినట్లుగా "ఈశ్వరుడు హృదయంలోనే కొలువై ఉన్నాడు" అన్న జ్ఞానం మనం ధ్యానంలో కూర్చున్న కొద్ది సమయంలోనే కలగడానికి ఇదే కారణం. ఈశ్వర ధ్యానంలో మునిగి ఉన్న దృష్టి ప్రహరీలాగా ఆంతరిక శుచికి రక్షణగా ఉంటుంది. అవాంఛనీయమైన ఆలోచనలను కూడా లోనికి ప్రవేశింపనివ్వదు. ఇందువలన మనల్ని స్వయంగాను, మరియు మన అంతరంగంలోని దివ్యానందాన్ని సురక్షితంగా నిలుపుకోవటానికి మనం ఎటువంటి చెడు విషయాల గురించి ఆలోచించలేని వారమై ఉంటాము. శ్రీ బాబూజీ మహరాజ్ ద్వారా సహజమార్గ సాధనలో ఈశ్వరప్రాప్తి అను లక్ష్యం యొక్క బీజం నాటబడ్డాక, దానికి సంబంధించిన విషయాల్లోనే అనగా సదాచరణలోనే మన మనస్సు నిమగ్నమై ఉండటానికి ఇదే కారణం! ముమ్ముందు ఆధ్యాత్మికోన్నతిని పొందుతూ ఉంటే మన ఆలోచనల్లోనూ, ధ్యానంలోనూ –మనలో

ఏర్పడి ఉన్న ఇతర సంస్కార–దోషాలు స్వయంగా నశించిపోసాగుతాయి. తొలుత చేసిన తప్పిదాల ఫలితంగా వచ్చే అనాసక్తమైన ఆలోచనల వలన కలిగే సంస్కారాలు, మనం నిరంతర స్మరణ ద్వారా కలిగే పరమానందంలో మునిగి ఉంటూ ఉండగా ఏ కొంచెంగానో భోగం చెంది అంతరించిపోతాయి. అలా ఎందుకంటే, ప్రకృతి ధర్మం ప్రకారం మన మొట్టమొదటి స్థితిలో ఎంత స్వచ్ఛత ఉండేదో ప్రతిదీ కూడా అంతే స్వచ్ఛంగా ఉండాల్సి ఉంటుంది.

మనం చూస్తూ చూస్తూ ఉండగానే అపూర్వం, అలౌకికమూ అయిన ఘటన జరుగుతుంది. అది ఏమిటంటే, ఏదైతే భౌతికత యొక్క ప్రభావంతో స్థూల్యంగా అయి, అంతరంగంలో దాగి ఉన్న వాస్తవికతను క్రమ్మివేసిందో, అదే వస్తువు ధ్యానం మూలంగా ఈశ్వర సామీప్యత యొక్క వెచ్చదనం పొంది కరిగిపోతూ ఉంటుంది. అలా జరగటంవలన ఆంతరికంగా మరుగునపడి ఉన్న ఆ వాస్తవిక స్థితి లేదా దైవంతో యోగాన్ని పునరుద్ధరింపజేస్తుంది. తన కర్మఫలానుభవాన్ని ఇతరుల వలన కల్పించబడిన కష్టాలుగా భావించి ఈర్ష్యాద్వేషాలు, పగ, క్రోధంలో మునిగి అజ్ఞానంతో చేసే చర్యలలో మనం కూరుకుపోవటానికి భౌతికత్వంలో మునిగిన మన స్థితియే కారణం. ఇప్పుడు బాబూజీ మహరాజ్ ద్వారా సహజమార్గ సాధనలో ధ్యానం మరియు ఆలోచనలను ఆంతరికంగా ఉన్న దైవ స్మరణలో లగ్నంచేసి ఉంచటం వలన, ఈశ్వర సామీప్యత యొక్క వెచ్చదనం తరచుగా అనుభవమవుతూ ఉంటుంది. దాని వలన మన వాస్తవిక దశ దివ్యంతో యోగం పొందిన తర్వాత ఆ ఈర్ష్యాద్వేషాలు, క్రోధం మొదలైన వాటి నుంచి విముక్తమైపోయిన ఆంతరిక మనస్సు పవిత్రవంతమై సన్మార్గంలో నడుస్తుంది. కావాలనుకున్నా కూడా తన కష్టాలకు ఇతరులు ఎవ్వరూ కారణంకాదని ఇప్పుడు అనిపిస్తుంది. అప్పుడింక ద్వేష భావానికి అతీతమైపోయి అభ్యాసులు ఈశ్వరుని శరణాగతిలోనే ఉంటారు. మరి ఎవ్వరిపట్లా విరోధభావం ఏర్పడకపోగా దైవిక సాధుస్వభావం మన వ్యవస్థ (సిస్టమ్) అంతటిలోను క్రమంగా వ్యాపిస్తుంది. ఆంతరిక మనస్సు యొక్క వినమ్రతకు మనం స్వస్వరూపులుగా తయారైపోతాం. ఇప్పుడింక బాబూజీ మనలో పూర్తిగా దైవిక దశను కలిగించి మనల్ని ప్రతి నియమం యొక్క బంధనం నుంచే కాకుండా భౌతికతకు చెందిన అస్వాభావిక చేష్టలనుంచి కూడా విముక్తుల్ని చేస్తారు. అప్పుడు ఆ దశ ఎలా ఉంటుంది అంటే, “మాయ, భయం, భ్రమ లేవు. తెరమరుగు, సంశయం లేవు. అద్దానికి నీ సంగతి ఏం తెలుసు. ‘నీవు’ దగ్గరైతే ‘నేను’ లేకపోతాను” –అనగా అహం అనేది లేకపోయాక మిగిలి ఉండేది రియాలిటీ (వాస్తవికత)యే గదా! ఇక ఏడవ నియమానికి చెందిన గ్రంథి విప్పారిపోయి మనల్ని ఎనిమిదవ నియమం యొక్క స్థితిలోనికి ప్రవేశపెట్టేస్తోంది.

# ఎనిమిదవ నియమం

**“భోజనం చేసే సందర్భంలో అందుబాటులో ఏది ఉంటే దానినే దైవాన్ని స్మరిస్తూ ఆప్యాయంగా ఆరగించు. ఆర్జన నీతివంతమైనదిగాను, పవిత్రమైనదిగాను ఉండటం ముఖ్యాతిముఖ్యం”**

నాకు పదే పదే తలంపుకు వస్తున్నది ఏమిటంటే, మానవుడిని సంయమ నియమాల ద్వారా అతని జీవన సరళిని, స్వభావాన్ని సరిదిద్దటానికి సంస్థకు అనువైనట్లుగా జీవన విధానాన్ని అవలంబింపజేయటానికే కొన్ని నియమాలు విధిగా అమలు చేయటం జరుగుతుంది. ఇది యధార్థమూ, అవసరం కూడా. ఎందుకంటే, మన జీవన విధానం సామాన్య జనుల జీవన విధానం మాదిరిగా ఉండిపోయి, పవిత్ర ఆలోచనలతో ముడిపడి ఉండకపోతే, జనం సంస్థను, దాని సంస్థాపకుణ్ని చులకనగానే అంచనా వేస్తారు. అలాగే భావించాలి కూడా. ఎందుకంటే, జనులందరి జీవనంలాగానే, అందరి ఆలోచనల లాగానే మనది కూడా ఉంటే మన సంస్థ యొక్క విశిష్టత ఏమి ఉంటుంది?

శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన సహజమార్గ సాధనలో మానవునికి ఈశ్వరప్రాప్తి తర్వాత అంతిమ సత్యం అనగా ‘భూమా’కు చేరునట్టి లక్ష్యాన్ని బాబూజీ అందించారు. అది పొందిన నాకు అనుభవమయ్యింది ఏమిటంటే, ఇది పూర్తిగా ఆధ్యాత్మిక సంస్థయే అనీ, నియమాలతో కాకుండా వాస్తవికత (రియాలిటీ)తోనే యోగం చెంది ఉంది అనీ అనిపించింది. ఇందులో ఉన్న ఒక రహస్యాన్ని నేను గ్రహించింది ఏమిటంటే, సహజమార్గ సాధన, అభ్యాసిగా మాత్రమే మన సాధన పరిమితమై ఉన్నంతవరకు మనకు అందులో సమకూడి ఉన్న ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థన మరియు నియమాలు అన్నీ జ్ఞాపకం ఉంటాయి. మన సాధనా పరిమితి యొక్క బంధం తెగిపోయినప్పుడు, మనం ధ్యాన ధారలో ప్రవహించిపోతూ హృదయ మండలం (హార్ట్ రీజియన్) యొక్క విరాట్ క్షేత్రంలోకి చేరిపోతాము. అప్పటి నుంచి మనమింక ధ్యానానికి బదులు మన ధ్యేయమైన ఈశ్వరునితో యోగం చెందుతాం. అప్పుడే అందులోని అలౌకికతను నేను గ్రహించాను – సంస్థకు బదులు సంస్థాపకుని యొక్క దివ్యప్రేమ నేత్రాలతో పాలించబడుతూ సహజమార్గపు వాస్తవికతతో స్వయంగా సంబంధం కల్పించుకుంటాం. ఇదే రీతిలో బాబూజీ మహరాజ్ ద్వారా వెల్లడైపోయే సహజమార్గ సాధనా రహస్యం ఏమిటంటే, అభ్యాసీ జీవన విధానాన్ని ‘ఐ’నెస్ అనగా అహం యొక్క బంధనం నుంచి విముక్తం చేసి ఆది–ప్రకృతితో సంయోగం కలిగిస్తుంది. అనగా కృత్రిమ జీవనం నుంచి సహజమైన జీవన దిశగా మళ్ళిస్తూ త్వరత్వరగా మనల్ని మన వాస్తవికత (రియాలిటీ)తో సంబంధం కల్పిస్తుంది. ఈ యదార్థం నా స్వానుభవానికి ఎప్పుడు వచ్చింది అంటే, దైనందిన జీవితంలో ‘నేను’ అనే భావం అనగా ‘అహం’ భావం క్రమంగా తరిగిపోతూ, ఆఖరికి మళ్ళీ దాని (నేను) స్థానంలో ‘నీవు’ అనగా దైవ భావం ఎప్పుడు స్థిరపడిపోయిందో కూడా నాకే తెలియకుండా పోయినప్పుడు గ్రహింపుకు వచ్చింది. “ఒక్కొక్కప్పుడు స్నానం చేసిన తర్వాత దుస్తులు ధరించాలనే ధ్యాస కూడా లేకపోయి, చేతులు తలుపు తెరవటానికి సిద్ధపడతాయి. కాని వెంటనే నా చేతులకు గబుక్కున ఎవరి చేతి పవిత్ర స్పర్శయో కలిగినట్లుగా అనిపించి, ఒక్కపెట్టున దుస్తులు ధరింపజేశాకే తలుపు తెరుస్తాయి” అని బాబూజీకి వ్రాశాను. దానికి జవాబుగా ‘వారు’ వెంటనే

నీది అవధూత స్థితి వంటిది. ఈ స్థితిలో అభ్యాసి అభ్యసింపజేసేవానితో ఉండాలి, లేదంటే అధ్యాపకుడు అభ్యాసి వెంటనైనా ఉండాలి. కాని మన గృహస్థ సంస్థలో నేటి పరిస్థితులనుబట్టి చూస్తే ఇది సంభవం కాదు. అయితే నేను కాదు కాని, సరియైన సమర్థ గురువు యొక్క దివ్యతా దృష్టి నీ మీద నిలిచి ఉంది. నీ స్థితిని గురించి వ్రాస్తూ ఉండు" అని వ్రాశారు. నేను గ్రహించినది ఏమిటంటే, శ్రీరామచంద్ర మిషన్‌లో బాబూజీ పది నియమాలు నియమించారు కాని, వాస్తవానికి సంస్థను సత్యత్వం (రియాలిటీ)తో ప్రాణప్రదం చేశారు. అభ్యాసం చేసే సమయంలో ఈ నియమాలను విధిగా పాటించవలసి ఉండటానికి ఇదే కారణం. కాని దాని వాస్తవికతలో ప్రవేశించగానే శ్రీ బాబూజీ మహరాజ్ కృప మరియు శక్తి ద్వారా ప్రతి నియమం దైవీయ శక్తితో సంపన్నమైనట్లుగా గ్రహించాను. ఇంక లయ-అవస్థ ప్రాప్తించగానే ఆ శక్తి సంపన్నత మన జీవనంలో నింపబడుతూ ఉంటుంది. అది ప్రకృతి యొక్క రహస్యాన్ని బహిర్గతం చేయటానికే బాబూజీ ఈ దశ నియమాలను తమ సంస్థలో ఆచరింపవలసినట్లుగా నియమించారని అనిపిస్తుంది. ఆ రహస్యం ఏమిటో చూడండి! శ్రీరామచంద్ర మిషన్‌తో సంబంధం కలగ్గానే ఈ నియమాలను అభ్యాసి పాటించవలసి ఉ ంటుంది. అయితే ఆంతరికంగా దైవ ధ్యానంలో మునిగిపోగానే ధ్యానం నుంచి, ఆలోచనల నుంచి భౌతికతా ప్రభావం ఏ విధంగానైతే తొలగిపోతూ ఉంటుందో, అదే విధంగా మన అభ్యాసులకు ఈ నియమాలు ఆంతరిక జీవనంలో కలిగిన దివ్య సౌందర్యానికి ప్రతిరూపమైపోగా మనం సాక్షిలాగా చూస్తూ ఉండిపోతాం. అది ఇంకా ఎలా ఉంటుంది అంటే, ఈ నియమాలను ఎవరైనా చదువుతున్నా లేదా ఎవరైనా వీటిని గురించి వివరిస్తున్నా ఇవన్నీ నాలో ఉన్నవే కదా, అనిపిస్తుంది. ఇప్పుడు ఈ సహజమార్గ సాధన యొక్క సహజమైన దివ్య సౌందర్యాన్ని చూసినట్లయితే, కేవలం ధ్యానం ద్వారా దైవానుబంధంతోపాటు నిరంతర ప్రయత్నశీలురుగా ఉంటూ ఉండగా మన అభ్యాసుల ప్రయోజనార్థం ఇందులో అవసరమని వర్ణింపబడిన ప్రతి విషయమూ స్వభావ సిద్ధంగానే తన రహస్యాన్ని మనకు వెల్లడిచేసి మన ఆంతరికంలో ఈశ్వర ప్రత్యక్షత కలిగిస్తూ తన సత్యత్వం మరియు శక్తితో సహా మనలో ప్రవేశిస్తున్నట్లు తెలుస్తుంది. ధ్యానం తన నిజనివాసం ఏదో తెలిపి దైవ దర్శనం కలిగించి స్వయంగా లయమైపోతుంది. నైర్మల్యం స్వయంగా తన దివ్య స్వచ్ఛతను అర్పించి బాబూజీలో లయమైపోతుంది. ప్రార్థనే స్వయంగా ప్రార్థితునిగా అయిపోయి 'వారి' చరణాలకే అర్పితమైపోతుంది. ఈ దివ్య ఫలితం మనకు, ఈశ్వరీయ గతి ప్రాప్తమైపోయిందని అనిపించేటటువంటి విశిష్ట దశను కల్పిస్తుంది. అనగా దైవ సాలోక్యతను పొంది మనం ఈశ్వరీయ దేశంలో ఉంటూ ఉండడం వలన మనం భుజిస్తూన్నది దైవ ప్రసాదమేనని అనిపిస్తుంది. ఒక వంక చూస్తే ప్రాపంచిక జీవనంలో ధ్యాన మగ్నమై ఉంటున్నందు వలన, మన ఆర్జన దానికదే పవిత్రవంతమైనదిగా అయి ఉంటుంది. అందరూ తనవారే అన్న భావన మూలంగా మనకు పవిత్రమైన సంపాదనమినహా మరే ధ్యాసా ఉండదు. భక్తిలో మునిగి భక్తిమయమైపోగా ఆహారం భుజిస్తూ ఉండగా మనస్సు ఎల్లప్పుడూ అవ్యక్తమైన ఆనందంలో పరవశిస్తూ ఉంటుంది. అలా ఎందుకు అనిపిస్తుందంటే, మనం భుజించిన పదార్థపు రుచికి బదులు అప్రయత్నంగానే ఆంతరిక ఈశ్వరీయ ఆనందం యొక్క రసాస్వాదన మనలో నిరంతరం కలుగుతూ ఉండటవల్లనే అని గ్రహించాలి. నాకు ఇప్పుడు ఇంకొక విషయం కూడా జ్ఞాపకం వస్తోంది ఏమిటంటే,

సాధన ప్రారంభించిన రోజుల్లో దైవ స్మరణలోనే మునిగిపోయి ఆహారం భుజిస్తూ ఉంటే, అది పవిత్రత చెంది నాకు పవిత్రతను చేకూర్చినట్లుగా అనిపించింది. నీటిని కూడా దివ్య ప్రాణాహుతిగా తలంచి త్రాగుతూ ఉంటే, చల్లని శాంతియుతమైన పవిత్ర శక్తి ధారను త్రాగుతూ ఉన్న అనుభూతి కలుగుతూ ఉండేది. ఈ ప్రకారంగా నరనరాల్లోనూ, అణువణువులోనూ దివ్యశక్తి ధారయే ప్రవహిస్తున్నట్లుగా అనిపించేది. ఇప్పుడా ఆ స్థితిని గురించి వర్ణించటం కూడా కష్టమైన పనే. అది పందెం గెలిచినప్పుడు పట్టరాని ఆనందం వంటిది. అయినా కూడా బాబూజీ ఏమి వ్రాశారంటే, "ఇంకా ముందుకు, మున్ముందుకు పోవాల్సి ఉంది. లక్ష్యం పరమ ఉన్నతమైనది అయితే పొందబోయేది కూడా పవిత్రమైనదిగానే ఉంటుంది. అది ఆధ్యాత్మిక విషయంలోనూ కావచ్చు, భౌతిక విషయంలోనూ కావచ్చు."

ఇటీవల సంపాదనపరంగా పవిత్రతకు ప్రాధాన్యత నివ్వకపోవటం వల్లనే మానవుని ఆలోచనా సరళిలో అపవిత్రత మరియు జీవనంలో ఆడంబరం నెలకొన్నాయి. ఏదో విధంగా ధనార్జన చేయాలనే ఆరాటంలో మానవుడు దానవుడుగా మారిపోయాడు. ఆ కారణంగానే ప్రతిపనీ దైవ స్మరణలో ఉంటూ చేయమని బాబూజీ చెప్పారు. ఎందుకంటే, దాని వలన ఆంతరికం పవిత్రమవుతూ పనీ పవిత్రమవుతుంది. ఇప్పుడు ప్రతి క్షేత్రంలోను పవిత్ర ప్రాణాహుతి, దాని శక్తి మనకు సహాయపడటానికి సంసిద్ధంగా ఉన్నాయి. సహజమార్గపు ప్రతి నియమమూ మనల్ని అస్వాభావిక జీవనం నుంచి స్వాభావిక జీవనం దిశగా నడిపిస్తాయి. అలాగే మనల్ని మాయాజాలం నుంచి తప్పించి దైవ స్వాతంత్ర్యాన్ని సమకూరుస్తాయి. ఇప్పుడింక మనకు తొమ్మిదవ నియమం యొక్క స్థితితో పరిచయం కలుగుతుంది.

# తొమ్మిదవ నియమం

**"మీ జీవన శైలిని, ప్రవర్తనను అత్యుత్తమంగా తీర్చిదిద్దుకోవాలి. దానిని గమనించిన ఇతరులకు మీపై సదభిప్రాయం కలిగి మిమ్మల్ని ప్రేమించేటట్లుగా ఉండాలి."**

సహజమార్గపు తొమ్మిదవ నియమం మన బాహ్య జీవనసరళికి, ప్రవర్తనకు సంబంధించి ఉంటుంది. మన ఆంతరిక స్వచ్ఛతయే ఇతరులకు మనపట్ల ఆకర్షణ, ప్రేమ జనించునట్లుగా మనం దృష్టిలో ఉంచుకోవాలి. "ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు," అన్నది యదార్థం. ఆ ధ్యాస కలిగి ఉన్నందువలన మన జీవన విధానంలోను, ప్రవర్తనలోను ఎక్కడా, ఎప్పుడూ కూడా వేలెత్తి చూపడానికి వీలుపడని విధంగానే మనం జాగ్రత్తతో ఉంటాము. "ఈశ్వరుడు అందరిలోనూ ఉన్నాడు" అను భావం సాధన ద్వారా మన ఆంతరికంలో ఎప్పుడైతే విలసిల్లుతూ ఉంటుందో అప్పుడు అందరిపట్ల ఆంతరిక అనుబంధం, అందరూ తన వారేనను భావం మన ప్రవర్తనలోను, జీవనసరళిలోను అప్రయత్నంగానే అలవడుతుంది. ఈ అనుభూతి కారణంగానే "నేను ఎక్కడికి వెళ్ళినా అందరూ ప్రేమమయంగానే కనిపిస్తున్నారు", అని నేను బాబూజీకి తెలియపరచాను. **యదార్థం ఏమంటే, బాహ్యంగా నియమ పాలనకంటే, అధికంగా సాధనలో తన్మయం చెందడం వలన, సాక్షాత్కారం పొందటానికి ఏమేమి అవసరమవుతాయో అవన్నీ మనలో తమకు తాముగానే కలుగుతూ ఉంటాయి.**

సహజమార్గ సాధన తాలూకు ముఖ్యమైన మూడు అంశాలు– ధ్యానం, నిర్మలీకరణ మరియు ప్రార్థన –అన్నింటినీ యధావిధిగా ఆచరించటం వలన మన అభ్యాసులకు కలిగే ఆధ్యాత్మిక పరిణామంలోని దైవిక రహస్యాన్ని ఎవ్వరు అర్థం చేసుకోగలరు? మరి నేను చెప్పేది గ్రహించండి. శ్రీరామచంద్ర మిషన్‌కు ప్రాణం వంటి వారైన శ్రీ బాబూజీ మహరాజ్‌లో ఎప్పుడైతే మనకు లయావస్థ సహజంగానే కలుగుతూ ఉంటుందో అప్పుడే మనకు ఆధ్యాత్మికంగా అనంత యాత్రకు సహజమైన, సూటియైన మార్గం దొరుకుతుంది. ఎందుకో తెలుసా? సహజమార్గ సాధనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడనే నిరంతర స్మరణ కలిగి ఉండటం వలన, మన ఎదుట ఆ అధిపతి యొక్క సామీప్యతా దశ సహజంగానే కలుగుతుంది. దైవ స్వరూపులైన కారణంగా 'వారి'కి మన ఆత్మ నివేదన ప్రారంభమై మన అహం యొక్క భావం 'వారి'కి సమర్పితమైపోతూ ఉంటుంది. నేను ఇక్కడ ఒక దివ్య మహిమను తెలుసుకున్నాను. దానిని సంపూర్ణంగా వర్ణించటం నా శక్తికి మించిన పని. అయినప్పటికీ ఇప్పుడు 'వారు' అందరి ప్రయోజనార్థం ఈ లేఖిని ద్వారా సమస్తమూ వెల్లడి చేయటానికి సిద్ధమయ్యారు కనుక, నేను ఈ దైవీయ రహస్యాన్ని ఇప్పుడు వ్రాయటానికి సాహసించ గలుగుతున్నాను. ఆ విషయం ఏమంటే, ఒకవైపున మనం శ్రీ బాబూజీ మహరాజ్‌కి ఆత్మ నివేదనతో మన 'అహం' భావం సమర్పించినట్లు అనుభవమవుతూనే ఉంటుంది, కాని మరక్షణంలోనే స్థితిని గురించి వ్రాసే సందర్భంలో లేఖిని 'ఈశ్వరుడు' అను పదం మాత్రమే ప్రయోగిస్తుంది. 'బాబూజీ' అను శబ్దం ప్రయోగించదు. ఇలా ఎందుకంటే, సహజమార్గ సాధనలో 'వారు' (బాబూజీ) మనకు 'ఈశ్వర ప్రాప్తి' అను లక్ష్యం ఇచ్చారు కనుక. 'వారు' మనల్ని లక్ష్యంతోనే సంఘటితం చేస్తారు కాని తమతో కాదు. ఇలా కూడా ఎందుకు అంటే,


ఆ దివ్య రహస్యాన్ని కూడా 'వారు' అందరికొరకు నా లేఖిని ద్వారా బహిర్గతం చేశారు. అదేమంటే, 'వారు' మొట్టమొదట అందరికీ 'ఈశ్వర ప్రాప్తి' అను లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే సాక్షాత్కారం తర్వాత ఈశ్వరీయ ముఖ్య కేంద్రంలో మునక వేయించి 'సత్యపద్' మీద మనల్ని ప్రతిష్టింపజేయించేది స్వయంగా 'వారు' మాత్రమే! ఇక్కడ నుండి ఆ నిగూఢ రహస్యం అందరికీ ఏమీ తెలుపుతుంది అంటే, 'వారు' అంతిమం నుంచి దిగి వచ్చిన 'దివ్య పురుషుడు' అనీ, భూమా ప్రాంతమైన కేంద్రమండలం, దాని వైభవాన్ని చాటుతుందన్న రహస్యాన్ని మొట్టమొదటిసారిగా అందరికీ తెలయజెప్పినవారు 'వారే'ననీ స్పష్టం చేస్తుంది. నన్ను వారే ప్రథమంగా సత్యపద్ మీద ప్రతిష్టించి, సెంట్రల్ రీజియన్ యొక్క ముఖద్వారంవద్ద గల స్థితి– 'పార్షద్' లేదా తురీయ అవస్థ యొక్క రహస్యాన్ని బయల్పరచి ఈ దశా వివరణను నాచేత వ్రాయించారు. అంతేగాకుండా, భూమాకు చెందిన సప్త వలయాల మొదటి ద్వారంవద్ద ద్వారపాలకుని స్థానంలో ఉన్న 'మహాపార్షద్' లేదా తురీయాతీత అవస్థను కూడా అనుగ్రహించి దాని వివరణ కూడా ఈ లేఖిని ద్వారా అందరికీ తెలియజేశారు.

మన అహం ఎంతగా కరిగిపోతూ ఉంటుందో అంతగానూ మాలిక్ అనగా శ్రీ బాబూజీ మహరాజ్ ప్రేమైక దృష్టి మన మీద సూటిగా పడుతూ ఉంటుందని నేను తెలుసుకున్నాను. మనం ఈశ్వరునిలో విలీనమైపోతున్నట్లుగా మనకు అనుక్షణం అనిపిస్తూ ఉంటుంది. ఇంకా నా అనుభవానికి వచ్చిన అలౌకిక దృశ్యం ఏమంటే, శ్రేష్టతమమైన దశల పరమానందంలో విలీనమై ఉంటూ నేను నా నామరూపాలు మరచిపోయాను. మరొక రోజున శ్రీ బాబూజీ మహరాజ్ నాకు ఎలాంటి అనుభూతిని కలిగించారంటే, ఎవరైనా 'రామా' అనిగాని 'కృష్ణా' అనిగాని 'భగవంతుడు' అనిగాని పిలుస్తూ ఉంటే, నేను దానికి స్పందించి నా ముఖం ఎత్తి చూసినట్లయ్యింది. అప్పుడు నేను ఈ రహస్యం కూడా గ్రహించాను, ఏమని అంటే, అవతారాలు ఈశ్వరీయ క్షేత్రం లేదా కేంద్రం యొక్క శక్తి నుంచి అవతరిస్తూ ఉంటాయి అని. మన పరిస్థితి ఎంత ఆశ్చర్యకరమైనదిగా ఉంటుంది అంటే, 'నేను' అను శబ్దం మన అస్థిత్వాన్ని స్పర్శించలేదు కూడా. ఎప్పుడైతే పని యొక్క స్పృహ లేకపోతుందో, ఎదుట ఉన్న ప్రత్యక్ష దైవం మీద దృష్టి నిమగ్నమైపోతుందో అప్పుడింక వారి దర్బారు నుంచి క్షమానుగ్రహమే లభిస్తూ ఉంటుంది. పాప భాండం బ్రద్ధలైపోతుంది. గుణదోషాలకు అతీతమైపోయిన మనం దైవదృష్టి లేదా శక్తి యొక్క దృష్టితో పోషింపబడుతూ ఉంటాము. ఇంక అభ్యాసీలో నియమాలు ఎలా అమలు జరుగుతాయో మీరు ఊహించండి. ఎందుకంటే, అవి లయ అవస్థలో కూడా లయమైపోయి విలీనంలో కూడా విలీనమైపోయి (ఫనాయియత్‌లో ఫనా అయిపోయి) ప్రతి దైవిక దశ హద్దును కూడా అతిక్రమించి సాగిపోతూ ఉంటాయి. అప్పుడింక నిరాడంబరత (సామాన్యత)యే ప్రత్యక్షంగా నెలకొని ఉండటం నా అనుభవానికి వచ్చింది. ఆత్మీయతగాని, విముఖత్వంగాని అనగా రాగద్వేషాల ఊసే ఉండదు. సమర్పణ కూడా తన స్పృహను కోల్పోయి ఉంటుంది. అభం శుభం తెలియని అమాయక దశ కూడా లయమైపోయి తన గుర్తింపును కోల్పోతుంది. ప్రతి స్థితి యొక్క పరిస్థితి ఇలాగే అయిపోయి అన్నీ 'ఆది ప్రకృతి'లోనే లయమైపోతాయి. మన మిషన్ దశ నియమాలు, నియమమనే కట్టుబాటు నుంచి విముక్తమైపోయి, శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యశక్తితో పూరించబడుతున్న మన అభ్యాసులను వీటినన్నింటిని దాటించి అతీతమైన సాక్షాత్కార స్థితికి తీసుకుపోతాయి.

నేను ఇప్పుడు ఈ పరమ సత్యం ప్రత్యక్షమైనట్లుగా అనుభూతి చెందుతున్నాను. **ధ్యానం అనేది 'వారి' దివ్య ముఖారవిందంగాను, నిర్మలీకరణ అనేది ఒక విశుద్ధ సాగరమైన 'వారి' హృదయంగాను, ప్రార్థనకు నిలయం 'వారి' చరణాలుగాను అనిపించాయి. అనగా సహజమార్గ సాధనకు 'వారు' ఒక సజీవ ప్రతిమ అనిపించింది. 'వారి' హృదయమే మన హృదయ మండలం అనీ. 'వారి' ఆలోచనా స్పృహలో మన నిరంతర నిమగ్నతయే మన మైండ్ రీజియన్ అనగా మనో మండలం అనీ, ఈ విధంగా మన అంతిమ సత్యంకు 'వారు' ప్రతిరూపమనీ అనిపించింది.** ఈ కారణంగానే 'వారి' ధ్యాన తన్మయత్వంలో కలిగే దివ్య సారూప్యత దశలో మనం ప్రవేశిస్తాం. ఇప్పుడు ఈ తొమ్మిదవ నియమపు దశ మన అస్థిత్వంలో వికశిస్తుంది. శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పినట్లు మనకు ఆలోచనల నుండి శక్తి సమకూరుతుంది. ఎప్పుడైతే మన స్మరణ వారితో అనుసంధానమవుతుందో, అప్పట్నుంచీ మన ఆలోచనల్లోను, ఆచరణలోను ఒక విధమైన సహజ సమతుల్యం ఏర్పడుతుంది. అది ఆది ప్రకృతి (మూలం) యొక్క ప్రకృతిని (స్వభావాన్ని) పోలి ఉంటుంది. మళ్ళీ ఇదే స్థితి మన నడతలో వ్యక్తమవుతుంది. మన భౌతిక ప్రవర్తనలో ఒక సమతుల్యం స్థాపన కావటానికి ఇదే కారణమవుతుంది. **మట్టి బొమ్మలు తయారు చేసేవానికి తను తయారు చేసిన బొమ్మలంటే అమితమైన ప్రేమ ఉంటుంది. దానితోపాటే మట్టిని గురించిన శ్రద్ధ కూడా ఉంటుంది. ఇదే విధంగా దైవానికి కూడా తను సృష్టించిన జీవులపట్ల సహజమైన ఆకర్షణ ఉంటుంది. మనం 'వారి' ధ్యానంలో లయమై ఉండటంచేత మనలో కూడా అటువంటి దైవీయ ఆకర్షణ కలుగుతూ ఉంటుంది. ఇటువంటి స్థితిలో ఉన్నప్పుడే మనపట్ల ప్రతి ఒక్కరి దృష్టి ప్రేమపూర్వకంగా ఉంటున్నట్లుగా నాకు తోచింది.** దైవ సంకల్పం మూలంగానే సమయానుకూలంగాను, అవసరానుగుణంగాను భూమి మీదకు అవతారాలు రావటం జరిగింది. దైవ చింతన, దైవంపట్ల విశ్వాసం లోపించినందువల్లనే సమర్థగురు లాలాజీ సాహెబ్ ప్రార్థనా ఫలితంగా, మళ్ళీ మానవునిలో దైవ చింతన పాదుకొల్పటానికి, అలాగే తమ దివ్య ధారా ప్రవాహాన్ని అంతరంగంలో ప్రవేశపెట్టి మళ్ళీ దైవంతో పరిచయం కలిగించి, దైవ స్మరణను మళ్ళీ చైతన్యపరచటానికే శ్రీ బాబూజీ మహరాజ్ అవతరణ జరిగింది. ఈ కారణంగానే 'వారి' ప్రథమ దర్శనంలోనే, 'వారి' దివ్య ఆకర్షణ మరియు దివ్య సౌందర్య ప్రతిభ దర్శించాక, 'వారి' ప్రేమ ఫలితంగానే నా హృదయం వారిని ప్రేమించటానికి వివశమైంది. 'వారి' ఈ ఆకర్షణయే వాస్తవానికి మనలో దైవంపట్ల ప్రేమను ఉత్పన్నం చేస్తుంది. అదే దివ్య ప్రేమగా మారి మన అంతరంగంలో వ్యాపించి తద్వారా మన అభ్యాసి జీవనాన్ని ఈ తొమ్మిదవ నియమపు సౌందర్యంతో శోభింపజేస్తుంది. ఈ నియమం తన స్థితినంతటినీ మనకు సమర్పితంచేసి స్వేచ్ఛత నందుతుంది.

## తొమ్మిదవ నియమం

## వలయాల వివరణ




వలయాల ప్రవేశ ద్వారం - మహాపార్షద్ (తురీయాతీత అవస్థ)

# పదవ నియమం

**నీవలన ఏదైనా అపరాధం జరిగినట్లయితే నిద్రించబోయే ముందు, భగవంతుడు నీ ఎదుట ఉన్నట్లుగా భావించి, దీనంగా క్షమించమని వేడుకుంటూ పశ్చాత్తాపం చెందాలి. మళ్ళీ అటువంటి అపరాధం చేయనని ప్రార్థిస్తూ అందుకు ప్రయత్నించాలి.**

మానవ ప్రకృతిని సాధు ప్రకృతిగా (యోగిలాగా) మార్పు చేసేదే నిజమైన సాధన. ఈ సహజమార్గ పదవ నియమం సాధకునికి ఈ విషయాన్నే నిర్దేశిస్తోంది. అందుకే బాబూజీ ఏమరపాటున జరిగే తప్పిదం గురించి కూడా ప్రస్తావించారు. నిదురించబోయే ముందు అపరాధం మన్నించమని వేడుకోవటంలో కూడా ఒక విశేషం ఉంది. దాని మూలంగా ప్రార్థనా భావంతో నిద్రించటం వలన రాత్రంతా అపరాధం గురించిన భావన మన మదిలో కలగదు. ఉదయం లేచేసరికి హృదయం తేలికై నిర్మలంగా ఉన్నట్లు అనుభూతి కలిగి మళ్ళీ అటువంటి తప్పిదం జరగకుండా ఉండటానికి మనస్సు జాగ్రత్త వహిస్తూ ఉంటుంది.

దివ్యప్రేమ ఎంత అద్భుతమైందో, తొలి నిరాడంబరత్వంతో మేళవించబడిన దివ్య జీవన సరళి ఎంత విశిష్టమైందో, అలాగే సమస్త ప్రకృతి మీద ఆధిపత్యం పొంది ఉండి కూడా విశుద్ధమైన మానవ ప్రకృతినే కలిగి ఉండు ఆ దైవీయ మానవ ప్రకృతి ఎంత అమోఘమైందో, నేను సహజమార్గ సాధన అవలంబించిన తర్వాతనే అనుభూతి చెందాను. శ్రీ రామచంద్రజీ మహరాజ్ ఆధ్యాత్మికంగా దివ్య క్షేత్రంలో (సెంట్రల్ రీజియన్‌లో) అభ్యాసిని ఈదించగల సమర్థులు. **సమర్థగురు శ్రీ లాలాజీ మహరాజ్‌కు దివ్య మానసపుత్రుడు, భూమాకు కీర్తినాపాదించునట్టి సత్‌పుత్రుడు మరియు ఆదిశక్తిపైన సంపూర్ణ ఆధిపత్యం కలిగి మహోన్నతులై ఉండి కూడా 'వారు' మనకు మాత్రం బాబూజీయే. ఆది సామాన్యత వారి మేలి ముసుగుగా భాసిల్లుతోంది.** ఆ ఆదిశక్తి మాత్రం వారిలో వికసించి ఈశ్వరీయ ధారా రూపంలో అభ్యాసీ అంతరంగంలోకి ప్రవహిస్తూ ఉంది. అలా ప్రవహిస్తున్న ఆ ఆదిశక్తియే 'వారు ఎవరు' అనే దివ్య రహస్యాన్ని ఈ లేఖినితో వ్రాయించగలిగింది. ఇప్పుడు ఈ లేఖిని 'వారి' ప్రేమతో కూడిన పావన స్పర్శను పొంది, ప్రాణిమాత్రుల హితంకొరకు సమర్పితమైన 'వారు ఎవరు'ను గురించి వ్రాయటానికి మళ్ళీ విజృంభించింది. అలా ఎందుకో తెలుసా? "ప్రాణిమాత్రులలో ఈశ్వర ప్రాప్తిని గురించిన కోరిక మళ్ళీ జాగృతం కావాలి" అను సృష్టికర్త కోర్కెయే 'వారు' అవతరించటానికి కారణమైంది. ఆ ఇచ్ఛను సాఫల్యం చేయటానికే, సమర్థ సద్గురుని ప్రార్థనా ఫలితంగా, అనంత శక్తి వైభవ సౌందర్యంలో స్నానమాడి, అంతిమం యొక్క శక్తి సంపన్నుడైన దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ రూపంలో ధరణిపైకి దిగివచ్చి ఆ దివ్య కార్యాన్ని నెరవేర్చటానికి పూనుకొన్నారు. ఈ కారణంగానే సంపూర్ణ ఆధ్యాత్మిక విజ్ఞానం, మూలం లేదా భూమా గురించిన విజ్ఞానంతోపాటు ఆదిశక్తి యొక్క విజ్ఞానం కూడా 'వారి' దివ్య అవతరణ సమక్షంలో తమ హృదయం విప్పి చూపాయి. అందువల్లనే సాక్షాత్కారం పొందటానికి మిషన్ దశ నియమాలు ఆ ఆంతరిక సౌందర్యానికి చిహ్నమని నేను వ్రాశాను. ఆది ప్రకృతి యొక్క దివ్య సౌందర్యం బాబూజీ పవిత్ర ప్రాణాహుతి ప్రసారం

ద్వారా మానవ ప్రకృతిని ఈశ్వర ప్రాప్తికి తయారు చేస్తుంది. నేను ఇప్పుడు గ్రహించిన ఇంకొక దివ్య రహస్యం ఏమిటంటే, శ్రీ బాబూజీ మహరాజ్ ద్వారా ఆది సౌందర్యం మరియు శక్తితో సమకూర్చబడిన మన మిషన్ దశ నియమాల స్థితుల సౌందర్యం మన జీవన విధానాన్ని ప్రకృతి సహజమైన జీవనంగా మార్చి, తర్వాత మనల్ని ఆది ప్రకృతికి సమర్పిస్తుంది. అప్పుడు ఒకానొక రోజున మన మానవ జీవనం పరమ లక్ష్యంలో మమేకమైపోయి ధన్యమైపోతుంది.


**"సహజమార్గ దశ నియమాల దివ్య సౌందర్యం"** వ్రాస్తూ ఉన్నప్పుడు, ప్రతి నియమంలోనూ మనం ఈశ్వరీయ శక్తితో యోగం చెంది ఉండాల్సిన స్థితి నెలకొని ఉన్నట్లుగా అనుభూతి చెందాను. 'వారు' మనకు దైవం (మాలిక్), ప్రియతముడు; మనం 'వారి' సేవకులం మరియు భక్తులం. ఈ అద్భుతమైన దివ్య సంబంధాన్ని మనం జ్ఞాపకం ఉంచుకున్నట్లయితే మనం 'వారి' నుంచి పొందే ప్రాణాహుతి ప్రసారంతో పునీతమవుతూ ఉంటాం. మన బాబూజీ మన మానవుల సహాయార్థం తమ దశ నియమాల్లో ఈ (ఆది) మూల సంబంధాన్ని సజీవంగా నిలిపారు. దీనిలోని ప్రత్యేకత కూడా ఏమిటంటే, 'వారు' తమ దివ్యశక్తిని నింపటమే! అవి ఒకదానినొకటి పెనవేసుకొని ఉండేటట్లుగా చేశారు. దాని వలన మనం ఒక దానిని పాటించినట్లయితే ఆ సమకూరిన శక్తి మనలో ఆ ఆది (మూల) సంబంధాన్ని అనగా భక్తుడు – భగవానుడు, స్వామి – సేవకుడు అను సంబంధాన్ని జాగృతం చేసి సచేతనంగా ఉంచుతుంది. 'వారు' స్వామి అయినప్పుడు మనం ప్రార్థించేవారం కావటం యదార్థమే. శ్రీ బాబూజీ మహరాజ్ రూపొందించిన సహజమార్గ సాధనలో ఉన్నటువంటివి మొదటిది ధ్యానం, రెండవది నిర్మలీకరణ మరియు మాడవది ప్రార్థన. ఈ మూడింటి ఉద్దేశ్యం ఏకీభవించి ఉంది. ఒక విధంగా చెప్పాలంటే, పగలు చేసిన తప్పిదాలకు రాత్రి క్షమార్పణ కోరటం ద్వారా –మన మిషన్ పదవ నియమం –బాహ్య జీవనం (ప్రాపంచిక జీవనం) పవిత్రవంతంగా ఉండాలని సూచిస్తుంది. సహజమార్గ సాధనలో నిర్మలీకరణ గురించి, "మన ఎదుట శ్రీ బాబూజీ మహరాజ్ కూర్చుని ఉన్నారు. 'వారి' నుంచి ఈశ్వరీయ ధారా ప్రవాహం మన హృదయంలోనికి ప్రవహిస్తున్నట్లుగాను, ఈశ్వర ప్రాప్తిగా 'వారు' ఇచ్చిన లక్ష్యానికి అవరోధంగా ఉన్నవ అన్నీ తొలగించబడి బయటకు విసిరివేయబడుతున్నట్లు గాను భావించాలి" అని చెప్పబడింది. దీని వలన దైవంపట్ల ఆత్మ నివేదనా భావం తప్పకుండా ఉంటుంది. అది మనకు తెలియకపోయినప్పటికీ అనుబంధంగా ఉండి దైవంతో మనకు ఎక్కువ సామీప్యత కలిగిస్తుంది. దీని వలన బాబూజీ ద్వారా మనలో పూరించబడిన దైవిక సంబంధం అనే ప్రాణం అప్రయత్నంగానే మనలో చైతన్యవంతమవుతుంది. దాని ఫలితంగా దైవంపట్ల మనలో ఏదో అవ్యక్తమైన అనుబంధం పెంపొందుతూ ఉంటుంది. మన మిషన్ యొక్క సహజమార్గ సాధనా సత్ఫలితం ఏమిటంటే, అది మనలో భక్తిరసాన్ని ఫలింపజేస్తుంది. మనలోని నిరంతర తపన దైవంతో యోగం చెందటానికి తొందరపెడుతూ ఉంటుంది. **మన మిషన్ నియమం యొక్క ప్రార్థనలోను, సహజమార్గ సాధన యొక్క ప్రార్థనలోను చాలా భేదం ఉందని చెప్పవలసి ఉంటుంది. ఎలా అంటే– నియమానికి చెందిన ప్రార్థన మన దైనందిన జీవితాన్ని సరిదిద్దుకోవటానికి కాగా సహజమార్గ సాధనకు చెందిన ప్రార్థన మన లక్ష్యమైన ఈశ్వర ప్రాప్తికి చెందినదిగా ఉంటుంది. అది మన ఆంతరిక జీవనాన్ని దైవ సాక్షాత్కారం పొందటానికి యోగ్యంగా చేస్తూ, మన అంతరంగంలోనే ఉన్న దైవంతో యోగించేటట్లు చేస్తూ ఉంటుంది.**

మిషన్ నియమాలే కాకుండా, మన సహజమార్గ సాధనలో శ్రీ బాబూజీ మహరాజ్ మనకు ప్రతిపాదించిన ధ్యానం, నిర్మలీకరణ మరియు ప్రార్థన అయిన వాటిలో నిర్మలీకరణ మరియు ప్రార్థన గురించి వ్రాసివేయటం జరిగింది. ధ్యానం విషయం వచ్చేసరికి "హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు" అనే భావంతో కూర్చోవలసి ఉంటుంది. సహజమార్గంలో చెప్పబడిన పై మూడింటి భావాన్ని ఒకదానితో ఒకటి బాగా సంబంధించి ఉండేటట్లుగా శ్రీ బాబూజీ మహరాజ్ కల్పించిన కారణంగా మనం ఒక దానిని పాటిస్తూ ఉండగానే రెండవదాని దశ కూడా మనలో వికసించే ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. బాబూజీ తమ దివ్యశక్తితో వీటిని కూడా శక్తివంతంగా చేయటమే అందుకు నిదర్శనం. అభ్యాస కాలంలో సాధనను సక్రమంగా అభ్యసిస్తున్న సందర్భంలో దైవాన్ని గురించి మనలో ఉత్పన్నమయ్యే ప్రశ్న "బాబూజీ! మేము ఈశ్వరుని (దైవాన్ని) చూడలేదు కదా! మరి 'అతని' కోసం ధ్యానం చేయటం ఎలా?" అని. దాని **యదార్థం ఏమిటో బాబూజీ చాలా మృదువుగా వివరించారు– "ఈశ్వరుడు లోపలనే ఉన్నాడన్న ధ్యాసనే సదా కలిగి ఉండమని నేను చెప్పాను కాని, ధ్యానం చేయమని చెప్పలేదు. మరొకటి ఏమిటంటే, నీకు ఈశ్వరప్రాప్తి అను లక్ష్యం ఇవ్వబడింది అంటే, దానిని పొందటానికి ఏమేమి అవసరమవుతాయో అవన్నీ, హృదయంలో అతడిపైనే దృష్టి నిలుపుకోవటంవల్లనే మనలో సహజసిద్ధంగానే కలుగుతూ ఉంటాయి" అన్నారు. బాబూజీ ఇంకా ఏమన్నారంటే, "నీతో రాముడిని ధ్యానించు, కృష్ణుని ధ్యానించు" అని చెప్పినట్లయితే నీవు వారిని దర్శించి ఉంటావా? ఒకవేళ దర్శనం కలిగి ఉంటే వారిపైనే దృష్టి నిలిచి ఉంటుంది కనుక మరి ధ్యానించాల్సిన పని ఉండదు. చిత్రపటాన్ని పూజిస్తూ ఉండటాన్ని నీవు రాముని లేదా కృష్ణుని ధ్యానించినట్లుగా చెప్పలేవు. ఎందుకంటే అది ఒక చిత్రకారుని సృష్టి, దానిని అతడు తన అభిరుచికి తగినట్లుగా చిత్రించి ఉంటాడు.** మీరాబాయి, భక్త కబీరు, గోస్వామి తులసీదాసు –ఇంకా ఇతర భక్తులనేకులు తమ ఇష్టదైవాన్ని తమ ధ్యానంలో నిలుపుకున్నారు. ప్రేమతో బంధించుకున్నారు. ప్రేమ అనే సూత్రంతో తమ స్వామిని ఆకట్టుకుని మనస్సులో ప్రతిష్ఠించుకున్నారు. కనుకనే దర్శనం పొందాలనే తీవ్రకాంక్ష హృదయం యొక్క అధైర్యాన్ని ఆవలకు నెట్టివేసింది. మరోరకంగా చెప్పాలంటే ఆకాంక్షయే స్వయంగా తనను మరచిపోయింది. (అనగా తమ ఆరాధించే దైవంలో తల్లీనమైపోయింది) భక్తుడు కోల్పోయిన స్పృహ మళ్ళీ తిరిగి రాకపోవటమే భక్తి యొక్క అత్యంత రహస్యం. భక్తుడు తన రాముని (తను తలచిన దైవాన్ని) దర్శించటంలోనే రమించిపోతాడు. అటువంటప్పుడే నాకు, నా రాముడు అనగా నా బాబూజీ సర్వత్రా వ్యాపించి ఉన్నట్లుగాను, సమస్తమూ వారే అన్నట్లుగాను అనుభూతి కలిగింది. సాక్షత్కారం అనే పరమదశ ప్రాప్తించే శుభఘడియ ఇదే విధంగా ఉంటుంది. అందరికీ ఇటువంటి దివ్యానందప్రాప్తి సులభం కావాలని నేను బాబూజీని ప్రార్థిస్తున్నాను. హృదయంలో ఈశ్వర సామీప్యత పొందిన తరువాత ఈశ్వరీయ కాంతితో మొదట హృదయం, తర్వాత క్రమంగా మన పూర్ణ వ్యవస్థ (సిస్టమ్) ప్రకాశవంతమవుతాయి. హృదయంలో ఈశ్వరుని ధ్యానం నిర్విరామంగా ఉన్నట్లు అనుభూతి చెందటం మూలంగా, మనకు బాధాకరమైన విషయాలు, సహజంగానే మన అంతఃకరణ నుంచి వైదొలగిపోతూ ఉంటాయి, అది నిర్మలమవుతూ ఉంటుంది. సహజమైన జీవ–దైవ సంబంధం మళ్ళీ నెలకొని, మన వ్యవస్థ అంతా నేత్రమయమైపోయి లోపల–బయట ఎటు చూసినా సాక్షాత్కారం పొందుతన్న దశను వ్యాపింపజేస్తుంది. మన దృష్టి అంతర్ముఖమై దివ్యసౌందర్య దర్శనంలో లీనమైపోతుంది.

ఇదే కాకుండా, ధ్యానం చెదరకుండా, అంటే ఏకాగ్రతతో ఉంటూ ఉండగా ఒకానొక రోజున ధ్యానంలో అన్నీ మటుమాయమైపోయి దైవం మాత్రమే మిగిలి ఉంటాడు. ఆ స్థితిలో నేను వారిని ధ్యానించుతున్నానో లేక స్వయంగా దైవం యొక్క తలంపులోనే నా తలంపు (ధ్యాస) అంతర్లీనమైపోయిందో గ్రహించలేకపోయినట్లుగా (తికమకపడినట్లుగా) నేను అనుభూతి చెందాను. నేను బాబూజీకి వ్రాసిన మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రాత్రి సమయంలో నిద్ర నుంచి మేలుకొని కళ్ళు తెరచినపుడు దైవం నుంచి తిరిగివచ్చినట్లుగాను, మళ్ళీ ప్రాపంచిక స్పృహలోకి రావటానికి కొంత సమయం పడుతున్నట్లుగా అనిపిస్తోంది, అని వ్రాశాను. దానికి బదులుగా బాబూజీ, "నీ ఉత్తరం అందింది. దానిని గురించి నేను చెప్పేదేమంటే, నీవు గాఢమైన సుషుప్తి అవస్థలోకి వెళ్ళిపోతున్నావు నీ ఈ స్థితికి అభినందిస్తున్నాను. దివ్య ప్రకృతి నీలో ఊపిరి తీసుకుంటూ ఉన్నందుకు సంతోషం" అని వ్రాశారు.

సహజమార్గ సాధన యొక్క ధ్యానం మాత్రమే మన మానవ ప్రకృతిని ఎంతగా మార్చివేసిందో చూడండి! దైవీయ వరం ఫలితంగా మనకు దక్కేది ఇలా ఉంటుంది: సంకుచితమైన మానవ ప్రకృతి నుంచి విరాట్ ప్రకృతి స్థితి, ఆ మీదట విరాట్ ప్రకృతి నుంచి దివ్య ప్రకృతి జీవనం, చివరకు మన బాబూజీ ఆది ప్రకృతిలో జీవింపజేసి తన ఈ కుమార్తెను ఆదిశక్తి యొక్క వాకిలిలోనికి ప్రవేశపెట్టి, తరువాత తమ చరణాలవద్ద ఆశ్రయమిచ్చి అంతిమం గురించి తెలుసుకునేటట్లు చేశారు. బాబూజీ వ్రాసిన "దస్ ఉసూలోంకీ శరహ్" (దశ నియమాల వ్యాఖ్యానం) అనే గ్రంథం ఆద్యంతమూ ప్రకృతికి అద్దం పట్టినట్లుగా ఉంటుంది. ప్రకృతి యొక్క అద్భుతాన్ని బాబూజీ మన అందరికోసం దేదీప్యమానం చేశారు. ఆత్మ పరమాత్మలో విలీనమైపోతుంది. జీవుడు దైవంలో కలిసిపోయి లీలామాత్రపు రూపంలో బాబూజీ సంకల్పంలో లయమైపోయి సెంట్రల్ రీజియన్‌లో ఈదులాడిన తర్వాత దాని ముఖ్యకేంద్ర బిందువులో విలీనమైపోతుంది. ఇంక లీలామాత్రపు శేషం యొక్క అవశేషమూ లేనిదాని ఆసరాతో (ఐడెంటిటి కెనాట్ బి ఐడెంటిఫై ఇట్ సెల్ఫ్) శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమపూర్వకమైన దివ్యతా దృష్టి ద్వారా శక్తికి మూలకేంద్రమైన అంతిమం (అల్టిమేట్) యొక్క అనంతక్షేత్రంలో ఎలా వ్యాప్తమైపోతామో మనకే తెలియదు. శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన సదాచరణకు సంబంధించిన దశ నియమాలు వాటి నిజస్థితిని (వాస్తవికతను) మనకు వెల్లడిచేస్తున్నాయి. శ్రీ బాబూజీ మహరాజ్ కృపతో ఈ లేఖిని వ్రాసిన పుస్తకం "సహజమార్గ దశ నియమాల దివ్య సౌందర్యం" రూపంలో ఆదిశక్తి లేదా ఆది ప్రకృతి యొక్క ఊహాతీతమైన రహస్యాలు మరియు సంపూర్ణ సారాంశాన్ని మీముందు ఉంచుతోంది.

# అహం నుంచి ఐడెంటిటీ వరకు



# ఉపసౌందర్యం

నా ఈ నూతన పుస్తకం "సహజమార్గ దశనియమాల దివ్యసౌందర్యం" అద్భుతమైన దైవిక సౌందర్యం నుంచి ఆంతరిక శ్రేష్ఠ సౌందర్యాన్ని సంతరించుకుంది. "ఈశ్వరుడు హృదయంలో నెలకొని ఉన్నాడు" అనేది నా అభ్యాస జీవితంలో దైవ సామీప్యతకు చెందిన ప్రథమపాఠం. అదే ధ్యానంలోనే నిరంతరం మునిగి ఉండునట్లు ఆచిరించిన కారణంగా ఆ దైవ సామీప్యతను పొందాను. ప్రార్థన ద్వారా, సమర్పణ అనే దానిని – ఆ పాఠం నేర్పింది. సాక్షాత్కారానికి అనువైన శ్రేష్ఠస్థితి, నాకు సాయుజ్యత అనే శ్రేష్ఠదశను అనగా లయ అవస్థను ప్రసాదించింది. దానిలోనే నేను, సహజమార్గపు దశ నియమాల విశిష్ట సౌందర్యాన్ని కూడా నా ఆంతరికంలో దేదీప్యమానంగా పొందాను. హృదయంలో నిరంతరంగా శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యప్రాణాహుతి ధారా ప్రవాహం, దానితోపాటు వారి దైవిక దృష్టి ఆకర్షణ మేళవింపుతోనే నేను నేడు ఈ పుస్తకాన్ని సమర్పిస్తున్నాను. ఇది సాక్షాత్కారం పొందటానికి అర్హమైన ఆంతరిక సౌందర్య స్థితిని పరీక్షించుకోవటానికి దివ్య ప్రమాణం వంటిది. దీనితో మీరు స్వయంగా పరీక్షించుకోవటానికి దివ్య ప్రమాణం వంటిది. దీనితో మీరు స్వయంగా పరీక్షించుకోవటానికి సిద్ధం చేశాను. శ్రీరామచంద్ర మిషన్‌లోని సహజమార్గపు దశ నియమాలను పాటించటంకంటే వాటిని ఆధ్యాత్మికోన్నతికి కొలబద్దగానే అనుభూతి చెందాను. దానికి కారణం ఒకటి ఉంది. ఈశ్వరప్రాప్తి గురించి మనలో కలిగే తపన మనల్ని నియమాలు పాటించటం గురించి ఆలోచించే అవకాశం కూడా ఇవ్వదు. అయినప్పటికీ దివ్య సాక్షాత్కారం పొందే శుభ ముహూర్తాన్ని నా బాబూజీ నాకు ప్రసాదించిన సమయంలో నా ఆంతరికం ఆ దశ నియమాల సౌందర్యంతో శోభించుతున్నట్లుగా అనుభూతి చెందాను. ఇతర సంస్థలలో నియమనిష్ఠలు పాటించటానికే ప్రాధాన్యత నివ్వబడుతుంది. అలా ఎందుకంటే సాధకుని ఆంతరికం దివ్యత్వం పొందటానికి తగినట్లుగా తయారు కావలసి ఉంటుంది. అందుకే బాబూజీ అభ్యాసులకు "హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు" అనే తలంపుతో ఉండమని చెప్పి అభ్యాసి యొక్క ప్రాథమిక ఆలోచనను దైవంతో యోగింపజేయటానికి దైవిక ఆకర్షణ అను దానిని ఒక లింకుగా కలిపి దాన్ని నిరంతరం సంబంధంగా ఏర్పరిచారు. అప్పుడే సహజమార్గ దశ నియమాలు అభ్యాసి ప్రగతికి చెందిన శోభను అంచనా వేయటానికి సజీవ ప్రమాణంగా ఉంటాయి.

ఆది ప్రకృతి నుంచి మానవ ప్రకృతి వరకు గల సంపూర్ణ వివరణ సహజమార్గపు దశ నియమాలలో సమకూర్చబడి ఉంది. సృష్టికార్యం నిమిత్తం క్రియాన్విత శక్తిధార హెచ్చుతగ్గులు లేకుండా ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటుంది. సంకల్పమనే కుదుపుతో ఈ ప్రవాహం మూలధార నుంచి ప్రవహిస్తూ ఉంటుంది. యుగాలు మారవచ్చును గాని ఆదిశక్తి ప్రవాహంగాని, దాని ప్రకృతిగాని మార్పు చెందవు. అది నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. సహజమార్గ సాధనను స్వీకరించాక ప్రగతిపథంలో ఎల్లప్పుడూ ముందు పీఠాన ఉంటూ ఒకానొక రోజున ఒక సమయంలో నేనొక నిరవధిక ప్రవాహంలో అనగా సహజధారలో ప్రవేశించిపోయినట్లుగా అనుభూతి చెందాను. నేను ఈ దశను గురించి శ్రీ బాబూజీ మహరాజ్‌కి వ్రాయగా 'వారు' – "ఇప్పుడు నీకింక ఎవరి సహాయమూ అవసరం లేకుండాపోయింది; ఆఖరికి నా సహాయం కూడా. మూలం (సోర్స్) నుంచి ప్రవహిస్తున్న శక్తి నిన్ను స్వయంగా తనవైపుకు తీసుకుపోతుంది" అని

జవాబు ఇచ్చారు. నా దృష్టికి మాత్రం వారే కనిపిస్తున్నారు. అందువలన నేను వారికి ఇలా వ్రాశాను: "మీలో లయ అవస్థ పొందిన తర్వాతనే నేను భూమా ద్వారాన్ని స్పర్శించగలిగాను. నేను మీ పాదపద్మాల ఆశ్రయంతోనే, మీ దివ్య పరిశోధనా ఫలితంగా ఇటువంటి దివ్యసౌభాగ్యం, ప్రాణిమాత్రుల ఉద్ధరణకోసం సంప్రాప్తమైనట్లుగా గ్రహించాను. ఈ విషయంలో ఆధ్యాత్మిక క్షేత్రం యొక్క సంపూర్ణ చరిత్ర మౌనందాల్చినందునే నేను ఈ నిర్ణయానికి వచ్చాను."

అంతిమసత్యం (భూమా)ను గాని, శ్రీ బాబూజీ మహరాజ్ వివరించిన (జాత్) శక్తిని గాని గుర్తించకుండా అక్కడ ఎవరూ ఉండలేరు. ఇప్పుడు వారి ప్రాణాహుతి శక్తి ప్రవాహం పొందటం ద్వారా అందరికీ అది సాధ్యపడింది. నిజానికి పరమ పురుషునిగా ధరణిపైకి ఏతెంచిన వారి దివ్యరూపం, ప్రకృతిని ఆదిప్రకృతితో అలంకరించుతూ మరియు మానవ ప్రకృతిని దివ్య ప్రకృతిలో తీర్చిదిద్దుతూ, ఈ ధరాతలాన్ని ధన్యంచేస్తూ ఉంటుంది. ఓ బాబూజీ! మీ చరణ ధూళితో పునీతమైన ఈ పృధ్వి ఈ యుగాన్ని మీ దివ్య సౌందర్యపు విరాట్ స్వరూపకాంతితో శోభాయమానంగా చేస్తూ ఉంటుంది. 'వారి' యుగ పరివర్తన కార్యరూపం దాల్చటంలో ఆలస్యం జరగవచ్చునేమోకాని, ఈ పృథ్వి సత్యయుగ రూపాన్ని దర్శించి తీరుతుందనేది మాత్రం నిజం. 'వారు' తలపెట్టిన దివ్య సంకల్పమూ అదే కదా!

ఆదిశక్తి యొక్క పూర్తి విస్తరణ (వ్యాప్తి) గురించిన జ్ఞానం నిక్షిప్తమై ఉంది. ఎవరైతే సహజమార్గ సాధన ద్వారా అంతిమసత్యం యొక్క వైభవాన్ని కనువిప్పు చేశారో, వారే ఆది ప్రకృతి రహస్యాన్ని, దాని పనితీరును కూడా కనిపెట్టారు. శ్రీ బాబూజీ మహరాజ్ రచించిన "సహజమార్గ దశ నియమాల వివరణ" గ్రంథమే అందుకు సరియైన ఉదాహరణ. వారి మహత్తును గుర్తించటానికి అది ఒక చిహ్నం మాత్రమే. ఆ దివ్య విభూతి యొక్క దివ్య దరహాసంతో కూడిన ముఖారవిందాన్ని వీక్షిస్తూ, వారి దైవిక స్పర్శను పొంది లేఖిని దూసుకుపోతూ ఉంటే, నేను ఈ పుస్తకం వ్రాయగలిగాను. నా ఈ పుస్తకం "సహజమార్గ సార గర్భిత దశ నియమాలు" చదివిన తర్వాత, అది ఆది ప్రకృతి ముసుగును కూడా తొలగించి వేసింది అని గ్రహిస్తారు. అది నిజం కూడా!

**ఎరుక చేయబడినంతనే 'ఎరుక' పొందు**
**ఎరుక నందినంతనే 'లయ' పొందు ఏ ఎరుకలేక**

అనగా దైవ సాక్షాత్కారాన్ని కలిగించినపుడు దానిని పొందటమూ, పొందినంతనే తన్ను తాను మరచి 'వాని' లోనే లయమైపోవటమూ, అని అర్థం.

ఇంతేగాకుండా ఈ దివ్య విభూతి (శ్రీ బాబూజీ మహరాజ్) యొక్క హుందా, గౌరవం అందరిపట్ల ఎలా ఉంటాయో చూడండి. అభ్యాసికి కల్పించే స్థితిని గాని, ప్రిసెప్టర్ ఇతరులకు ఇచ్చే శక్తిని గాని ఎప్పుడూ ఉపసంహరించుకోరు. ఎప్పుడైనా అభ్యాసివలనగాని, ప్రిసెప్టర్‌వలనగాని తప్పు జరిగినప్పటికి వారికి ఇచ్చిన శక్తిని వెనక్కి తీసుకోవాలనే ఆలోచన 'వారి'కి ఎప్పుడూ రాలేదు. మిషన్ కార్యదర్శి, ఒక సందర్భంలో బాబూజీతో ఫలానా ప్రిసెప్టర్ తప్పు చేశాడని చెప్పి అతనికి ఇచ్చిన శక్తిని తిరిగి తీసుకోమని కోరాడు. అపుడు బాబూజీ వెంటనే "ఇది నా లాలాజీ ప్రతిష్టకు భంగం కలిగించినట్లవుతుంది. లాలాజీ నుంచి

ఇవ్వటమే నేర్చుకున్నాను కాని తీసుకోవటం కాదు" అని సమాధానం ఇచ్చారు. అంతేకాదు, "ఇచ్చినది తిరిగి తీసుకోకపోవటమనేది దైవ స్వభావం. గురువైనా, శిక్షకుడైనా ధర్మాన్ని ప్రసాదించుటయే కాని తిరిగి తీసుకోవటం కాదు. "ఒకవేళ వారెవరైనా తప్పు చేసినట్లయితే వారికి ఇవ్వబడిన శక్తి దానికదే మసకబారి బలహీనమైపోతుంది. దైవం నుంచి అనుగ్రహించటం, ఆశీర్వదించటం, ప్రేమించటం మాత్రమే ఉంటాయి" అని కూడా చెప్పారు. దీనినిబట్టి అసలు ఆధ్యాత్మిక శబ్దకోశంలో వాపసు (తిరిగి తీసుకోవటం) అను శబ్దమే లేదు. దివ్యమైన ఆలోచన లేదా సంకల్పంలోను, దివ్యప్రకృతి (స్వభావం) లోను ఉన్న స్వచ్ఛతకు దేనినైనా జోడించటంగాని, తీసివేయటంగాని జరగదు, అని వారి నుంచే తెలుసుకున్నాను.

# అవతారాల దివ్య రహస్యం

అవతారాలు కూడా భూమిపై ప్రకటితం కావటానికి ముందు, లోకరీతిగానే తల్లిగర్భంలో ఉండి కష్టాలు అనుభవించవలసే ఉంటుందా? అనే ఒక ప్రశ్న ఉదయిస్తూ ఉండేది.

కొన్ని సంవత్సరాలకు పూర్వం ఈ ప్రశ్న విన్నప్పటి నుండి నా అంతరంగంలో ఏదో ఎక్కడో వేధిస్తూనే ఉంది. ఈ పుస్తక రచనా కాలంలో నా అంతరంగంలో ఈ ప్రశ్న చాలాసార్లు తలెత్తింది. అందువలన పుస్తకం పూర్తయిన తర్వాత ఈ ప్రశ్నకు జవాబు స్వయంగా దైవం నుంచి రాగలదని భావించి, చేత కలం పట్టుకుని నా బాబూజీ మహరాజ్ ఎదుట కూర్చున్నాను. అప్పుడే ఈ ప్రశ్నకు పరిష్కారం నాకు దొరికింది. దానినే అందరికీ తెలియజెప్పటానికి ఇలా వివరిస్తున్నాను. భక్తులు మీరాబాయి, కబీరు, తులసీదాసు, సూరదాసు మొదలైనవారు దర్శనమనండి లేదా సాక్షాత్కారమనండి – దానిని వారు పొందారు. అంటే అర్థం ఏమిటి? దానిని గురించి నా దృష్టికి ఏమి కనిపిస్తోందో తెలియజేస్తాను. నేను శ్రీ బాబూజీ మహరాజ్‌కి నా ఉత్తరంలో ఇలా వ్రాశాను: "సాక్షాత్కారం నా ఎదుట ప్రత్యక్షమై ఉంది. మానవీయ శరీరపు హద్దులు దాటి సర్వత్రా వ్యాపించిన విరాట్, ఈశ్వరీయ దివ్య సౌందర్యం మాత్రమే నా ఎదుట ఉన్నాయి. ఇప్పుడు విరాట్ శబ్దం తన గురించి స్వయంగా ఇలా స్పష్టం చేస్తున్నట్లుగా ఉంది. శ్రీరాముడు అవతరించబోయే ముందు కౌసల్య మహారాణికి వారి విరాట్ రూపం సాక్షాత్కరించింది. అప్పుడు ఆమె తాను ఆ విరాట్ రూపాన్ని భరించలేననీ, మానవ రూపంలో బాలుడుగా కోరుకుంటున్నానని ప్రార్థించింది.

శ్రీకృష్ణావతారం విషయంలో కూడా ఇలాగే జరిగింది. దేవకీ వసుదేవులు ఆ పరమ శక్తి యొక్క విరాట్ రూప సాక్షాత్కారాన్ని పొందారు. వారి ప్రార్థన అలకించబడి ఆ విరాట్ సౌందర్యం బాలుడైన శ్రీకృష్ణుని రూపం దాల్చి తల్లిగర్భంలో ప్రవేశించటం జరిగింది. మరి దీనిలోని మర్మం ఏమిటి? దీనికి సమాధానం నా లేఖిని ఎదుట ఆ మర్మమే తన మర్మం విప్పి చెప్పుతున్నట్లుగా ఉంది. అదేమిటో ఆలకించండి– అవతారం యొక్క దైవీయ మానవరూపాన్ని స్వయంగా ప్రకృతియే రూపొందిస్తుంది. అందుచేత అది మొదట విరాట్ రూపం దాల్చి సమస్త ప్రకృతిలోను వ్యాపిస్తుంది. ఇలా ప్రకృతి అంతటా వ్యాపించి ఉన్న విరాట్

రూపం యొక్క దర్శనమో లేక సాక్షాత్కారమో కొంత కాలం వరకు అనగా ప్రకృతిలో మరొక అవతారం జరగనంత వరకు భక్తులకు దర్శనమిచ్చి ఆరాధ్యంగా ఉంటుంది. ప్రకృతి రహస్యం ఇంకొకటి నాకు ఇలా వివరిస్తోంది: “రాణులలో సాధారణ స్త్రీలలో వలెనే గర్భవతుల లక్షణాలు కనిపిస్తాయి. వాటిని ప్రకృతియే స్వయంగా నిర్వహిస్తూ ఉంటుంది. అందుచేత అవతారాలకు ‘ప్రకటితమవ్వటం’ లేదా ‘అవతరించటం’ అనే శబ్దం వాడబడుతుంది. అనగా వారు స్వయంగా ఇచ్ఛాపూర్వకంగా రూపం దాల్చటమే కనుక “జన్మించటం” అనే మాట ప్రయోగించబడదు. ఏమైనప్పటికి, లోక కళ్యాణం కోసం దివ్య మానవ రూపంలో దైవాగమన కార్యాన్ని ప్రకృతి స్వయంగా నిర్వహిస్తుంది. అందుకే ఈ విశిష్టమైన భౌతికరూపం కూడా ప్రకృతి యొక్క శోభతోను, తేజస్సుతోను వెలుగొందుతూ ఉంటుంది. అణువణువులోనూ ప్రకృతి శోభ విరాజిల్లుతూ, దివ్య శక్తి తేజస్సుతో మూర్తీభవించిన ఈ రూపం పంచభూతాల కతీతమైనదిగా ఉండి అలౌకికమైనదిగాను, అనుపమానమైనదిగాను భాసిస్తూ ఉంటుంది. అవతారాల దివ్య రహస్యం ఇదియే.”

# కృతజ్ఞత కాదు ప్రేమ

శ్రీ బాబూజీ మహరాజ్ అపేక్షను నేను సాఫల్యం చేయటంలో నాకు అనుక్షణం సహాయకారిగా నిలిచిన నా సోదరి కేసరి ఇప్పుడు ‘వారి’ దరహాసానికి సమర్పితమైంది. ఆరంభం నుంచి నేటివరకు నా ప్రతి హిందీ రచననూ, శుద్ధంగాను, చక్కగా చదవగలిగినట్లుగాను ప్రేమతో వ్రాసి ఇవ్వటంతోపాటు, ముద్రించేటపుడు ప్రూఫులు చూసి ముద్రణ చేయించి పుస్తకం రూపంలో అభ్యాసీ సోదర సోదరీమణు లందరికీ అందించే ప్రయత్నంలో భారమంతా నాటికీ, నేటికీ ఆమెదే. అంతేగాకుండా ఈ పుస్తకాల ఆంగ్లానువాదాన్ని కూడా స్పష్టంగా వ్రాసి ప్రెస్‌కు అప్పగించటమూ, ప్రూఫులు చూడటమూ వంటి పనులన్నిటికీ ఆమెయే బాధ్యత వహించింది. నా తమ్ముడు పి. డి. చతుర్వేది కూడా ముద్రణా లోపాల్ని చూసే కార్యక్రమంలో తగినంతగా శ్రద్ధ వహించారు. బాబూజీ యొక్క ఈ బిడ్డలిద్దరూ ‘వారి’ చరణాలకే సమర్పితమయ్యారు. ఈ ఇరువురికీ ఇటువంటి దైవీయ కార్యాలు నిర్వహించే శక్తి సామర్థ్యాలను సమృద్ధిగా కలిగేటట్లు ‘వారు’ ఆశీర్వదించాలని నా ప్రార్థన. అడగడుగునా ఉన్నతి పొందుతూ ఉండాలని నా అభిలాష. వారికి నా ప్రేమ పూరిత ఆశీస్సులు సదా ఉంటాయి. వారికిదే నా కృతజ్ఞత.

**– కస్తూరి.**

ఏదో ఒక దానిపై ఇష్టపడటం అంటే అహంకారమే. కనుక ఇష్టాయిష్టాలకు అతీతంగా ఎదగాలి.

నైతిక శిక్షణకు సంబంధించినది:--

1. ఎవ్వరైనా వక్రత ఏర్పడకుండా చూసుకోవాలి.

2. అభ్యాసి నైతికత్వం, క్రమశిక్షణ అభివృద్ధి పరచుకోవాలి.

3. బద్ధకాన్ని వదలివేయాలి. పూర్వకాలంలో గొప్ప సామ్రాజ్యాలే ఈ బద్ధకం వలన పతనమయ్యాయి.

4. అభ్యాసీ సోదర సోదరీమణుల మధ్య ఎడం పాటించాలి. అభ్యాసీ సోదరులు ఇతర అభ్యాసీ సోదరులతో ఉన్నంత చనువుగా అభ్యాసీ సోదరీమణులతో ఉండరాదు.

5. మద్యపానం చేయకూడదు. మత్తులో ఉన్నప్పుడు దాని ప్రభావం శరీరంపైబడి మెదడులో చీకటి ఏర్పడుతుంది. ఆధ్యాత్మికత నశిస్తుంది.

6. అభ్యాసీ అన్ని విషయాలలో పొదుపు పాటించాలి. ఐదు రూపాయలు ఖర్చు చేసినా, ఐదువేలు ఖర్చు చేసినా భేదం స్వల్పం. అనవసరంగా ఖర్చు చేయరాదు.

7. నిరాడంబరత ప్రకృతికి ప్రాణం. ప్రతి ఒక్కరు దానిని అనుసరించాలి. శ్రీరామచంద్ర మిషన్‌లో ఉన్న ఆకర్షణ ఏమిటంటే, ఏ ఆకర్షణ లేకపోవటమే. ఇదియే ఈ సంస్థ విలక్షణత. ఇది పవిత్రం, నిరాడంబరం.

8. అభ్యాసీ అసంబద్ధమైన (తప్పుడు) ప్రచారంలో నిమగ్నం కాకూడదు.

9. అణకువ, నమ్రతలలోనే గొప్పదనం ఇమిడి ఉన్నది. ప్రతి అభ్యాసీ ఈ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలి.

10. ఉత్సవ సమయాలలో అభ్యాసీలు, వారి బంధువులను కాని, స్నేహితులను కాని (అభ్యాసీలు కానివారిని) తీసుకురాకూడదు.

– బాబూజీ మహరాజ్

**1.** దైవం నీ హృదయంలోపల దాగి ఉండి, నిన్ను బయట ఉండేటట్లు చేశాడు. ఇప్పుడు నీవు నీలో దాగి ఉండి దైవాన్ని బహిర్గతం చేయి. ఇదే సరియైన సాధన.

**2.** ఏకాగ్రతను అభ్యసించటం ద్వారా ఈశ్వరుని పొందలేము. ఎందుకంటే ఏకాగ్రతలో మనం ఒకే దృష్టితో (తదేక దృష్టితో) ఉండిపోతాం కాని మరి దేనినీ చూడలేము. కాని ధ్యానంలో మనం దేని కోసమో ఎదురుచూస్తూ ఉంటాం. అలా ఎదురు చూడబడేదే "ఈశ్వరుడు".

**3.** పని చేయడానికి మంచి రోజు – ఈ రోజే!

నీకిచ్చిన గొప్పవరం – క్షమాగుణం

ఒక గొప్ప అవసరం – వివేకం

**4.** ప్రాణాహుతి అనేది ఒక దైవిక శక్తి. అది మానవుణ్ని రూపాంతరణ గావించటానికి (లేదా మానవునిలో పరిణామం తీసుకు రావటానికి) ప్రయోగించబడుతుంది. ప్రాణాహుతి యొక్క ప్రతిఫలం రూపాంతరణమే.

**5.** మనం ఆచార వ్యవహారాలను పాటించాలి. అందుకు ఆధారంగా (ప్రాతిపదికగా) శ్రేష్టమైన ఆచరణలనే ఆలంబనగా తీసుకోవాలి. దానికి కృషిని ఆసరాగా తీసుకుంటే లక్ష్యం నెరవేరుతుంది.

**6.** తన గురువును భక్తి పూర్వకంగా ప్రేమించేవాడు తనకు చెందిన ప్రతిదాన్నీ ఆయనకు అంకితం చేస్తాడు. తన గురువులో సంపూర్ణంగా లయాన్ని పొంది, లోపలా బయటా – అంతటా ఎల్లప్పుడూ ఆ గురువునే చూస్తాడు. అదే విధంగా ఒకటే అయినటువంటి ఆ "సత్" తో లయాన్ని పొందినవాడే ప్రతిచోటా ఆ దైవమే ప్రత్యక్షమైనట్లు చూస్తాడు.

**7.** సత్యం అంటే ఏమిటి? అది ఆధారం లేకుండానే ఆసరాగా ఉండేది. ఆధ్యాత్మిక శక్తులన్నీ వికసించి నిరంతరం సమతుల్యం కొనసాగినపుడే అది పరిపూర్ణమైనదిగా, సర్వజ్ఞతగా ఉంటుంది.

**8.** ప్రపంచంలోని విశేషణాలు, విశ్లేషణలు అన్నీ తొలగించబడ్డాక ఏదైతే మిగిలి ఉంటుందో 'అది' అదే దైవం అని నిర్వచింపవలసి ఉంటుంది.

**9.** మీరు నన్ను అడిగితే – విశ్వం సత్యత్వం యొక్క అతి విస్తరణయే అని నేను అంటాను.

– బాబూజీ మహరాజ్

